


# పాశుపతం

మంచాల శ్రీనివాసరావు

# పాశుపతం

(ఇంటర్నేషనల్ స్పై థ్రిల్లర్)

✤

మంచాల శ్రీనివాసరావు

ముచ్చట.కామ్ సమర్పణలో...

జె.వి. పబ్లికేషన్స్

హైదరాబాద్

**Pasupatham**

(an International Spy Thriller)

By

Manchala Srinivasa Rao

First Published: August, 2015

© Author

Brindavan Residency,
Behind Siva Ganga Theatre
New Gaddiannaram Colony,
Dilsukhnagar, Hyderabad.
Ph: 7702086787

Cover Design: Bhavana Grafix

Copies: 500

Rs. 100/-

*Published by:*
**J.V. Publications**
Hyderabad.
Cell: 80963 10140

*Printed at:*
**Himalaya Graphics**
Chikkadpally, Hyderabad.
Ph: 65552357

*for Copies:*
Sole Distributors
**Sai Venkata Ramana Book Distributors,**
Gandhi Nagar, Hyderabad.
Ph: 040-2754 3500, 9676799500

All Major Book Shops

# పాశుపతం

**ల్యాం**డ్ ఫోన్ మోగుతోంది. ఆమె చిరాకుగా చూసింది. మొబైల్స్ వచ్చినా అందరికీ తెలిసిన తన పాత ల్యాండ్ ఫోన్ నంబర్ వదిలేసుకోలేక దాన్ని కంటిన్యూ చేస్తున్నది.

కాఫీ సిప్ చేస్తూనే ఫోన్ లిఫ్ట్ చేసింది.

'హలో... దిసీజ్ దివిజ స్పీకింగ్..."

'హలో, నా పేరు బషీర్, హోటల్ మేరియట్‌లో ఉన్నాను. రూమ్ నంబర్ 511. ఐ నీడ్ యువర్ హెల్ప్...

'ఏమిటో చెప్పండి...'

'ఫోన్‌లో వద్దు, మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. రమ్మంటారా?'

'బాగా లేటైపోయింది. పోనీ, అరగంటలో రాగలరా?'

ఆమె ఆలోచిస్తోంది. హిమాయత్‌నగర్‌లోని తన ఆఫీసుకు వేగంగా వస్తే అరగంట పెద్ద సమస్య కాదు. కానీ హైదరాబాద్ ట్రాఫిక్‌లో చాలా కష్టం. 9 గంటలకు రవీంద్రభారతిలో తనకు తెలిసిన ఓ లాయర్ కుమార్తె అరంగేట్రంకు వస్తానని ప్రామిస్ చేసింది. అదే ఆలోచిస్తోంది. తనకు డ్యూటీకన్నా ఎక్కువేమీ కాదు. కానీ పనికిమాలిన కేసులు చాలా వస్తుంటాయి. ఇది అందులో ఒకటైతే కష్టం.

'నేను వెంటనే బయల్దేరతాను. పావుగంటలో అక్కడుంటా...' అని ఫోన్ పెట్టేసింది ఆ అపరిచిత కంఠం.

ఎప్పుడూ కొత్తగా, డైనమిక్‌గా ఆలోచించే అలవాటున్న ఆమె డిగ్రీ కాగానే సొంతంగా ఓ ప్రైవేటు డిటెక్టివ్ ఏజెన్సీ పెట్టుకుంది. తనకంటూ ఎవరూ లేరు. ఎక్కడో తారసపడిన యాదగిరిని అసిస్టెంటుగా పెట్టుకుని ఆఫీసు ఓపెన్ చేసింది.

తార్కికంగా ఆలోచించడం, సొంతంగా నేరపరిశోధన చేయడం, చట్టానికి వ్యతిరేకంగా వెళ్లకపోవడం, ప్రపంచవ్యాప్త పరిణామాలను అధ్యయనం చేయడం, సంక్లిష్ట కేసుల్ని పరీక్షిస్తూ అవగాహన పెంచుకోవడం, హుందా ప్రవర్తనతో తన వృత్తి బాగానే సాగుతోంది. ఏదైనా ఛాలెంజింగ్ కేసు వస్తే బాగుండునని ఆశిస్తున్నది. కానీ అన్నీ చిన్న చిన్న కేసులే తగులుతున్నాయి. ఆఫీసు మెయింటెనెన్స్‌కు ఇబ్బంది లేకపోయినా తన ఇన్‌స్టింక్ట్ తృప్తి పడటం లేదు.

'మేడమ్, వెళ్లిపోదామా... మీరు చెప్పిన కస్టమర్ వస్తానని చెప్పి అరగంట లేట్ ఇప్పటికే...' గుర్తుచేశాడు యాదగిరి.

'ఓసారి మేరియట్‌కి ఫోన్ చేసి కనుక్కో...'

నాలుగైదుసార్లు ఎంగేజ్ టోన్ వినిపించాక, అయిదోసారి కలిసింది కాల్.

'రూమ్ నంబర్ 511. మిస్టర్ బషీర్‌కు కనెక్ట్ చేస్తారా?'

'సారీ సర్... తను సూసైడ్ చేసుకున్నాడు. మీరెవరు?'

'ఓహ్ సారీ... ఎలా...'

'కిటికీలోంచి దూకి...'

నిరాశగా ఫోన్ పెట్టేశాడు యాదగిరి. అదే విషయాన్ని ఆమెతో చెప్పాడు.

'మరింకేం? ఈరోజు పనేమీ లేదుగా. నాకు ల్యాబ్‌లో కొంత పనుంది. నువ్వు వెళ్లు...' అందామె టేబుల్ సర్దుతూ...

యాదగిరి అటు వెళ్లాడో లేదో... ఆమె మొబైల్ మోగసాగింది. ప్రైవేటు నంబర్ అని ట్రూ కాలర్ చూపిస్తోంది. తన నంబరుకు వచ్చే ప్రైవేటు నంబర్లు కొన్నే. ఐడెంటిటీ లేకుండా వచ్చే కాల్స్ అవి. అధికారికంగా దరఖాస్తు చేస్తే తప్ప కాల్ ప్రొవైడర్స్ అలా నంబర్‌ను హైడ్ చేయరు.

అందుకే వెంటనే అటెండైంది. అవెంత ఇంపార్టెంటో ఆమెకు తెలుసు. ఇప్పుడిప్పుడే నేరపరిశోధనలో పేరు తెచ్చుకుంటున్న తనకు హయ్యర్ అఫీషియల్స్ సపోర్ట్ ఎంతో కూడా తెలుసామెకు. ఆ నంబర్ ఎక్కడి నుంచి వస్తుందో కూడా ఆమె మొబైల్ లో కనిపిస్తూనే ఉంది. తనకు తెలిసిన ఓ కమ్యూనికేషన్ ఇంజినీర్‌తో

ఓ ప్రత్యేక యాప్ చేయించుకుంది ఆమె. జీపీఆర్‌ఎస్ ద్వారా ఆ కాల్ ఎక్కడి నుంచి వస్తుందో పిన్ పాయింట్‌గా కనిపిస్తుందా మొబైల్‌లో... ఆ కాల్ ఢిల్లీలోని రా ఆఫీసు నుంచి వస్తుందనే విషయం తెలుస్తూనే ఉంది. ఐనా మర్యాదగా ఫోన్ కాల్ యాక్సెప్ట్ చేస్తూ అడిగింది...

'ఎవరూ...?'

'ఏమ్మా, బాగున్నావా? ... నేనెవరినో, ఎక్కడి నుంచి చేస్తున్నానో నీకు తెలుసని నాకూ తెలుసు...'

'చెప్పండి సార్...' నవ్వుకుంటూనే మర్యాదగా బదులిచ్చిందామె.

'హోటల్ మేరియట్‌లో బషీర్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఫ్ ది రికార్డ్ నేను నీకు ఫీజు పే చేస్తాను. ఈ కేసు డీల్ చేయాలి. సరేనా?'

'సరే సార్... మీరు చెప్పాక తిరుగేముంది. మళ్లీ మీకు కాల్ చేస్తాను...' అని పెట్టేయబోతుండగా ఆయన చెప్పాడు.

'మా ఏజెంట్ ఒకరు నిన్ను మీటవుతాడు... గుడ్ నైట్.'

'వోకే సార్... గుడ్ నైట్' చెప్పి పెట్టేసిందామె....

దేశభద్రతకు గుండెకాయ వంటి రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) డైరెక్టర్ చెప్పాడంటే అది మామూలు కేసు కాదని అర్థమవుతూనే ఉంది. ఆయన కూడా చిన్న చిన్న కేసులు ఎవరితోనూ షేర్ చేసుకోడు. ఇంటలిజెన్స్ బ్యూరో, రా, సీబీఐ వంటి కీలకమైన విభాగాల్లో మూడోవంతు పోస్టులు ఖాళీయే... ఎంతసేపూ రాజకీయాలే తప్ప వీటిని పటిష్టం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడంతో అవన్నీ రాను రాను నిస్తేజంగా తయారవుతున్నాయి. పైగా ఐబీ వంటి పోస్టుల్లోకి రావటానికి కొత్తగా ఎవరూ ఆసక్తి చూపడం లేదు... పేమెంట్ తక్కువగా ఉండటం, ఐటీ జాబ్స్ పైనే యువతకు క్రేజ్ పెరిగిపోవడం, పైగా రొటీన్ రిపోర్టులు, అంతేగాకుండా రిక్రూట్‌మెంట్ చాలాకాలంగా ఆగిపోవడం వల్ల చాలా కొరత ఫీలవుతున్నాయి ఆ రక్షణ విభాగాలు... ఐనా సరే, దేశభక్తి నరనరాన నిండిన నరసింహన్ దానికి డైరెక్టర్‌గా ఉండటం వల్ల ఆ కొరత ప్రభావం కనిపించకుండానే పనులు సాగుతున్నాయి. తమిళనాడు సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన ఆయన ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి. మెయిన్ స్ట్రీంలో గాకుండా రహస్య విభాగాల్లోనే ఎక్కువకాలం పనిచేసిన ఆయన హార్డ్ కోర్ దేశభక్తుడు. అందుకే కీలకమైన కేసులొచ్చినప్పుడు తనకు అలాట్ చేసిన

అనాడిటెడ్ (లెక్కలు చూపించనవసరం లేని డబ్బు) మనీ నుంచి కొంత ఖర్చు చేస్తూ, దివిజ వంటి నిజాయితీ కలిగిన ప్రైవేటు డిటెక్టివ్‌లకు పనులు అప్పగిస్తుంటాడు. ఈ విషయం ఆమెకూ క్షుణ్ణంగా తెలుసు. అందుకే రెట్టించలేదు ఆమె. ఆయనంటే ఆమెకు అంతులేని గౌరవం. చిన్న వయసులోనే అత్యంత చాకచక్యంగా కేసులు డీల్ చేసే ఆమె అంటే ఆయనకూ పుత్రికావాత్సల్యం.

లైట్ ఆఫ్ చేసి, ఇంటి రక్షణ ఏర్పాట్లు ఓసారి చెక్ చేసిందామె. ప్రమాద కరమైన వృత్తిలో ఉన్నందున అన్నిరకాల భద్రత ఏర్పాట్లు చేసుకుందామె. తనకొచ్చే ఫోన్ కాల్స్ ఎప్పటికప్పుడు రికార్డవుతుంటాయి. ఇంటి చుట్టూరా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు రియల్ టైమ్ దృశ్యాలను రికార్డు చేస్తుంటాయి. ఒకసారి మెయిన్ డోర్స్ క్లోజ్ చేశాక, వాటిని ఎలా ఓపెన్ చేసినా ఆ భవనమంతా మోగేలా అలారమ్‌లు కూడా బిగించుకుందామె. ప్రమాదకరమైన స్థితి వస్తే ప్రెస్ చేయటానికి వీలుగా పలుచోట్ల స్విచ్చులు పెట్టించుకుంది. అవి నొక్కితే సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫోన్ మోగి అలర్ట్ చేసే మెకానిజమూ ఉందక్కడ.... ఐనా మరోసారి చూసుకుని లైటాఫ్ చేసి బెడ్‌పై వాలింది.

❄ ❄ ❄

పొద్దున పది గంటలకే యాదగిరి అన్ని పేపర్లనూ తిరగేస్తున్నాడు. అప్పుడే టిఫిన్ చేసొచ్చిన దివిజ కాల్ డేటాను, వాట్సాప్ మెసేజీలను చెక్ చేసుకుంటోంది. సోషల్ మీడియాలోనూ ఆమె ఓ మారుపేరుతో అకౌంట్స్ మెయింటెన్ చేస్తుంటుంది. రకరకాల అభిప్రాయాలు, సమాచారం తెలుస్తుందని ఆమె ఆశ. కొత్త కొత్త యాప్స్‌ను తన ఫ్రెండ్‌తో క్రియేట్ చేయించి తనే సొంతంగా వాడుతుంటుంది. అకస్మాత్తుగా ఆమెకు రాత్రి నరసింహన్ చేసిన ఫోన్ గుర్తొచ్చింది. యాదగిరిని పిలుస్తుండగానే కాలింగ్ బజర్ మోగింది.

వ్యూమిర్రర్‌లో చూస్తే ఓ అనామకుడు కనిపించి, తలుపు తీసి, వెంటనే పక్కకు జరిగాడు యాదగిరి. తనూ దివిజ దగ్గర బాగా ట్రెయినింగ్ పొందినవాడే. ఎదుటివాడు అకస్మాత్తుగా దాడికి దిగితే వెంటనే అడ్డుకోవటానికి వీలుగా తలుపు పక్కకు జరిగాడు. లోపలికి వచ్చి అటూఇటూ చూసిన ఆ అపరిచితుడు నేరుగా దివిజ ఉన్న ఛాంబర్ వద్దకు చేరాడు.

'ఎవరు కావాలి నీకు?' అంటూ అడ్డుకునే ప్రయత్నం చేశాడు యాదగిరి.

జేబులో నుంచి అత్యాధునిక పిస్టల్ తీసి యాదగిరికి గురిపెట్టిన ఆ అపరిచితుడు మీ బాస్ ఎక్కడ అంటూ అరిచాడు.

ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాడు యాదగిరి. ఈలోపు ఆఫీసులోని వాతావరణంలో ఏదో అసహజత్వాన్ని గమనించిన దివిజ లోపలి నుంచే బయట ఏం జరుగుతున్నదో చూడటం మొదలెట్టింది.... ఆమె డిటెక్టివ్ బుర్ర డేంజర్ సిగ్నల్స్ పంపిస్తూనే ఉంది...

మూలమూలనా ఉన్న సీసీ కెమెరాలు స్పష్టంగా అపరిచితుడి కదలికలను తెలియజేస్తున్నాయి.

ఏదో తేడా ఉందని గమనించిన ఆమె ప్రత్యేక లైసెన్సు పొందిన సోఫిస్టికేటెడ్ వెపన్ చేతిలో పట్టుకుని ఛాంబర్ డోర్ తీసి, వెంటనే ఓ పక్కన నక్కింది....

దివిజ లోపల కూర్చున్నా సరే, తన ఛాంబర్ బయట ఏం జరుగుతుందో తెలుసుకునే ఏర్పాట్లు ఉండటంతో యాదగిరి కామ్‌గా ఉండిపోయాడు. కొద్దిగా ఛాన్స్ దొరికితే మీదపడి కుమ్మేద్దామని ఉంది గానీ అతను క్లోజ్ రేంజ్‌లో తనకు పిస్టల్ గురిపెట్టి ఉన్నాడు. ఈలోపు దివిజ తనే అలర్టయిపోయింది.

అపరిచితుడు యాదగిరిని ముందుకు నెడుతూనే లోపలికి ఎంట్రీ ఇచ్చాడు. ప్రొఫెషనల్‌గా కనిపిస్తున్నాడు. ఒకవేళ దివిజ కాల్పులు జరిగినా ముందు యాదగిరికే తగుల్తాయి. అందుకే దివిజ తమకు అలవాటైన ఓ పద్ధతిని అమల్లోకి పెట్టేసింది. అపరిచితుడు నేరుగా యాదగిరిని ముందుపెట్టి పిస్టల్‌ను ఆమెకు గురిపెట్టాడు

ఆమె చేసిన సైగ అర్థం చేసుకున్న యాదగిరి అకస్మాత్తుగా నిశ్శబ్దంగా కిందకు జారిపోయాడు. ఆమె వేగంగా అపరిచితుడి మొహంపైకి ఓ రౌండాస్ కిక్ డెలివరీ చేసింది.

ఆమెకు కరాటే, టైక్వాండో, కుంగ్ ఫూ మూడు యుద్ధ క్రీడల్లోనూ ప్రవేశం ఉంది. ఒకదాంట్లో బ్లాక్ బెల్ట్ ఉంది. నిజానికి కొన్ని మార్షల్ ఆర్ట్స్ దాదాపు ఒకేరకంగా ఉంటాయి. పోరాడే పద్ధతుల్లోనే కొంచెం తేడా. బాడీని డెయిల్ ప్రాక్టీస్‌తో ఫిట్‌గా ఉంచుకోవడం, కాళ్లుచేతులను ఆయుధాలుగా ఉపయోగించడం, శతృవు దెబ్బల్ని డిఫెండ్ చేసుకోవడం, వేగంగా కదలడం, బాడీని అవసరమైన సందర్భాల్లో ఉక్కుముక్కగా మార్చుకోవడం, పంచ్ ఇచ్చేటప్పుడు షౌట్ చేయడం, ఆయువుపట్లపై బలమైన పంచులు ఇవ్వడం.... దాదాపు కొన్ని మార్షల్ ఆర్ట్స్‌లో ఒకేరకం. ఐతే కిక్ బాక్సింగ్, బాక్సింగ్ తరహా ఫైట్స్ వేరు. ఆమె నేర్చుకున్న మార్షల్ ఆర్ట్స్‌ను అవసరాన్ని బట్టి విడివిడిగానూ, కలివిడిగానూ ప్రాక్టీస్ చేయడం అలవాటు చేసుకుందామె.

ఆమె డెలివరీ చేసిన కిక్ నేరుగా అపరిచితుడి మొహంపై బలంగా తగిలింది. ఒక్కసారిగా మొహం మొద్దుబారిపోయిందతనికి. ఈలోపు యాదగిరి కాళ్లతో ఆ వ్యక్తి కాళ్లపై తన్నాడు. దీంతో మోకాళ్లపైకి కూలబడిపోవల్సి వచ్చింది. ఒక్కసారిగా పరిస్థితి తనకు ఎదురుతిరగడంతో, అకస్మాత్తుగా లేచి యాదగిరిపై నుంచి బయటికి దూకి పరుగు తీశాడు. ఆ వేగాన్ని అంచనా వేయలేదు దివిజ, యాదగిరి. వాళ్లు బయటికి వచ్చేసరికి అతను చాలా దూరం వెళ్లిపోయాడు. వెంబడించాలని యాదగిరి ప్రయత్నించినా దివిజ వారించింది. తిరిగి లోపలికి వచ్చారిద్దరూ...

ఎవరతను? తమపై దాడికి ఎందుకు ప్రయత్నించాడు? తాము గతంలో డీల్ చేసిన ఏ కేసులోనూ ఈ మొహం చూసిన గుర్తు లేదు. ఇంతకుముందు తాము డీల్ చేసిన కేసుల్లో బాధితుడై, కక్ష పెట్టకుని వచ్చి ఉంటాడా? చాలా మందికి తమపై కోపమున్నా దాన్ని తీర్చుకునే మార్గం లేక కిక్కురుమనకుండా ఊరుకుంటారు. మళ్లీ మళ్లీ దివిజతో గెలుక్కుంటే ఏం జరుగుతుందో తెలుసు వాళ్లకు. కానీ మరి ఇతనెవరు? అంత నేరుగా ఆఫీసుపైకే దాడికి వచ్చాడు. తనే స్ట్రెయిట్ టార్గెట్ అని తెలుస్తూనే ఉంది. కొద్దిగా అప్రమత్తంగా లేకపోతే ఏం జరిగి ఉండేది?

ఇంతకీ నరసింహన్ పంపిస్తానన్న ఏజెంట్ ఏడి? ఆలోచనలు తెగక పోయేసరికి విసుగ్గా 'యాదీ, రెండు టీ చెప్పి రా...' అందామె.

ఆ అపరిచితుడి మొహం గుర్తుకు తెచ్చుకుంటూ కంప్యూటర్‌కు లింక్ చేసిన ఈ-కాన్వాస్‌పై ఓ బొమ్మ గీసింది. కంప్యూటర్ పైనే కాసిన్ని రంగులద్దింది. దాదాపుగా మొహం కనిపిస్తోంది. ఇంటిగ్రేటెడ్ నేషనల్ క్రైం డేటా బ్యాంకు సర్వర్‌తో లింక్ చేసింది. ఈ ఫోటో అప్ లోడ్ చేసి సెర్చ్ కొట్టింది. కంప్యూటర్ తెరపై బఫరింగ్ రింగ్ గిర్రున తిరుగుతూ కనిపిస్తోంది. నిజానికి ఆమెకు ఆ సర్వర్‌తో యాక్సెస్ లేదు. ఓ కేసులో బాగా ఉపయోగపడినందుకు నరసింహనే దాని పాస్ వర్డ్, లింకు చెప్పాడు. అన్నీ ఆఫ్ ది రికార్డే. ఎప్పుడో ఓసారి ఉపయోగించదు ఆమె.

నేషనల్ రికార్డ్స్‌తో ట్యాలీ కాలేదు. ఈసారి అంతర్జాతీయ నేరగాళ్ల సెక్షన్లో సెర్చ్ కొట్టింది. ఎక్కడా మ్యాచ్ కావడం లేదు. అతనెవరో తెలియడం లేదు. విసుగ్గా సిస్టమ్ లాగాఫ్ చేసి లేచింది.

అసలు ఇంతకీ వస్తానన్న ఆ ఏజెంట్ మహాశయుడు ఏడి? ఇక వెయిట్ చేయడం వేస్టనుకుంది.

‘పోనీ, మనమే ఆ బషీర్ ఆత్మహత్య స్థలం వద్దకు వెళ్దాం పద, మనతోని పని ఉన్నవాడెలాగూ మనల్ని వెతుక్కుంటూ వస్తాడు. రా ఏజెంట్ ఆ మాత్రం కామన్ సెన్స్ తో ఆలోచిస్తాడులే’ అంటూ బుల్లెట్ బయటికి తీసింది. రెండు కార్లున్నా ఆమెకు ఆ బైక్‌పై తిరగడమే ఇష్టం. వెనక కూర్చున్నాడు యాదగిరి.

బుల్లెట్‌పై ఆమె వెళ్తుంటే జనం ఆశ్చర్యంగా చూస్తుంటారు. వాళ్లను చూసి ఆమె నవ్వుకుంటుంది.

మేరియట్  చేరింది బైక్. హోటల్ ముందు గుంపులు గుంపులుగా జనం పోగయ్యారు.

వెహికిల్ పార్కు చేసి, మెల్లిగా లోపలికి అడుగుపెట్టిందామె...

ఆ ఏరియా ఏసీపీ వసుధ కనిపించింది. ఆమె బాగా పరిచయమే. పలు కేసుల్లో దివిజ సహకారం కూడా తీసుకుందామె. ఈ నొటోరియస్ ఫీల్డ్‌లోకి ఒక ఆడపిల్ల ఇంత సాహసంగా ప్రవేశించడమే సంచలనమైతే, తక్కువ సమయంలో ఆమె దర్యాప్తు చేసి సాధించిన విజయాలు మరో సంచలనం. అందుకే ఆమె అంటే వసుధకూ అభిమానం. నిజాయితీగా డ్యూటీ చేసే మహిళా అధికారిణి అనే గౌరవం, అభిమానం దివిజకు...

పలకరింపుగా చిన్నగా నవ్వుకున్నారు.

నువ్వేమిటీ ఇక్కడ...? నీ ఇంటరెస్ట్ ఏమిటీ కేసులో....’

‘అసలు కేసేమిటో తెలియదు నాకు... ఓ వ్యక్తి నన్ను కలుసుకోవటానికి వస్తానన్నాడు, రాలేదు. ఈ అడ్రెస్ చెప్పాడు. ఎలాగూ పెద్ద పనేమీ లేదు కదాని నేనే వచ్చాను’ అంది నవ్వుతూ...

‘రూం నెంబర్ ఏమిటో...’ అనడిగింది వసుధ. దివిజ చెప్పిన జవాబుతో షాక్ తింది.

‘ఏమైందీ, ఎనీ థింగ్ రాంగ్...’

‘ఆ రూంలో నుంచే ఓ వ్యక్తి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు...’

ఈసారి షాక్ తినడం దివిజ వంతైంది...

మైగాడ్.... ఏమిటీ కారణం? ఎవరతను? తనను కలుస్తానన్న వ్యక్తి శవమైపోవడం ఏమిటి? తనపై హత్యాప్రయత్నం జరగడమేమిటి?  ఈ రెండింటికీ లింకుందా? ఎక్కడో ఏ మూలో అనుమానం తలెత్తిందామెకు... రెండు

సంఘటనలకూ లింకు గనుక ఉన్నట్లయితే అది ఆత్మహత్య కాదు, హత్యే అయిఉంటుంది. ఆ కోణంలో పరిశీలించాలనుకుంది.

'ఏం ఆలోచిస్తున్నావ్? నిన్ను కలవడానికి వస్తానని ఫోన్ చేసినప్పుడు నీతో ఏం చెప్పాడు?'

'ఏమీ చెప్పలేదు. ఇప్పుడు తెలుసుకోవాలి తనెవరో...'

ఇద్దరూ మెల్లిగా నడుస్తూ లాంజ్ వైపు వచ్చారు. కాఫీ తాగుతూ అంతకు ముందు తన ఆఫీసు వద్ద జరిగిన సంఘటనను వసుధకు వివరించింది దివిజ.

'మైగాడ్... ఏమైనా నువ్వు జాగ్రత్తగా ఉండాలిక... పోలీస్ కేసు పెడతావా?'

'అక్కర్లేదు... నాకుందుకో ఈ రెండింటికీ లింకుందనిపిస్తోంది. అది సూసైడ్ కాకపోవచ్చు. మర్డర్ కోణంలో మీరు దర్యాప్తు చేయండి. నాకూ కొన్ని వివరాలు కావాలి. కేసు ఏమిటో తరువాత చెబుతాను'

నరసింహన్ పంపిస్తానన్న ఏజెంట్ పత్తాలేకపోవడం, ఎవరో తనపై మర్డర్ అటెంప్ట్ చేయడం, తనను కలుస్తానన్న వ్యక్తి మర్డర్ కు గురికావడం ... అంతా చిక్కుముడిలా కనిపిస్తోంది. అందుకే తన అనుమానాలను వసుధకు రివీల్ చేయలేదామె. పైగా దేశభద్రతకు సంబంధించిన కేసుల గురించి తనకేం తెలిసినా ఎక్కడా ఒక్క పదమూ లీక్ కానివ్వదు. నరసింహన్ ఆమెను నమ్మడానికి ఆ క్రెడిబులిటీ కూడా ఓ కారణమే.

ఓలోపు వసుధ లోకల్ సీఐని పిలిచి సూసైడ్ నోట్ ను తీసుకురమ్మంది. ఇద్దరూ కలిసి దాన్ని పరిశీలించారు. కింద సంతకం ఉంది. హోటల్ వాళ్లు ఫీడ్ బ్యాక్ కోసం ప్రతీ రూంలోనూ ఉంచే స్క్రిబ్లింగ్ ప్యాడ్ పైనే, హోటల్ పెన్సిల్ తోనే రాసి ఉన్న సూసైడ్ నోట్ అది.

హోటల్ రిజిష్టర్ లో అతను చేసిన సంతకాన్ని, దాన్ని చెక్ చేసింది వసుధ.

నో డౌట్. ఇది అసలైన సూసైడ్ నోట్ కాదు. నీ అనుమానం కరెక్టే దివిజా... కనీస వివరాలు కూడా దొరకడం లేదు. ల్యాప్ టాప్, మొబైల్ ఉపయో గించినట్లు రూం బాయ్ చెప్పాడు. అవేవీ కనిపించడం లేదు. పర్స్ కూడా లేదు. ఫోటో తీయించి రికార్డ్స్ చెక్ చేశాక ఏమైనా ఆసక్తికరమైన వివరాలుంటే చెబుతా నీకు...'

'వోకే... నేనూ చిన్నగా ప్రోబ్ చేస్తా..'

శవం వద్దకు వెళ్లి తన హైఎండ్ మొబైల్ తో ఫోటోలు తీసుకుంది దివిజ. ఆ ఫోటోలు మొబైల్ నుంచి డేట్, లొకేషన్ సహా నేరుగా ఓ డ్రైవ్‌లోకి చేరి సేవ్ అయిపోతాయి. ఆ ఫోటోలు అయిదారు తీస్తూనే శవాన్ని పరిశీలించగసాగింది. ఇంకొంచెం జాగ్రత్తగా...

'నో డౌట్ ఇది హత్యే. సూసైడ్ గా చిత్రీకరించాలనుకున్నారు. శరీరం కింద పడినప్పుడు ఎడమవైపు పడ్డట్టుగా ఎడమవైపు బాగా చితికిపోయాయి. కానీ తలపై కుడివైపు బలమైన దెబ్బలు కనిపిస్తున్నాయి...' ఫోటోలను ఫోన్ లోనే ఎన్ లార్జ్ చేసి, వసుధ వద్దకు వచ్చి ఆ ఫోటోలను చూపిస్తూ వివరించింది.

నిజమేనని అంగీకరించింది వసుధ.

'సింపుల్. చాలా కేసుల్లో జరిగేదే ఇది. సూసైడ్ గా చిత్రీకరించే ప్రయత్నం చేయడం. ఆధారాలు లేకుండా హతుడి బిలాంగింగ్స్ అన్నీ మాయం చేయడం... హత్యే. కానీ హంతకులెవరు, కారణాలేమిటో తెలియాలి...' అంది దివిజ.

'వోకే... నిజంగానే నీకవసరమైతే నీ స్టైల్‌లో దర్యాప్తు చేసుకో' అంటూ సీఐని పిలిచింది. 'అవసరమైతే దివిజకు అడిగిన సాయం చేయండి. దాన్ని హత్యకేసుగా నమోదు చేసుకోండి...' అని చెప్పి ఇక తను వెళ్తానన్నట్టుగా దివిజ వైపు చేయి వూపి, జీపెక్కింది వసుధ.

ఈలోపు యాదగిరి మరికొన్ని వివరాలు తీసుకొచ్చాడు

'హోటల్ రూం నుంచే రెండు కాల్స్ చేశాడు. ఒకటి మన ఆఫీసుకు. రెండో నంబర్ ఎవరిదో కనుక్కోవాలి... మొబైల్ నుంచి గాకుండా హోటల్ ఫోన్ నుంచి ఎందుకు చేశాడో తెలియదు... సహజంగానే ఇలాంటి వ్యక్తులు సరైన అడ్రస్, వివరాలు, హైదరాబాద్ రావటానికి కారణాలు ఎవరూ సరిగ్గా ఇవ్వరు... టూరిస్ట్ ఫ్రం మద్రాస్ అని రాశాడు. తన మొబైల్ నంబర్ రాశాడు. దానికి కాల్ ట్రై చేశాను. అవుటాఫ్ కవరేజీ ఏరియా అని వస్తోంది... బహూశా హంతకులు ఆ మొబైల్ తీసేసుకుని సిమ్ కార్డును ఎక్కడో పారేసి ఉంటారు' చకచకా చెబుతూ పోతున్నాడు యాదగిరి.

సర్వీస్ ప్రొవైడర్ ను పట్టుకుంటే వివరాలు తెలుస్తాయి. కానీ చాలాసార్లు తప్పుడు ఆధారాలు, నకిలీ ఫోటోలే ఉంటున్నాయి ఇలాంటి కేసుల్లో... మరీ ప్రీపెయిడ్ కనెక్షన్లతో ఈ తంటాలు ఎక్కువ.

ఈ నంబర్ ఎవరిదో తరువాత కనుక్కో... పద వెళ్దాం... అంటూ బైక్ తీసింది. స్టార్ట్ చేస్తుండగానే ఫోన్ మోగింది.

వసుధ నుంచి కాల్ అది... ఇప్పుడే కదా ఇక్కడి నుంచి వెళ్లింది. అప్పుడే ఏం డెవలప్‌మెంట్స్ ఉన్నాయబ్బా అనుకుంటూ గ్రీన్ బటన్ ప్రెస్ చేసిందామె.

'ఇప్పుడే మీరుండే ఏరియా ఇన్‌స్పెక్టర్ నుంచి ఇన్‌ఫర్మేషన్ వచ్చింది. మీ ఆఫీసు ఎదుట ఉండే పార్కులో ఓ శవం కనిపించిందట... వివరాలు తెలియడం లేదట. ఇక్కడా ఏ ఆధారాలు లేవు. అఫ్‌కోర్స్ మేరియట్ శవానికీ దీనికీ సంబంధం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. నేనక్కడికే వెళ్తున్నా... వస్తావా?'

'మై గాడ్... నేనూ ఆఫీసుకే వస్తున్నా...'

తాజాగా మరో శవం. అదీ తన ఆఫీసు ఎదురుగా... ఒక మర్డర్ అటెంప్ట్, ఒక మర్డర్, మరో మర్డర్... ఆలోచనల్లోనే ఆఫీసు చేరుకుంది. అప్పటికి ఇంకా ఏసీపీ రాలేదు. ఆఫీసు వెనకాల ఉండే ఫ్లాట్ లోకి వెళ్లి కొంచెం ఫ్రెషయింది. మొబైల్ నుంచి నరసింహన్‌కు కాల్ చేసింది. వివరాలన్నీ విన్న ఆయన మరో సీనియర్ ఏజెంట్‌ను పంపిస్తానని చెప్పాడు. అవసరమైతే తనే వస్తాననీ అన్నాడు.

బయటికి వచ్చి ఆ శవం కనిపించిన స్పాట్‌కు వెళ్లింది. ఈలోపు వసుధ అక్కడికి చేరింది.

తలపై బుల్లెట్ గాయం కనిపిస్తోంది. అక్కడ పెనుగులాట జరిగినట్లు కూడా లేదు. కింద రక్తం గడ్డకట్టింది. అంటే... తనపై హత్యాప్రయత్నం జరగడానికన్నా ముందే ఇక్కడ హత్య జరిగి ఉండాలి. కానీ కాల్పుల శబ్దం వినిపించలేదు. బహుశా సైలెన్సర్ ఉన్న గన్ ఐఉంటుంది. అప్పటికి పెద్దగా జనసంచారం ఉండదు కాబట్టి పార్కులో ఎవరూ గమనించి ఉండరు. నిశ్శబ్దంగా తన పని పూర్తి చేసుకుని ఉంటారు హంతకులు. ఈ హత్య చేసినవారే, నేరుగా అక్కడి నుంచి తన ఆఫీసుకు వచ్చి ఉంటారా?

శవాన్ని తనూ ఫోటోలు తీసింది. ఎవరో సెర్చ్ చేయాలి. ఈలోపు నరసింహన్ చెప్పిన మరో సీనియర్ ఏజెంట్ వస్తే బాగుండు. తనకెందుకో ఉదయం నుంచి జరుగుతున్నవన్నీ ఒకదానితో ఒకటి లింకై ఉన్నట్టు తోస్తున్నాయి.

తలవిదిలించుకుని వసుధ వైపు చూసింది. ఆమె మొహమూ బ్లాంక్ గానే ఉంది. ఏం చేద్దామో చెప్పు అన్నట్టుగా చూసింది.

ఈలోపు యాదగిరి కూడా వచ్చి చేరాడక్కడికి.

ఆ నంబర్ ఎవరిదట? అడిగింది దివిజ. చెప్పాడు యాదగిరి...

అది జెడ్ టీవీ ఆఫీసు ఫోన్...!

కుర్చీలో కూర్చుని కళ్లపై చేతులు పెట్టుకుని తలను పైకప్పు వైపు వంచి ఆలోచిస్తున్నాదామె.

ఒకడు ఆత్మహత్య చేసుకున్నాడని నరసింహన్‌కు ఫోన్ వచ్చింది. ఆ కేసు కాస్త చూడమని రిక్వెస్ట్ చేశాడాయన. ఓ ఏజెంట్ వచ్చి వివరాలు చెబుతాడనీ చెప్పాడు. కానీ తను రాలేదు. ఈలోపు అది ఆత్మహత్య కాదు, హత్యేనని తెలిసిపోతోంది. మరోవైపు తనపైనా అటాక్ జరిగింది. తన ఆఫీసు ఎదురుగానే ఓ మర్డర్ జరిగింది. సో, అతనెవరో తేలాలి, ఆ హత్యలకు కారణాలు తేలాలి... నరసింహన్ ఇన్ వాల్వ్ అయ్యాడంటేనే అది చాలా సీరియస్ కేసు అన్నట్లు లెక్క. హోటల్ నుంచి బషీర్ తనతోపాటు జెడ్ టీవీకి ఎందుకు ఫోన్ చేశాడు..? ఆలోచనలు ఇలా సాగుతుండగానే బయట ఎవరో వచ్చిన అలికిడి వినిపించింది. కంప్యూటర్ పక్కన బిగించిన ఓ బటన్ నొక్కింది. బయట సంభాషణలన్నీ చిన్న స్పీకర్ ద్వారా ఆమెకు వినిపిస్తున్నాయి.

'మేడమ్ ఉన్నారు గానీ, మీకు కావల్సిన పనేంటో చెప్పండి...' యాదగిరి అంటున్నాడు

'కాన్ఫిడెన్షియల్. ఆమెకే చెబుతాను...' సీసీ కెమెరా నుంచి ఓ వృద్ధుడి రూపం కనిపిస్తోంది.

'ఎవరికి చెప్పినా ఒకటే సారూ...' అంటూ ఏదో అనబోతుంటే దివిజ మరో బటన్ ప్రెస్ చేసి 'అతన్ని లోనికి పంపించు యాదీ..' అన్నదామె. అతి చిన్న మైక్రోఫోన్ ద్వారా ఆ మాటలు బయట బిగించిన చిన్న స్పీకర్ లో వినబడ్డాయి.

లోపలకు వెళ్లమన్నట్టుగా సైగ చేసి, ఎందుకైనా మంచిదని అక్కడే అలర్ట్‌గా నిలుచుని లోపలి వైపు ఓ కన్నేసి ఉంచాడు యాదగిరి. విజిటర్స్ కూడా ఎవరూ లేరు.

నిజానికి బయట చిన్న బోర్డు మినహా అక్కడ ఓ డిటెక్టివ్ ఏజెన్సీ వాతావరణమే పెద్దగా కనిపించదు.

కొన్ని కేసులను ఆమె తీసుకోదు. కీలకమైన కేసులేమీ లేనప్పుడు చిన్న చిన్న కేసులు తీసుకుంటుంది కానీ ఫటాఫట్ తేల్చేస్తుందామె. నగరంలో చాలా డిటెక్టివ్ ఏజెన్సీలు స్టార్టయ్యాయి. భార్యలపై భర్తలు, భర్తలపై భార్యలు, కాబోయే

భాగస్వామిపై నిఘా, వివరాల సేకరణ, ఆఫీసుల్లో సిబ్బందిపై సంస్థలే పెట్టే నిఘా వంటి కేసులు అధికంగా వస్తుంటాయి. కానీ పెద్దగా ఆమె వాటిని టేకప్ చేయదు. కొన్ని ఏజెన్సీలు డబుల్ క్రాస్ చేసి, తాము సంపాదించిన వివరాలు, ఆధారాలతో ఎదుటి పార్టీలను బ్లాక్ మెయిల్ చేసిన ఉదంతాలూ ఆమెకు తెలుసు. వృత్తి విస్తరించేకొద్దీ అన్ వాంటెడ్ ఎలిమెంట్స్ ఎంటరవుతారని తెలుసామెకు.

ఆమె డిగ్రీలో ఉండగానే తల్లిదండ్రులు యాక్సిడెంట్‌లో చనిపోయారు. కొంచెం ఆస్తి కూడా ఒదిలిపెట్టిపోయారు. తనవైపు బంధువులెవరూ తమ ఇంటికి రావడం ఆమెకు తెలియదు. తల్లిదండ్రులది ప్రేమ పెళ్లి కావడంతో ఇరువైపులా బంధుగణం ఆ దంపతులను వెలివేశారు. ఒంటరిగానే చదువు పూర్తి చేసింది. చిన్నప్పటి నుంచీ డిటెక్షన్ అంటే ఓరకమైన క్రేజ్ ఆమెకు.అందుకే ఏ ఉద్యోగానికీ ట్రయ్ చేయకుండా సొంతంగానే ఆఫీసు తెరిచింది. మొదట్లో చిన్న చిన్న కేసులు వచ్చేవి. వృత్తిలోని మెళకువలన్నీ సొంతంగానే తెలుసుకుంది. అనుభవంతోపాటు తెగింపు, సాహసం, ఓర్పు, తెలివి, స్పాంటేనిటీ ఆమెను వేగంగా ఎదిగేలా చేశాయి. పనిలేనప్పుడు నేరపరిశోధనపై ఆమె విస్తృతంగా చదువుతుంది. ఏడాదిపాటు బ్రిటన్ లో ప్రత్యేక శిక్షణ పొందింది. డిగ్రీలోనే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉండటంతో... బ్రిటన్‌లో మరింత పదును పెట్టుకుంది. ఇవన్నీ ఆమెలో ధైర్యాన్ని నింపాయి. దీనికితోడు ఆమె టెక్ సేవీ. కొత్తగా ఏ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా దాన్ని అందిపుచ్చుకుంటుంది.

చిన్న చిన్న జేబుదొంగతనాలతో కాలం గడిపే యాదగిరిని ఓసారి ఓ పెద్ద కేసులో అకారణంగా ఇరుక్కుంటే, దాన్ని తానే శోధించి ఆ కేసు నుంచి బయటపడేసింది. తనకూ ఎవరూ లేకపోవడంతో ఆ తరువాత చోరీలు మానేసి ఆమె దగ్గరే చేరిపోయాడు. తన చురుకుదనం మెల్లిగా గమనించిన ఆమె చిన్న చిన్న విషయాల్లో ట్రెయినింగ్ ఇచ్చి మెరికలా మార్చుకుందామె. చాలా విషయాలు ఆమెకూ, తన అసిస్టెంటుకు తప్ప మరొకరికి తెలియకుండా జాగ్రత్తపడతారు. చాలామంది లోకల్ పోలీసు అధికారులకు ఆమె డీల్ చేసిన చాలా కేసులు తెలియవు. సాదాసీదా డిటెక్టివ్‌గా తేలికగా తీసుకుంటారామెను. ఢిల్లీ స్థాయిలో కొందరు కీలక అధికారులకే ఆ వివరాలన్నీ తెలుసు. ఏసీపీ వసుధతో స్నేహం కారణంగా దివిజ కొన్ని విషయాలు ఆమెతో షేర్ చేసుకుంటుంది.

ఆమె ఛాంబర్‌లోకి వెళ్లిన వ్యక్తి నరసింహన్ పేరు చెప్పి తనను ద్వివేదీగా పరిచయం చేసుకున్నాడు. ఆమె ఓసారి అతనివైపు పరిశీలనగా చూసి నవ్వేసింది.

తను వృద్ధుడి వేషధారణలో ఉన్నట్టు కనిపెట్టింది. వాస్తవానికి యాదగిరీ దాన్ని గమనించలేకపోయాడు. అంత సమర్థంగా మేకప్ చేసుకున్నాడతను. టోన్ కూడా అలా మార్చాడు. రిలాక్స్ కావాల్సిందిగా సూచించి, ఆమె ఆ రోజంతా జరిగిన సంఘటనలను వివరించిందతనికి... తన మొబైల్‌ను కంప్యూటర్‌కు కనెక్ట్ చేసి, మేరియట్ దగ్గర హత్యకు గురైన వ్యక్తి ఫోటోలు చూపించింది. తనూ పెదవి విరిచాడు. ఢిల్లీ ఆఫీసులో తాజాగా క్రోడీకరించిన డేటాతో ఓసారి చెక్ చేస్తే తప్ప నిర్ధారణకు రాలేనన్నాడు. పార్కులో దొరికిన శవం ఫోటోలు చూపించింది. మొహం చూడగానే 'మైగాడ్...' అంటూ కీచుగా అరిచాడతను. 'తను మా ఏజెంటే. మీ దగ్గరకు రావల్సిన ఏజెంటే అతను. పేరు చక్రధర్. వెరీ ఎఫీసియెంట్ ఏజెంట్ తను. కానీ అంత ఈజీగా ఎలా దొరికిపోయాడో...' అంటూ బాధగా కొద్దిసేపు తలను రెండు చేతుల మధ్య పెట్టకుని నిశ్శబ్దంగా ఉండిపోయాడు. దివిజ కూడా అర్థం చేసుకుంటున్నట్టు మౌనంగా ఉండిపోయింది.

నరసింహన్‌కు కాల్ చేసి చెప్పాల్సిందిగా సూచించింది. ఈలోపు ఆమెకు ఓ కాల్ వచ్చింది. ఏదో లోకల్ నంబర్. బహుశా పబ్లిక్ కాల్ ఆఫీసు నుంచి అయిఉంటుంది. ఆ సీరీస్ ఆమెకు తెలుసు.

'మూడే ముక్కల్లో చెబుతాను. నువ్వు ప్రస్తుతం డీల్ చేస్తున్న కేసులో ఫర్దర్ స్టెప్స్ ఏమీ ఉండొద్దు. ఈరోజు జరిగినవి నీకూ తెలుసు. మళ్లీ మళ్లీ చెప్పించుకోవద్దు. లేదా ఈసారి కచ్చితంగా తప్పించుకోలేవు' అంటూ ఓ కంఠం కూల్‌గా చెప్పింది. అంతా రికార్డవుతోంది. కానీ దానివల్ల ప్రయోజనం వేస్ట్ అని ఆమెకు తెలుసు.

'అలాగే సార్, ఏదో చిన్న చిన్న కేసుల్లో నాలుగు రాళ్లు సంపాదించుకుంటాను గానీ, నాకెందుకు ఈ లేనిపోని తలనొప్పి. మీ జోలికి రాను. ప్లీజ్ ప్లీజ్' అంటూ బతిమిలాడుతున్నట్లుగా మాట్లాడి ఫోన్ పెట్టేసింది. బెదిరింపు కాల్ గురించి చెప్పి, తను బతిమిలాడటం అంతా ఉత్తుత్తదేనంటూ నవ్వేసింది. ఆమె మాటల్లోని ఎటకారం తనకూ అర్థమై నవ్వేశాడు. అలా చెప్పినంతమాత్రాన శత్రువులు ఆమెపై నిఘా ఆపేస్తారని వాళ్లేమీ అనుకోలేదు. ఆమె నంబర్లు కూడా తెలుసుకుని ఫోన్లు చేస్తున్నారంటే... చాలా సీరియస్ థ్రెట్ అని తెలుసు. ఆమె గురించి ధరోగా తెలుసుకున్నాకే వాళ్లు రంగంలోకి దిగారనీ అర్థమవుతోంది.

'మరిప్పుడేం చేద్దాం... ' అడిగాడతను. యాదగిరి రెండు కాఫీలు తెచ్చి పెట్టాడు టేబుల్‌పై. తనూ ఓ పక్కన కూర్చుని కాఫీ చప్పరించసాగాడు.

సాలోచనగా చూశాడామె వైపు ద్వివేదీ...

'తనకు అన్నీ తెలుసు. ఏ కేసైనా మా మధ్య రహస్యాలు ఉండవు. ఉంటే కో ఆర్డినేషన్ ఉండదు. నేనెంతో తనూ అంతే....' అంటూ చిరునవ్వు నవ్వింది దివిజ.

'మేడమ్... ఈ కేసు కొంచెమైనా అర్థం కావాలంటే నరసింహన్ సారైనా ఇక్కడికి రావాలి. లేదా మనమైనా అక్కడికి వెళ్లి రావాలి. నన్ను వెళ్లి రమ్మంటారా...' అనడిగాడు యాదగిరి.

ద్వివేదీ మాట్లాడలేదు. వాళ్లిద్దరికీ నేరుగా నరసింహన్‌తోనే కంటాక్ట్ ఉండటం వల్ల తను అంత స్వేచ్ఛగా మాట్లాడలేకపోతున్నాడు. ఆ విషయం అర్థమైందామెకు...

'ఏం చేద్దామో మీరు చెప్పండి...' అడిగింది అతన్ని.

'అసలు ఆ బషీర్ ఎవరు? మా ఏజెంట్ జోలికి ఎందుకు వచ్చాడు? బషీర్‌కూ ఈ హత్యకూ సంబంధం ఉందా? ఉంటే మిమ్మల్ని కలవాలని ఎందుకు ప్రయత్నించాడు? సంబంధం లేకపోతే తననెందుకు హతమార్చారు? మధ్యలో మిమ్మల్ని అటాక్ చేసిందెవరు? ఇది అంత తేలికగా తేలే వ్యవహారం కాదు గానీ మా బాస్ సలహా తీసుకుందాం..'

'సరే, కొంచెం ఆగి నేను ఫోన్ చేస్తా సార్‌కు...' అని ముక్తాయించింది దివిజ.

'నేను హోటల్ సెంట్రల్ కోర్టులో దిగాను. సాయంత్రం మళ్లీ కంటాక్టులోకి వస్తాను' అని వెళ్లిపోయాడు ద్వివేదీ.

'నువ్వు లంచ్ చేసి రెస్ట్ తీసుకో... నేను కొన్ని వివరాలు సెర్చ్ చేస్తా...' అంటూ ఫ్లాట్ లోకి వెళ్లిందామె

❄ ❄ ❄

సాయంత్రం జెడ్ టీవీ ఆఫీసుకు వెళ్లింది. రిసెప్షన్‌లో ఓ అమ్మాయింది. నవ్వుతూ పలకరించింది దివిజ

'మీ ఎండీ గారున్నారా?' అంటూ తన విజిటింగ్ కార్డు ఇచ్చింది

దాన్ని పైపైన చూసి... 'మీటింగ్‌లో ఉన్నారు. ఇప్పుడెవరినీ కలవరు. ఐనా అపాయింట్ మెంట్ లేనిదే అస్సలు కలవరు. మీ పనేమిటో చెబితే, టైం

తీసుకుని ఇన్‌ఫాం చేస్తాను...' ఏదో సాదాసీదా డిటెక్టివ్ అనుకుని తేలికగా తీసుకుని బదులిచ్చింది రిసెప్షనిస్టు.

'ఆయన నంబర్ ఇవ్వండి. నేను కాల్ చేస్తా...'

'సారీ మేడమ్... అలా ఆయన సెల్ నంబర్ ఇవ్వం...' అని నిష్కర్షగా చెప్పేసి వేరే కాల్‌లో మునిగిపోయిందామె.

తనకు ఇలాంటివి తప్పవు. పోలీస్ సంబంధించిన ఏదో డిపార్ట్‌మెంట్‌లో ఉండి ఉంటే... ఇలాంటి చోట్ల పనికొచ్చేది.

ద్వివేదీకి గానీ, వసుధకు గానీ ఈ పని పురమాయించాలి అనుకుంటూ బయటికి బయల్దేరింది.

మెయిన్ డోర్ వద్ద కనిపించిందొక లేడీ రిపోర్టర్ నందిని. దివిజను గుర్తుపట్టి 'హలో మేడమ్' అంటూ పలకరించింది.

ఒకసారి చూస్తే ఎవరినీ మరిచిపోదు దివిజ. వెంటనే ఆ రిపోర్టర్ ను గుర్తుకుతెచ్చుకుని 'హాయ్' అంది బదులుగా...

'ఏమిటిలా మా ఆఫీసుకు వచ్చారు?' ఆసక్తిగా అడిగింది నందిని.

'ఏదో కేసుకు సంబంధించిన వీడియో ఫుటేజ్ అడగాలని వచ్చానండీ. మీరు ప్రసారం చేసినవి అంత స్పష్టంగా లేవు. ఓసారి ఒరిజినల్ చూస్తే, నేను డీల్ చేస్తున్న కేసుకు ఏమైనా లింకుందో లేదో ఓసారి చెక్ చేసుకోవడం కోసం...' అని టాపిక్‌ను డైవర్ట్ చేసింది.

సంప్రదాయేతర వృత్తుల్లో మహిళలు అనే టాపిక్ పై ఓ ప్రోగ్రాం చేసినప్పుడు ఆ రిపోర్టర్ దివిజ అభిప్రాయాలనూ తీసుకుంది. అప్పుడు చూసిందామె.

'రండి, కాఫీ తాగుదాం. అడగ్గానే వీడియో ఫుటేజీ ఇవ్వరు... ఐనా మా ఎండీని అడగకపోయారా?'

ఇద్దరూ క్యాంటీన్‌లో కూర్చున్నారు.

'మీటింగ్‌లో ఉన్నారట...'

'ఔను దొరక్కపోవచ్చు. మొన్ననే చైనా నుంచి తిరిగొచ్చాడు. పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలిగా...'

'మీ ఎండీకి చైనాలో ఏం పని? ఏదైనా వ్యాపారమా?'

‘అబ్బే, అలాంటిదేం లేదు. సరదాగానే వెళ్లొస్తుంటారు...’

‘అదేమిటి? చైనాకు టూరిస్టుగా పోవటానికి ఎవరూ పెద్దగా ఇంటరెస్ట్ చూపించరు. అక్కడేముందని చూడటానికి... పైగా అన్నీ ఆంక్షలు. అందరూ థాయ్ లాండ్ వంటి ప్రదేశాలకు వెళ్తుంటారు. మరి ఈయనేమిటి ఇలా...?’ నవ్వుతూ కామెంట్ చేసింది దివిజ.

‘అదే ఎవరికీ అర్థం కాదు. ఏడాదికోసారి తప్పక వెళ్తాడు. 10, 15 రోజులుంటాడు...’

‘చానెల్ ఛైర్మన్ ఎవరు? గతంలో ఏం చేసేవాడు? చానెల్ పెట్టేంత డబ్బున్న ఆస్తిపరుడా?’

‘అంత సినిమా లేదు. గతంలో మాతోపాటు పనిచేసిన రిపోర్టరే. వాళ్లూ వీళ్లూ సహకరించారని చెప్పి సొంతంగా చానెల్ పెట్టాడు. తనే సీఎండీ. ఖర్చుకూ ఆదాయానికీ పొంతన ఉండదు. ఐనా ఎలాగోలా డబ్బు సమకూరుస్తుంటాడు. మా జీతాలకు ఢోకా లేదు...’

‘ఇంటరెస్టింగ్... థ్యాంక్సండీ... మీ నంబర్ ఇవ్వండి’ అంటూ రిపోర్టర్ విజిటింగ్ కార్డుపై తన మొబైల్ ఆనించి ఓ యాప్ ప్రెస్ చేసింది. అంతే... పేరు, నంబర్లు, మెయిల్ ఐడీలు, ఆఫీసు అడ్రెసు అన్నీ ఫోన్‌లోకి ఎంటరై సేవ్ అయిపోయాయి. వెళ్తానన్నట్టు బై చెప్పి బయల్దేరింది దివిజ.

ఈ ఎండీ వ్యవహారం ఏదో తేడాగానే ఉంది. తనే ఎలాగోలా కలిసి మాట్లాడాలి అనుకుంటూ ఆఫీసు వైపు బైక్ పోనిచ్చింది.

ఆఫీసుకు వెళ్లేసరికి ద్వివేదీ ఎదురుచూస్తున్నాడు. ’కాల్ చేయకపోయారా‘ అంటూ లోనికి తీసుకెళ్లింది ఆమె.

‘ఓ ఇంపార్టెంట్ విషయం చెప్పాలని వచ్చాను’ అన్నాడు గొంతు తగ్గించి...

‘ఏమిటది?’

‘బషీర్ ఫోటోలను ఢిల్లీకి పంపించాను. లేటెస్ట్ డేటాతో చెక్ చేసి చెప్పాడు మా కొలీగ్. తన పేరు బషీర్ కాదు. చాంగ్ లీ.’

‘చాంగ్ లీ... వివరాలు ఏమైనా ఉన్నాయా’

‘చైనీస్ సీక్రెట్ ఇంటలిజెన్స్ ఏజెన్సీలో చేస్తున్నాడు. గతంలో ఏ కేసులోనూ తారసపడకపోవడంతో మన రికార్డులకు ఎక్కలేదు.. ఈమధ్యే మన ఏజెంట్లు తన యాక్టివిటీ పై కన్నేసి తెలుసుకున్న వివరాలు ఇవి...’

'గుడ్... కానీ ఎవరు చంపి ఉంటారతన్ని.... నా సాయం అడిగాడెందుకు?' సాలోచనగా అడిగింది.

'అదే ఆలోచిస్తున్నా... రేపు ఉదయంకల్లా మరిన్ని వివరాలు తీసుకుంటా...' వెళ్లిపోయాడతను

ఏ ఫోన్లూ హ్యాకింగ్ కూ, ట్యాపింగ్ కూ అతీతం కాదు... వాయిస్ కాల్స్, వీడియో కాల్స్, నెట్ కాల్స్ అన్నీ టాప్ చేసే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఆమె కూడా అప్పుడప్పుడు ఆ పద్ధతి పాటిస్తుంది.

అందుకని వీలైనంత వరకూ కాన్ఫిడెన్షియల్ వ్యవహారాలు ముఖాముఖీ మాట్లాడుకోవడం బెటరని భావించేవాళ్లలో ద్వివేదీ ఒకడు...

కుర్చీలో కూర్చోగానే మొబైల్ మోగసాగింది. నరసింహన్ ఫోన్...

'సర్, చెప్పండి... ఇక్కడ పెద్దగా కేసులో డెవలప్ మెంట్స్ లేవు...'

'వాడెవడో తెలిసిపోయింది. వాడి పేరు... ' నరసింహన్ ను మధ్యలో ఆపిన దివిజ 'ఆ వివరాలు ద్వివేదీ చెప్పేశాడు సర్...' అంది. 'గుడ్, ఏదో భారీ ఆపరేషన్ నడుస్తున్నట్టుంది. చైనా కోణంలో ఆలోచిస్తే బెటరేమో... మా ద్వివేదీ సాయం కూడా తీసుకో... అవసరమైతే నేనూ వస్తా...'

'నాక్కొంచెం క్లారిటీ వచ్చాక, అవసరమైతే మీరు వద్దురు గానీ, ఇప్పుడవసరం లేదు...'

'జాగ్రత్త... రిస్క్ తీసుకోకు... ' హెచ్చరించి ఫోన్ పెట్టేశాడు నరసింహన్

'యాదీ... ఎక్కడున్నావ్...?' యాదగిరికి ఫోన్ చేసింది

'మీరు చెప్పిన చోటే వెయిట్ చేస్తున్నా మేడమ్... వచ్చాక చెబుతా...' అంటూ ఫోన్ పెట్టేశాడు

టాపింగ్ భయంతో క్లుప్తంగా వాళ్లకు మాత్రమే అర్థమయ్యేలా మాట్లాడుకుంటారు. అతన్ని మేరియట్ 511 గదిపైనే నిఘా వేసి ఉంచమని చెప్పి పంపింది. ఆమెకు ఎందుకో ఆ గదిలో చాంగ్ లీ కి సంబంధించిన రహస్యమేదైనా దొరుకుతుందని అనిపిస్తోంది. మరణించిన ఏజెంటు, లీ బిలాంగింగ్స్ ఏమన్నా ఉంటే క్షుణ్ణంగా పరిశీలించమని ద్వివేదీకి చెప్పి పంపించింది. ఏమైనా చిన్న హింట్ దొరకనిదే ఇక ఈ కేసులో ముందుకు కదలలేమని తెలుస్తోంది ఆమెకు.

కారు తీసి, తనకు తెలిసిన ఎన్ఐఏ ఎస్పీ దగ్గరకు బయల్దేరింది. ఈ ఏజెన్సీ ఎక్కువగా దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన కేసులు డీల్ చేస్తుంటుంది... టెర్రరిస్టులు, విదేశీ ఏజెంట్ల వ్యవహారాలు తెలుస్తుంటాయి వాళ్లకు. రా చేసేది వేరు. విదేశీ ఏజెంట్ల వ్యూహాలకు విరుగుడే గాకుండా తనూ సొంతంగా దేశవిదేశాల్లో ఏజెంట్లను పెట్టి, దేశం పాలసీలకు అనుగుణంగా పావులు కదిపే అత్యున్నత సంస్థ అది. మనం ప్రతీ దానికి పాకిస్థాన్ ఐఎస్ఐ, అమెరికాకు చెందిన సీఐఏ లను ఎలా నిందిస్తుంటామో... పాకిస్థాన్ వంటి దేశాలూ రా ను తిట్టిపోస్తుంటాయి. ప్రత్యేకించి పాకిస్థాన్ కొన్ని తీవ్రవాద గ్రూపులను ఎలా పోషిస్తుంటుందో, ఇండియా కూడా పాకిస్థాన్‌లోని ఎంక్యూఎం వంటి సంస్థలకు సపోర్ట్ చేస్తుందనేది దాని ప్రధాన ఆరోపణ. అఫ్ఘనిస్థాన్, తజికిస్థాన్ వంటి దేశాల్లోనూ ఇండియా ఆపరేషన్లు సాగుతుంటాయనేది దాని విమర్శ. ప్రపంచ శాంతికి పూర్తిగా మధ్య ఆసియా దేశాల రాజకీయాలు కీలకంగా మారడం, అవి ఇండియాకు దగ్గరంగా ఉండటం, టెర్రరిస్టుల ప్రధాన టార్గెట్ దేశాల్లో ఇండియా కూడా ఒకటి కావడంతో రా పాత్ర చాలా కీలకంగా మారింది. అందుకే ఒకరి ఏజెంట్ల వ్యవహారాలపై మరొకరు నిఘా వేయడం, ఒకరి రహస్యాలు మరొకరు తెలుసుకునే ప్రయత్నాలు చేయడం పరిపాటే... చైనా, పాకిస్థాన్ ఏజెంట్ల కార్య కలాపాలు బాగా పెరిగిపోయాయని ఆమెకు చూచాయగా తెలుసు.

ఆ ఎస్పీ ఆఫీసులోనే ఉన్నాడు. ఆమెను చూడగానే నవ్వుతూ... 'చెప్పండి. ఏదో కొత్త కేసు ఉన్నట్టుంది. లేకపోతే నేరుగా రారు కదా' అనడిగాడు...

ఆమె వివరాలు చెప్పి, ఒక్క అడుగు కూడా ముందుకు పడని తీరునూ వివరించింది.

'నిజానికి మేం అధికారికంగా ఇందులో ఏమీ జోక్యం చేసుకోవద్దు. కానీ నాకు రీసెంట్‌గా తెలిసిన కొన్ని నీతో షేర్ చేసుకోగలను. ఇటీవల ఓ చైనీస్ ఏజెంట్ దొరికినట్టే దొరికి తప్పించుకుపోయాడు. అంతకుముందు వాడిపై నిఘా వేస్తే తెలిసిందేమిటంటే... హైదరాబాద్ కేంద్రంగానే వాళ్ల ముఠా ఒకటి సీరియస్‌గా వర్క్ చేస్తోందని !'

'ఏదైనా టెర్రరిస్టు ఆపరేషనా..?'

'చైనా అలాంటి నెట్‌వర్క్‌ను సపోర్ట్ చేస్తున్నట్టు మనకు ఆధారాలేమీ లేవు. కానీ ఏదో సీక్రెట్ ఆపరేషన్ నడుస్తోంది. అదేమిటో తెలియాలి. నీ కేసులో ఏమైనా హింట్స్ దొరుకుతాయేమో చూడాలిక. నన్నూ కాస్త అప్‌డేట్ చేస్తుండు.

అవసరమైతే అనఫీషియల్‌గా ఇన్ వాల్వ్ అవుతాను. అల్టిమేట్‌గా ఆ డొంక బయటపడాలి' అన్నాడాయన.

'అలాగే సార్... అన్నట్టు జెడ్ టీవీ ఎండీపై ఏమైనా ఫైల్ ప్రిపేరై ఉందా?'

'కొన్ని అనుమానాలున్నాయి. కాంక్రీట్‌గా ఆధారాలేమీ లేవు. చైనీస్ ఏజెంట్లకు అవసరమైన సాయం చేస్తుంటాడని అనుకుంటున్నాం. అంతేగానీ సొంతంగా ఆపరేషన్ నిర్వహించేంత సీన్ లేదతనికి...'

'సరే సార్, థ్యాంక్యూ... ' అని సెలవు తీసుకుంది ఆమె.

❄ ❄ ❄

ఆమె సూచనల మేరకు వసుధ ఇద్దరు ఆఫీసర్లను మఫ్టీలో ఆమె ఆఫీసు దగ్గర నిఘా కోసం నియమించింది. వారి ఉనికిని గమనిస్తూనే ఆఫీసు లోనికి వెళ్లింది దివిజ.

అప్పటికే యాదగిరి వచ్చేశాడు. మీరు చెప్పినట్లే కాపు కాశాను. పోలీస్ సీల్ చేసిన గదిలోకి కూడా ఎవరో ఎంటరయ్యారు. అదీ పోలీసులమని దబాయించి మరీ! చాలాసేపు అందులో వెతికినట్టుంది. లీ అందులో ఏదో దాచి ఉంటాడేమో...'

'ఇంకా...'

'అన్నట్టు... జెడ్ టీవీ హీరో లాంజ్‌లో చాలాసేపు కూర్చుని కనిపించాడు. గదిని సోదా చేసినవాళ్లు వెళ్లిపోయాక తనూ బయల్దేరాడు. యాదృచ్ఛికమో, ఏమైనా లింకుందో అర్థం కావడం లేదు...'

'తనపై నిఘా వేయి. ఎటు తిరుగుతున్నాడు, ఎవరిని కలుస్తున్నాడు నాకు ఎప్పటికప్పుడు చెప్పు. కాల్ చేయకు. మన కొత్త యాప్ ద్వారా మెసేజీ పెట్టు...'

'వోకే మేడమ్...' అని వెళ్లిపోయాడు యాదగిరి.

ఆ మొబైల్ యాప్ కొత్తగా మార్కెట్‌లోకి వచ్చింది. ఇంకా పాపులర్ కాలేదు. కాబట్టి ఇంకా టాపింగ్ దాకా వెళ్లిఉండదనే భావనతో దాన్ని వాడుతున్నారు వాళ్లు. ఆ యాప్ ద్వారా మెసేజీలే గాకుండా ఫోటోలు, వీడియోలు కూడా చిన్న సైజున్నవి పంపించుకోవచ్చు. వీడియో కాల్ చేయొచ్చు... పూర్తిగా జీపీఎస్.

ఆధారంగా పనిచేస్తుంటుంది. లొకేషన్ కూడా తెలియజేస్తుంటుంది... అదీ దాని ఉపయోగం...

❄ ❄ ❄

ద్వివేదీ కాల్ చేసి, బయట కాఫీ తాగుదాం రమ్మని పిలిచాడు. పదే పదే తను దివిజ ఆఫీసుకు వస్తే, ఆమె మీద శత్రువుల నిఘా ఇంకా పెరిగే వీలుంది. అందుకే బయట కలుద్దామన్నాడు. విదేశీ ఏజెంట్లకు ద్వివేదీ బాగా తెలుసు. కొద్దిదూరంలో ఉన్న ఓ ఉడిపి హోటల్‌కు రమ్మని చెప్పింది.

కాఫీ తాగుతూ చెప్పాడతను... మన చక్రధర్ ఈమధ్య ఓ కొలీగ్‌కు ఫోన్ చేసి, కీలకమైన ఓ ఆపరేషన్‌ను బ్రేక్ చేశాననీ, ఆధారాలూ దొరికాయనీ అన్నాడట. మరుసటిరోజే హతమారిపోయాడు.

'మరణించిన ఏజెంట్ వద్ద ఏమున్నాయో హంతకులు థరోగా చెక్ చేసి ఉంటారు. తన మెంటాలిటీని బట్టి ఏమైనా ఆధారాలు దొరికితే ఎక్కడ భద్రపరుచుకునే అలవాటుందో అతనికి తెలుసుకో.... వసుధ సాయంతో మేరియట్ హోటల్ రూం ఒకసారి గాలిద్దాం. ఎక్కడో ఏదో లింక్ దొరక్కపోదు. అలాగే లీ దుస్తులు, బూట్లు ఎక్కడున్నాయో తెలుసుకుని బాగా చెక్ చేయి... ' చెప్పిందామె.

'నాకు తెలిసి చక్రధర్ తనకు తెలిసినవన్నీ ఎప్పటికప్పుడు లాప్ టాప్‌లో సేవ్ చేసి, విడిగా పెన్ డ్రైవ్‌లోనూ సేవ్ చేసుకుంటాడు. చిన్న చిన్న మెమొరీ కార్డులు వాడుతుంటాడు. తన వద్దే ఉంచుకుంటాడు...'

'ఆ లాప్ టాప్ ఏమైందో..? అది ఎనిమీ చేతిలో పడి ఉంటుందా...?'

'దాంతో ప్రాబ్లమ్ ఏమీ ఉండదు. నాలుగైదు రకాల సెక్యూరిటీ పద్ధతులు వాడతాడు చక్రధర్. ఎవరికీ ఓపెన్ కాదు. ఒకవేళ రీబూట్ చేస్తే కంటెంట్ అంతా డిలెట్ అయిపోతుంది... మీరు చెప్పినట్టు ఎక్కడైనా మెమొరీ కార్డు దాచిపెట్టి ఉంటాడేమో... వెతికి చూడాలి...'

అప్పటికే పొద్దుబోయేసరికి అక్కడే మీల్స్ పార్శిల్ తీసుకుని నేరుగా ఆఫీసుకు బయల్దేరింది. తను తినేసి, యాదగిరి ఎప్పుడొచ్చినా సరే, తినడానికి వీలుగా మిగతాది హాట్ ప్యాక్‌లో పెట్టేసి బెడ్ రూంలోకి వెళ్లింది...

❄ ❄ ❄

ఉదయం తొమ్మిదికే ఆఫీసుకొచ్చింది దివిజ. అప్పటికే యాదగిరి ఉన్నాడక్కడ.

'ఏమైంది యాదీ, నువ్వు పోయిన పని?'

'రాత్రి చాలా పొద్దుపోయింది. ఆ జెడ్ టీవీ ఎండీ రాత్రి ఎనిమిది గంటలకే

ఆఫీసు నుంచి బయల్దేరాడు. గాంధీనగర్‌లోని చైనీస్ రెస్టారెంట్‌లో 11 దాకా ఉన్నాడు. ఇద్దరు చైనీయులతో గడిపాడు. ఏదో ఉంది. ఏం చేద్దాం?'

'మొబైల్ హాకింగ్...!'

'కష్టం కదూ... మహా అయితే ట్యాప్ చేయించగలం. వాయిస్ రికార్డు చేయించగలం. దీనికి మళ్లీ టాస్క్ ఫోర్స్ వాళ్లపై ఆధారపడాలి. బయటికి తెలిస్తే మీడియా గొడవ చేస్తుంది. పైగా వాళ్లు తెచ్చి ఇచ్చినప్పుడు తప్ప రియల్ టైం నిఘా కుదురదు...'

'నేను చెబుతా... చెప్పినట్టు ట్రై చేయి...' అంటూ వివరంగా చెప్పింది ఏం చేయాలో...

“రైట్... మళ్లీ తప్పకుండా మేరియట్‌కు వస్తాడు. హోటల్ రూంలో సెర్చింగ్ హోటల్ వాళ్లకూ తెలియకుండా సాగుతోంది. బహుశా అక్కడెవరో సపోర్ట్ చేస్తున్నారేమో... ఈరోజూ అక్కడే కాపేస్తా...'

'మనమూ ఆ రూం ఓసారి విజిట్ చేయాల్సి ఉంటుంది. వాళ్ల హడావుడి తగ్గాక మనం వెళ్దాం... ఈలోపు ఈ పని చేసెయ్...' యాదగిరి వెళ్లిపోయాడు...

❄ ❄ ❄

'హోటల్ హయత్ పార్కుకు వస్తావా ఓసారి...' ఫోన్లో నరసింహన్ అడిగాడు దివిజను. అది ఆయన ఫోన్ కాదు. హోటల్ ఫోన్ నంబర్. వీలైనంతవరకూ తన ఉనికి బయటపడకుండానే జాగ్రత్తపడతాడు. తన ఫోన్ ట్యాప్ చేయక పోయినా... తను ఎవరికైతే కాల్ చేస్తున్నాడో వాళ్ల ఫోన్ అప్పటికే ట్యాప్ అవుతూ ఉంటే, తన ఉనికి బయటపడిపోతోంది. అందుకే వీలైనంతవరకూ అందుబాటులో ఉన్న వివిధ ఫోన్లు వాడుతుంటాడు ఆయన. దివిజ కదలికలపై కన్నేసిన శత్రువు కచ్చితంగా ఆమె ఫోన్ ట్యాప్ చేసి ఉంటారనేది ఆయన అనుమానం.

'మీరొస్తారా? ఎన్ని గంటలకు? తప్పకుండా వస్తా సార్...'

'ఇక్కడే ఉన్నానమ్మా... పొద్దున ఫ్లయిట్‌కు అర్జెంటుగా వచ్చా. హోం మినిస్టర్ ఇక్కడే ఉన్నారు. ఏదో పనిమీద రమ్మన్నారులే... మళ్లీ సాయంత్రం ఫ్లయిట్‌కు వెళ్లిపోతా...'

'అవునా... వెంటనే మీ వద్దకు వస్తా... రూం నంబర్..?'

చెప్పాడాయన. కారు బయటకి తీసింది.

'మీ బాస్ ఇక్కడే ఉన్నాడు ద్వివేదీ... వెళ్లొద్దామా...'

కేసులో పెద్దగా ప్రోగ్రెస్ ఏముంది మేడమ్ వెళ్లి చెప్పటానికి... చిరాకు పడతారు... పైగా ఎప్పుడుపడితే అప్పుడు ఆయన్ని మేం కలవడం మంచిది కాదని మీకూ తెలుసు...'

'తెలుసు, తెలుసు... సరదాగా అడిగానులే... నన్ను రమ్మన్నాడు... వెళ్లొస్తా...'

'మన ఏజెంట్ బట్టలు, షూస్, బెల్టు ఎక్కడ పెట్టారో తెలుసుకుని... ఓసారి చెక్ చేసొస్తా...'

'మేరియట్ హోటల్ రూంనే థరోగా చెక్ చేస్తున్నవాళ్లు. మీ ఏజెంట్ దగ్గర మొత్తం చెక్ చేసి ఉంటారుగా...'

'చేయకపోవచ్చు... ఎంత సైలెన్సర్ ఉన్న రివాల్వర్‌తో కాల్చినా, పార్కులో హడావుడి పెరిగితే కష్టమనే భావనతో చకచకా చెక్ చేసి, హడావుడిగా అక్కడి నుంచి బయటికి జారుకోవటానికే ప్రయత్నిస్తారు వాళ్లు...'

'గుడ్. తను ఏ హోటల్‌లో దిగాడో కనుక్కుని ఓసారి చెక్ చేస్తే బెటరేమో...'

'రైట్... ఆ రూట్‌లోనూ ట్రై చేస్తాను... తను దిగింది ఇక్కడికి దగ్గర్లోనే... నాకు తెలుసు అది... రెండు చోట్లకూ వెళ్లొస్తా...'

'ఆ హోటల్ రూంనీ చెక్ చేసి, ఏది దొరికితే అది పట్టుకుపోయి ఉంటారు ఎనిమీస్. ఒకవేళ ల్యాప్ ట్యాప్ గనుక ఉండి ఉంటే దాన్ని తీసుకెళ్లి, తాపీగా ఆ వివరాలు తీసుకునే ప్రయత్నం చేస్తారు. సో, రూంలో మనకేమీ దొరకకపోవచ్చు. కానీ ఒకసారి వెళ్లిరావడం మంచిది...'

మళ్లీ ఆ ఉడిపి హోటల్ వద్దే కలిశారు వారిద్దరూ... అక్కడి నుంచి హయత్ వైపు కారును ఉరికించింది దివిజ.

❄ ❄ ❄

'చెప్పు... ఏం తీసుకుంటావు? కాఫీ, టీ...? పోనీ, టిఫిన్ చేస్తావా..? లేదంటే సరదాగా నడుచుకుంటూ వెళ్లి ఆ మూలమలుపు మీదున్న బండిమీద ఇడ్లీలు లాగించి వద్దమంటావా...? స్టార్ హోటల్‌లో ఇడ్లీలు అసలు ఇడ్లీలే కాదు... అయ్యబాబోయ్ ఇక్కడ వీళ్లిచ్చేది సాంబారే కాదు...'

ఆయనకు ఇడ్లీ సాంబారంటే పిచ్చి. దివిజంటే ఎందుకో ఆయనకు ఆప్యాయత. ఆయన తన వృత్తి జీవితంలో ఎన్నో వేల మందితో డీల్ చేశాడు

గానీ, దివిజను చూస్తే తనకెందుకో అభిమానం. కొన్ని ఫీలింగ్స్ లాజిక్‌కు అందవు. ఆయన డ్యూటీలో ఉన్నప్పుడు ఎంత సీరియసో, ఆఫ్ డ్యూటీలో చాలా సరదాగా ఉంటుంటాడు...

'హహహ... కాఫీ తీసుకుంటాను సార్...' పీబీఎక్స్ ఫోన్‌లో ఆర్డర్ చేశాడాయన.

'ఏం సార్, అంత అర్జెంటు పని?' కుతూహలంగా అడిగింది ఆమె.

'ఓ ఫైల్ పై సంతకాలు కావాలి. చాలావరకూ డిఫెన్స్ మినిస్ట్రీ, విదేశీ వ్యవహారాల మినిస్ట్రీ ఇచ్చే ఆఫ్ ది రికార్డు ఫండ్స్‌తోనే నడుస్తుంటాయి మా వ్యవహారాలు. ఆడిటింగ్ అడిగితే ఒక్క రూపాయికీ బిల్లుండదు ఇక్కడ... నమ్మకాలు, అవసరాలు, ప్రాణాలు, సందర్భాలు, పరిస్థితులు, ఆయా ఏజెంట్లు అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలను బట్టి ఖర్చులు ఉంటాయి. పెద్దగా హోం మినిస్ట్రీలో లింకులేముండవు. కానీ కొన్ని ఫైళ్లపై ఆయన కౌంటర్ సైన్ ఉంటే మరీ మంచిదని అలా చేయిస్తుంటాం. అసలే పాలిటిక్స్, ఎవరు ఎవర్ని ఎలా ఇరికిస్తారో, ఎలా ఆడిస్తారో తెలియదు కదా...' అని నవ్వేశాడు.

'పాలిటిక్స్ ఎలా భ్రష్టుపట్టిపోతున్నా... దేశరక్షణకు సంబంధించిన కొందరు ఉన్నతాధికారులు దేశం కోణంలోనే ఆలోచించగలరు కాబట్టే ఇంకా దేశం నిలబడింది సార్... అఫ్ కోర్స్ ఇక్కడా అవలక్షణాలు, అవినీతి, అక్రమాలు ఉండొచ్చు. సొసైటీలోనే కేరక్టర్, వాల్యూస్ డిగ్రేడేషన్ దారుణంగా ఉన్నప్పుడు ఆ ప్రభావం మీ శాఖలపైనా ఉంటుంది కదా సార్...'

'కరెక్ట్ దివిజా... మనిషికన్నా కుటుంబం ముఖ్యం. కుటుంబం కన్నా సంఘం ముఖ్యం. సంఘంకన్నా దేశం ముఖ్యం. ఈ దేశమే ముక్కలైనప్పుడు హక్కులుండవూ, అరుపులూ ఉండవు. కుక్కలు చింపిన విస్తరిని చేస్తాయమ్మా విదేశీ శక్తులు. బందీఖానాలోనే ఉన్నవాడికే తెలుస్తుంది స్వేచ్ఛ విలువేమిటో... దేశ సరిహద్దు గ్రామాల్లో క్షణక్షణం ఉలిక్కిపడేవాళ్లకే తెలుస్తుందమ్మా దేశరక్షణ అవసరమేంటో... మన దురదృష్టమేమిటంటే, ఒక్క స్టేట్స్‌మెన్ కూడా ప్రస్తుత పాలిటిక్స్‌లో లేకపోవడం... కొందరు ఉన్నా పాలిటిక్స్ మొత్తంగా పొల్యూటైపోయి వాళ్లూ ఏం చేయలేని దుస్థితి. వల్లభ భాయ్ పటేల్ వంటి నేతలు కావాలమ్మా... '

ఓ అత్యున్నతాధికారి, ఓ అనామక డిటెక్టివ్ మాట్లాడుకుంటున్నట్లు లేవు వారి మాటలు. ఇద్దరు ఫ్రెండ్స్ కాఫీలు తాగుతూ ముచ్చట్లు పెట్టుకుంటున్నట్టుగా సాగుతున్నాయి.

'మీరు నెగెటివ్ కోణంలోనే చూస్తున్నారు సార్... పాలిటిక్స్ ఎంత దిగజారుతున్నట్టు కనిపిస్తున్నా మన డెమోక్రసీ ఇంకా బలంగానే నిలబడిందిగా సార్... మన చుట్టుపక్కల దేశాల్లో సాగినట్టు సైన్యం పెత్తనం ఇప్పటికీ లేదు. ఒక్క రాష్ట్రమూ విడిపోలేదు. అక్కడక్కడా వేర్పాటువాదం తలెత్తినా మొత్తంగా ఇంకా సంయుక్తంగా ఉండగలిగింది దేశం. ఇన్ని భాషలు, ఇన్ని వైరుధ్యాలు, ఇన్ని మతాలు, ఇన్ని సంస్కృతులు, ఇన్ని పార్టీలూ... 1947కి ముందైతే ఎన్నెన్నో సంస్థానాలు, చిన్న చిన్న రాజ్యాలు... ఓ దేశంగా స్వరూపం సంతరించుకున్నాక, అతి పెద్ద డెమోక్రటిక్ దేశంగా మనం ప్రపంచంలో బలంగానే నిలబడగలగడం విశేషమే సార్... ప్రపంచంలో ప్రతీ దేశంలోనూ ఏదో అలజడి. అంతర్యుద్ధాలు, యుద్ధాలు, విశ్వమానవుడు అత్యంత హీనదశలో కొట్టుకుంటున్న స్థితిలోనూ... విదేశాల ఆక్రమణలు, తీవ్రవాద వ్యూహాలు, పరోక్షయుద్ధాలు, నకిలీ కరెన్సీ దాడులు, మతం పేరిట మారణహోమాలు ఎన్నెన్ని థ్రెట్స్ ఉన్నా ఇండియా నిలబడటానికి కొన్ని బుర్రలు నిరంతరమూ దేశం గురించి ఆలోచించడమే కదా సార్...'

ఆమె వైపు అబ్బురంగా చూస్తూ ఉండిపోయాడు నరసింహన్. సమాజం పట్ల, దేశం పట్ల కన్సర్న్ ఉన్నవాళ్లు అదురుగా కనిపించే ఈ రోజుల్లో ఆమె దేశం పట్ల చూపిస్తున్న పాజిటివ్ ధోరణి ఆయనకు బాగా నచ్చేసింది.

'నాకింకా టైముంది. మినిస్టర్ ఏదో పొలిటికల్ చర్చల్లో ఉన్నాడట. మరో కాఫీ తాగుదాం...'

'అలాగే సార్... నేనింతగా మీతో ఇలా మాట్లాడుతున్నానని ఏమీ అనుకోవద్దు సార్... దేశభక్తి, సమాజం అనేవి ప్రస్తుతం బూతుపదాలైపోయాయి... దేశం కోసం ఎందరో త్యాగాలు చేస్తున్నా అవి లెక్కలోకి రావడం లేదు. సమాజం గురించి, వ్యక్తిగత శీలం గురించి అనర్గళంగా చెప్పగలిగినవారెందరో... తమ తమ రంగాల్లో అనితర సాధ్యమైన విజయాలు సాధించినవారెందరో... వీరెవరూ లైమ్ లైట్‌లోకి రారు... నిన్న గాక మొన్న సినిమాల్లోకి వచ్చిన ఓ కుర్ర వారసుడు వాడే సెంటేమిటి? వాడే బైకేమిటి? ఎంతమందికి లైనేస్తున్నాడు? పార్టీలో ఎలా బిహేవ్ చేశాడు? ఇవీ వార్తలయ్యాయి. వాళ్లు ప్రవచనాలు చేస్తున్నారు. మీడియా దిగజారుడుతనం కూడా సమాజానికి అరిష్టమే సార్... '

'తప్పమ్మా... మనుషులు కోరుకునే ఎంటర్‌టైన్‌మెంట్ అందించడమే మీడియా దందా... అదొక వ్యాపారం... సమాజాన్ని ఉద్ధరించడం ప్రస్తుతం

దాని పని కాదు... వ్యక్తిగతంగా ఒక్క పైసా తన కోసం సంపాదించాలని ఆలోచించకుండా, పదవుల్ని పట్టుకుని వేలాడకుండా, దేశహితం, సమాజహితం కోణాల్లో ఆలోచించేవాడే నిజమైన నేత. ఇప్పటికీ కొందరున్నారు. అలాంటివాళ్లు కీలకమైన పదవుల్లో ఉంటే జుడీషియరీ, డిఫెన్స్, బ్యూరోక్రసీ, పాలిటిక్స్ తనకు మద్దతునిస్తాయి. లేదంటే ప్రతీవాడూ అన్ని విషయాల్లోనూ జోక్యం చేసుకోవాలని అనుకుంటాడు...'

'అవును సార్... డబ్బు ప్రాముఖ్యం రాజకీయాల్లో పెరగడమే అరిష్టాలకు కారణమవుతోంది. ఎన్నికలనూ, డబ్బునూ కలగలిపి రాజకీయాలు చేయడం ఆరంభించారో అప్పటి నుంచే ఈ దిగజారుడుతనం. ఏదోరకంగా డబ్బు సంపాదించినోడు ఆ డబ్బును ఖర్చు పెట్టి పెద్ద నేతలవుతున్నారు. మా రాష్ట్రంలో ఓ లీడర్ ఉన్నాడు. మొన్నమొన్నటి వరకూ సంతకం చేయడం రాదు. ఫోన్‌లో ఓ కాంటాక్ట్ సేవ్ చేయలేడు. బ్యాంకు గ్యారంటీల కలర్ జిరాక్స్ కాపీలు తీసి, దాదాపు 12 ఇంజనీరింగ్ కాలేజీలు, ఓ మెడికల్ కాలేజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, బీఈడీ... వాట్ నాట్ అదొక విశ్వవిద్యాలయం. ఆ డబ్బు వెదజల్లి నాయకుడయ్యాడు. ఇప్పుడు కేంద్ర మంత్రి కావాలని ఆశ. ఒక్కసారి ఆలోచించండి సార్, ఆయనకు ఏ విదేశాంగశాఖో, రక్షణశాఖో, ఆర్థికశాఖో ఇస్తే ఏమవుతుందో...'

'ఏమీ కాదు... ఆయనొక్కడే కాదు, నిర్ణయాలు తీసుకునేది. పాలసీ వ్యవహారాలు మొదట రూపొందించేది సంబంధిత శాఖ కార్యదర్శులు, లీగల్ ఒపీనియన్స్ ఉంటాయి. కేబినెట్‌లో డిస్కషన్స్ ఉంటాయి. మరీ కీలకమైంది ఐతే పార్లమెంటులో పెట్టి చట్టం చేయాలి. ఒకవేళ లోక్‌సభ ఓకే అన్నా... రాజ్యసభ తిరస్కరించొచ్చు. ఆ బిల్లు నష్టదాయకమని ఎవరైనా కోర్టుకు వెళ్తే మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైతే సుప్రీం కోర్టు కొట్టేయవచ్చు. అంతెందుకు, తనకు నచ్చకపోతే రాష్ట్రపతి కూడా రిజెక్టు చేయవచ్చు. ఒక్క మంత్రి చేతిలోనూ మొత్తం వ్యవహారం ఉండదు. కానీ నీవన్నదాంట్లో ఓ నిజం ఉంది. రాను రాను రియల్ పొలిటియన్స్ కన్నా కార్పొరేట్ శక్తులు, వ్యాపారవేత్తల చేతుల్లలోకి వెళ్తున్న తీరు మాత్రం ఆందోళనకరమే. ఈ మధ్య మా క్లబ్‌లో కూర్చున్నప్పుడు ఓ సామాజికవేత్త కమ్ రిటైర్డ్ మేజర్ ఓ ఉదాహరణ చెప్పాడు...'

'ఏమిటి సార్ అది...' ఆసక్తిగా అడిగింది దివిజ.

మనదేశంలోనే ఓ చిన్న రాష్ట్రంలో అపారమైన ఖనిజనిక్షేపాలున్నాయి. ఇండియాలోని టాప్ టెన్ కంపెనీల్లో ఒకదానికి అక్కడున్న మైన్స్‌పై కన్ను పడింది.

ఓ కంపెనీని ఫ్లోట్ చేసింది. కానీ మనకున్న నిబంధనల ప్రకారం లోకల్ పంచాయితీల తీర్మానాల దగ్గర్నుంచి స్టేట్ గవర్నమెంట్ దాకా రకరకాల అనుమతులు కావాలి. లేదంటే మైనింగ్ సాధ్యం కాదు. స్థానికుల రక్షణ, వాటా, కొలువులు... ఇలా చాలారకాల రూల్స్ ఉంటాయి. అదేమో దేశ రాజకీయాలను, పార్టీలను డబ్బుతో శాసించే రకం. కానీ అక్కడున్నది ఓ ప్రాంతీయ పార్టీ. స్థానికుల ఉద్వేగాలకు పెద్దపీట వేస్తూ పెరిగిన పార్టీ. దాంతో రాష్ట్ర రాజకీయాలనే గ్రిప్ లోకి తెచ్చుకునేందుకు ఓ ప్లాన్ అమలు చేసింది'

'అదెలా సాధ్యం సార్... ఎన్నికల్లో నిలబడటం, గెలవడం, దానికి ప్రజల మద్దతు అవసరం కదా... అంత త్వరగా వాళ్లను జనం ఎలా నమ్ముతారు?'

'అందుకే అంతా ఇన్‌డైరెక్టు మెథడ్స్ మొదలెట్టారు.. మొదట తెలివిగా ఓ సోషల్ వర్కర్ ను కొనేశారు. తనకు మంచి పేరే ఉంది. అధికారంలో ఉన్న పార్టీకి డబ్బు ఆఫర్ చేసి, ముందుగా ఆ వర్కర్ ను ఎమ్మెల్సీగా గవర్నర్ తో నామినేట్ చేయించారు...'

'గవర్నర్ తో చట్టసభలకు నామినేట్ చేయించడమనేది ఆంగ్లో క్రిస్టియన్ల ప్రయోజనాల కోసం కదా సార్... వాళ్లకే ఇవ్వాలిగా...'

'అది అసెంబ్లీకైతే... కానీ శాసనమండలి అంటే కౌన్సిల్‌కు మాత్రం అధికారంలో ఉన్నవారు ఎవరి పేరు సూచిస్తే వారిని గవర్నర్ నామినేట్ చేస్తారు...'

'అసలు శాసనమండళ్లే వేస్టని అప్పట్లో ఎన్టీయార్ లాంటి నేతలు విమర్శించేవారు...'

'విమర్శించడమే కాదు, దాన్నే వద్దనుకున్నాడు. సరే... ఎమ్మెల్సీ అయిన కొద్దిరోజులకే తను పార్టీలో మరింత చురుకుగా పావులు కదపడం మొదలెట్టాడు... వెనుక కంపెనీ డబ్బులున్నాయి. తనకంటూ ఓ బలమైన వర్గాన్ని తయారు చేసుకున్నాడు. పార్టీ సీనియర్ నేతలు సిఫార్సు చేయడంతో ముఖ్యమంత్రి తన కేబినెట్‌లో కూడా స్థానం ఇచ్చారు. ఐరనీ ఏమిటంటే... ఆయనకు గనుల శాఖను అప్పగించారు...'

'కొద్దినెలలకే ముఖ్యమంత్రి ఓ ప్రమాదంలో మరణించాడు. దానివెనుక కుట్ర ఉందనే ఆరోపణలు వచ్చినా ఓ దర్యాప్తు బృందాన్ని వేశారు. అది ఇప్పటికీ తన రిపోర్టు ఇవ్వనేలేదు. మళ్లీ అడిగేవారు లేకుండా పోయారు. ఇక అంతే అది...'

'అవునవును... మీరు ఏ రాష్ట్రం గురించి చెబున్నారో నాకర్థమైంది...'

'ఒకరిద్దరు పార్టీ మారితే ఫిరాయింపుల చట్టం కిందకు వస్తుంది. మొత్తం మారితే ప్రమాదమే లేదు. అలా రెండు మూడు చిన్న చిన్న పార్టీల నేతల్ని తిప్పేసుకున్నారు. అధికార పార్టీ కకావికలమైతే తమకే లాభమనే ఫీలింగ్ తో అపోజిషన్ పార్టీ మాట్లాడకుండా ఉండటమే కాదు, ఏకంగా ఆ సోషల్ వర్కర్ కమ్ కొత్త మంత్రిని ముఖ్యమంత్రిని చేస్తానంటే మద్దతు కూడా ఇస్తానంది. సొంత పార్టీ నేతలు కొందరు కూడా సపోర్ట్ చేశారు. ఇంకేం... అతను సీఎం అయ్యాడు. ఒక్కరు కూడా ఓటేయకుండానే ఓ వ్యక్తి సీఎం అయ్యాడు...'

'దీంట్లో చాలా లొసుగులున్నాయిగా సార్... పార్టీలు మారినవారిపై అనర్హత వేటు వేయొచ్చు, అధికార పార్టీ సీనియర్ నేతలు కోర్టుకు వెళ్లొచ్చు...'

'ఆ కేసులు తెమిలేలోపు తన పదవీకాలమే పూర్తవుతుంది. పైగా ఫ్లోర్ లీడర్ గా మెజారిటీ సభ్యులు ఎన్నుకుంటే గవర్నర్ కూడా అతన్నే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానించక తప్పలేదు. అనుకున్నట్టే మెజారిటీ నిరూపించుకుని, తన తొలి స్టెప్ వేశాడు... పారిశ్రామికంగా రాష్ట్రం అగ్రస్థానంలోకి రావటానికి బ్రహ్మాండమైన విధానం ఒకటి ప్రవేశపెట్టాడు. అత్యంత సులభంగా అనుమతులు వచ్చేలా ఆ విధానం రూపొందింది. ఒకసారి ముఖ్యమంత్రే మనోడైతే ఇక దిగువ స్థాయిలో వచ్చే అభ్యంతరాలు ఎంతసేపు...? కొన్ని వేల ఎకరాల్లో బ్రహ్మాండంగా మైనింగ్ జరుగుతోందక్కడ. జాతీయ స్థాయి అనుమతులు ఆ కంపెనీకి చాలా ఈజీ... ఇంకేం, ట్రక్కులు, టిప్పర్లు, షావెల్స్ వేల టన్నుల ఖనిజం రోజూ విదేశాలకు ఎగుమతవుతోంది. మన సంపద, అక్కడి జనానికి హక్కున్న సంపద, ఎవరో తవ్వుతున్నారు. అది ఎవడికో ఉపయోగపడుతోంది... అదీ కథ...' ముగించాడు నరసింహన్.

'సర్, మీరు చెప్పిందంతా కరెక్టే కావచ్చు. రాజకీయాలు భ్రష్టుపట్టిపోవచ్చు. కానీ ప్రపంచవ్యాప్తంగా ఇదే స్థితి. ఏవో సర్వే ఏజెన్సీలు ఇచ్చే రేటింగ్స్‌ను బట్టి ఆయా దేశాల ఆర్థికవిధానాలు మారుతున్నాయి. స్టాక్ మార్కెట్లు కదులుతున్నాయి. ఈ అస్థిరత నుంచి, ఈ అయోమయం నుంచి, ఈ అక్రమం నుంచి... సమాజం క్రమేపీ ఓ శాస్త్రీయ, సుస్థిర విధానాలవైపు కచ్చితంగా అడుగులు వేస్తుందనే నేను నమ్ముతాను..'

'ఆ ఆశావాదమే నీలో నాకు నచ్చేది... గుడ్..., నువ్వు చెప్పినట్టు ఈ

ప్రపంచం, మానవసమాజం చాలా సంక్షోభాల్ని తట్టుకుని, దాటుకుని అడుగు లేస్తోంది... ఇంతకీ నువ్వు వచ్చిన పనేమైంది?'

'నాకూ చాలా తొందరగానే ఉంది సార్, దీన్ని ఓ కొలిక్కి తీసుకురావాలని... కానీ పెద్దగా ప్రోగ్రెస్ లేదు. చైనీస్ సీక్రెట్ ఏజెన్సీ ఏదో ఆపరేషన్ మీద ఉందనేది ఖాయం. ఎక్కడ బ్రేక్ చేయాలో అర్థం కావడం లేదు...'

'అంత సత్వరం ఛేదించాల్సిన అవసరమేమీ లేదు... చైనా ఉగ్రవాదానికి చేయూత వంటి పనులేమీ చేయదులే... '

'అదేంటి సార్..? ఏదో డ్యామేజీ జరగకముందే అడ్డుకోవాలిగా...'

'చూడమ్మా... ప్రస్తుతం దేశాలు యుద్ధాలు చేసే స్థితిలో లేవు. ఇప్పుడంతా తమ తమ ఆర్థికవిధానాలతో విదేశాల మార్కెట్లను గుప్పిట్లోకి తెచ్చుకునే కొత్త యుద్ధరీతుల్లో ఉన్నాయి. దేశాలను ఆర్థికంగా అస్థిరపరచడమే ఇప్పటి యుద్ధనీతి. దానికోసమే రకరకాల ఎత్తులు, జిత్తులు... అంత పెద్ద అమెరికాయే అఫ్ఘనిస్థాన్ యుద్ధంతో కళ్లు తేలవేసి వెనక్కి తప్పుకుంటోంది... యుద్ధాలు దేశాల్ని ఆర్థికంగా చాలా దెబ్బతీస్తాయి... యుద్ధం మధ్యయుగాల సంస్కృతి. ఇప్పుడు యుద్ధాలు ఒకవేళ జరిగినా ముఖాముఖీ తలపడవు... అన్నీ దూరం నుంచి టెక్నికల్‌గా సాగించే యుద్ధాలే ఉంటాయి... అది చాలా పెద్ద సబ్జెక్టు...'

మరిన్ని సీక్రెట్ ఆపరేషన్స్ ఎందుకు సార్...? వందలు, వేల కోట్ల ఖర్చుతో స్పయింగ్ ఎందుకు?'

'ఎందుకంటే... రక్షణ కోసం, ఎదుటి దేశం బలపడకుండా, తాము బలంగా ఉంటే చాలు... ఈ విధానమే చాలా దేశాలు ప్రస్తుతం నమ్మేది. ఇప్పుడు మెజారిటీ ప్రపంచ దేశాలు కేవలం రక్షణ కోసమే సైన్యాలను పోషిస్తున్నాయి. దాడుల కోసం కాదు. కొన్ని మినహాయింపులు ఉండొచ్చు. మనం బలపడే ప్రయత్నాలను చైనా నిరోధిస్తుంది. మనం బలపడితే ఎప్పటికైనా తన భద్రతకు ప్రమాదమనేది దాని ఫీలింగ్. మనం సొంతంగా బలపడి శత్రు దుర్భేద్యంగా మారాలనేది మన తాపత్రయం. అదీ రక్షణ కోసమే. దాడుల కోసం కాదు...'

'బడితె ఉన్నోడిదే బర్రె అన్నట్టు... ఒకసారి విదేశాలు అంతులేని శక్తిని సమకూర్చుకున్నాక ఎందుకు ఊరకే కూర్చుంటాయి..? గెలకటానికే ప్రయత్నిస్తాయి...'

'అవును. అందుకే మనం బలంగా ఉంటేనే మన జోలికి ఎవరూ రారు.మన

అణ్వస్త్రాల తయారీ కూడా అందుకే. మనం ఎదుటోడిని కొట్టకపోయినా, వాడు తలపడితే నాలుగు తగిలించే స్థితిలో ఉండాలి... అందుకే ఏ దేశం ఏ కొత్త ఆయుధాన్ని రూపొందిస్తోంది. ఎవరెవరితో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది, ఎవరి బలాబలాలేంటి, తన బలగాలను ఎక్కడెక్కడ మొహరించి ఉంచుతోంది... వంటి విషయాలపై స్పయింగ్ చాలా కామన్... ఇది దేశరక్షణ వ్యూహాల్లో భాగమే... చాలా దేశాల సంబంధాలు, స్నేహాలు ఈ కోణంలోనే సాగుతాయి... లేకపోతే పాకిస్థాన్ ఏమైనా చైనాకు ఇష్టమా..? మనకు పక్కలో బల్లెంగా పాకిస్థాన్ ఉన్నన్ని రోజులూ చైనాకు సంబరమే... తను అనుకున్న పనేదో ఇంకెవడో చేస్తుంటే వాడికెందుకు తీట...? నాలుగు డబ్బులు పారేసి, పనిచేయించుకుంటున్నాడు...'

'అయినా సరే... కొద్దిరోజుల్లోనే హైదరాబాద్ బేస్డ్‌గా సాగుతున్న ఆపరేషన్ బ్రేక్ చేస్తాను సార్... నా వెనుక ఉండండి మీరు చాలు...'

'నేను వెళ్తాను...' అంటూ తను హోం మినిస్టర్‌ను కలవటానికి లేచాడు. దివిజ కూడా సెలవు తీసుకుంది..

❄ ❄ ❄

యాదగిరి ఫోన్ చేశాడు. ఓసారి గ్రాండ్ అశోకా హోటల్ వద్దకు రమ్మన్నాడు. నేరుగా హోటల్ వద్దకు వెళ్లింది. కారులోనే కూర్చుని యాదగిరికి మెసేజ్ ఇచ్చింది. తన ఫోన్లో బ్లూటూత్ ఆన్ చేసి ఉంచింది...

హోటల్ కారిడార్‌లో నడుస్తూ వస్తున్న జెడ్ టీవీ ఎండీని కావాలనే గుద్దుకున్నాడు యాదగిరి. ఒక చేయిని కావాలనే... ఎండీ ఎవరితోనో ఫోన్ మాట్లాడుతున్న చేయికి గట్టిగా తగిలించాడు. ఫోన్ కింద పడింది...

'సారీ సర్... ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ...' అంటూ కింద పడిన ఫోన్ తన చేత్తో పట్టుకుని జాగ్రత్తగా తుడవడం మొదలెట్టాడు.

'ఫర్లేదు... ఇటివ్వు...' అంటూ చేయిసాచాడు అతను.

'గీత పడినట్టుంది. మంచి ఫోన్... ' అంటూ జేబులో నుంచి కర్చీఫ్ తీసి తుడిచాడు. తుడుస్తూనే ఓసారి కింద పడేశాడు. కిందకు వంగి ఫోన్ తీసుకుంటూనే ఎండీ చూడకుండా ఆ ఫోన్ బ్లూటూత్ ఆన్ చేసి పైకి నెమ్మదిగా లేచాడు... మరోసారి సారీ సర్, అంటూ వెళ్లిపోయాడు. అతనివైపు గుర్రుగా చూస్తూ ఫోన్ వైపు చూశాడు. కాల్ ఆగిపోయినట్టు సూచిస్తోంది. మళ్లీ రింగ్ చేసి, మాటల్లో మునిగిపోయాడు...

కారులో కూర్చున్న దివిజ ఫోన్‌లో అవైలబుల్ బ్లూటూత్ డివైజెస్ చెక్ చేస్తోంది. యాదగిరి ఆపరేషన్ పూర్తికాగానే ఆ డిస్‌ప్లేలో ఆ టీవీ ఎండీ పేరుతో ఉన్న డివైజ్ వివరాలు కనిపించాయి. ఒక్కసారిగా ఆమె మొహంలోని నవ్వు ప్రవేశించింది. రెండు క్షణాల్లో ఆ ఫోన్‌లోకి ఆమె పంపించిన అక్షరాలు చేరిపోయాయి. నిజానికి ఎదుటి వ్యక్తి ఫోన్ నుంచి యాక్సెప్ట్ చేస్తే తప్ప బ్లూటూత్ నుంచి డేటా ట్రాన్స్‌ఫర్ చేయడం కుదరదు. కానీ ఫోన్ హ్యాకింగ్ చిట్కాలు కొన్ని బ్రిటన్‌లో ఉన్నప్పుడే నేర్చుకుంది. ఎదుటి వ్యక్తి పర్మిషన్ అక్కర్లేకుండానే తన ఫోన్‌లోకి ఎంటరైపోయింది. ఇక ఆ ఎండీ ఫోన్ నుంచి ఏయే నంబర్లకు కాల్స్ వెళ్లాయి, ఏయే మెసేజీలు వెళ్లాయనే వివరాలు ఆమె ఇట్టే తెలుసుకోగలదు... అందుకే యాదగిరికి ఆఫీసుకు వెళ్తున్నట్లు మెసేజీ కోడ్ భాషలో కొట్టేసి బయల్దేరిందామె...

❄ ❄ ❄

'ఎవరో బషీర్ దిగిన హోటల్ రూంలో పదే పదే చెక్ చేస్తున్నారు. అదీ రహస్యంగా. ఒకసారి మీరు సీజ్ చేసిన రూంలోకి వాళ్లెవరో వెళ్తున్నారంటే హోటల్ సిబ్బంది ఎవరో సహకరిస్తున్నారని లెక్క...'

ఏసీపీ వసుధ ఎదుట కూర్చుంది దివిజ.

'నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. మేమూ చెక్ చేశాం. అనుమానాస్పద వస్తువులేవీ దొరకలేదు. కావాలంటే నువ్వూ చెక్ చేయి. మా సీఐని తోడిచ్చి పంపిస్తా' అంది వసుధ.

'తన బిలాంగింగ్స్ ఎక్కడ భద్రపరిచారు?'

ఈలోపు కానిస్టేబుల్ వచ్చి 'మీకోసం ఎవరో వచ్చారు మేడమ్... పేరు ద్వివేదీ...' అన్నాడు.

'రమ్మను... మూడు కాఫీ తీసుకురా...' పురమాయించింది.

అంతకుముందే ద్వివేదీకి కాల్ చేసి వసుధ వద్దకు రమ్మంది.

లోపలకు వచ్చి పలకరింపుగా నవ్వాడు ద్వివేదీ.

'వసుధ మీకు ఇంతకుముందే పరిచయమా?' అడిగింది దివిజ.

'గతంలో ఒకటీ రెండు కేసుల్లో బాగా హెల్ప్ చేసింది.'

'ఓహ్, ఐతే సరే... నువ్వు వెళ్లిన పనేమైంది...?'

'బషీర్ రూం మనం చెక్ చేయాల్సిందే. కానీ రూంపై ఎవరో నిఘా వేసి పెట్టినట్టుంది. రహస్యంగా వెళ్లి రావాల్సిందే...'

'చక్రధర్ విశేషాలు ఏమైనా తెలిశాయా?'

'ఇప్పుడు వెళ్లొస్తాను. తన బూట్లు, దుస్తులు ఓసారి థరోగా చెక్ చేసొస్తా. ఆల్రెడీ ఆ సీఐకి చెప్పి పెట్టాను.'

'నువ్వు అది చెక్ చేసిరా... ఈలోపు బషీర్ రూం పక్కనో, ఎదురుగానో వచ్చేలా ఓ రూం బుక్ చేయించు. ఇద్దరమూ వెళ్లి చెక్ చేసొద్దాం...'

'రూం బుక్ చేయడమెందుకు? నన్ను రమ్మంటే నేనూ వస్తా. ఏముంది ఇందులో..? ఎలాగూ నా పరిధిలోనిదే కాబట్టి మీ ఇష్టమొచ్చినంతసేపు వెతకండి...' అంది వసుధ.

'వద్దు, వద్దు, నేరుగా వెళ్లి బషీర్ రూంలోకి పోలేం. అఫీషియల్‌గా వెళ్తే అందరి దృష్టి పడుతుంది. అలా గాకుండా అనఫీషియల్‌గా వెళ్దాం.... కనీసం ఎవరైనా మిత్రులు తారసపడతారేమో చూద్దాం. ఎందుకైనా మంచిది వెపన్‌తో రా... డైరెక్టుగా అక్కడికే వచ్చెయ్... నేను వెళ్లి ఆ రూంలో జాయినైపోతా... నువ్వు తాపీగా వచ్చెయ్...'

'వోకే.. మేడమ్ ... బై...'

❄ ❄ ❄

'యాదీ... నువ్వు ఎక్కడెక్కడ ఎలా తిరుగుతావో... ఏమో, హోటల్ రూంలో నేనున్నంతసేపూ ఆ పరిసరాల్లోనే ఉండు... అవసరమైతే రావటానికి వీలుగా...'

'వోకే మేడమ్...'

జెడ్ టీవీ ఎండీ ఫోన్ కాల్స్ విశ్లేషించుకునే పనిని టెంపరరీగా వాయిదా వేసుకుంది. ఓ ఫోన్ యాప్ ద్వారా టాక్సీని బుక్ చేసుకుని వెయిట్ చేయసాగింది.

❄ ❄ ❄

చక్రధర్ ల్యాప్ టాప్ పోయినట్టే. అందులో డౌట్ లేదు. ఒకవేళ ఎవరైనా తీసుకెళ్లినా దాన్ని ఓపెన్ చేయడం వాళ్ల వల్ల కాదు. ఐనా అందులో రహస్యాలు ఏమీ ఉంచడు. ఎప్పటికప్పుడు ఎక్స్‌టర్నల్ మెమొరీలోకి ఎక్కించి, ల్యాప్‌లో డిలీట్ కొట్టేస్తాడు. సో, తను వాడిన మెమొరీ స్టిక్ ఏమైంది? బషీర్ వ్యవహారంపై తప్పకుండా తను ఏదో తెలుసుకుని ఉంటాడు....' అనుకుంటూనే ద్వివేదీ స్టేషన్ చేరుకున్నాడు.

చక్రధర్ దుస్తులు, బూట్లు, బెల్టు మాత్రమే ఉన్నాయక్కడ. చొక్కాపై రక్తం మరకలున్నాయి. పర్స్ తీసుకెళ్లి ఉంటారు. తనతోపాటు ఉండే వెపన్ కూడా స్వాధీనం చేసుకుని ఉంటారు. వెపన్ ఉపయోగించే అవకాశం వచ్చి ఉండదు.

ముందుగా దుస్తులన్నీ చెక్ చేశాడు. చొక్కా కాలర్ దగ్గర చింపి చూశాడు. కాలర్ స్టిఫ్‌గా ఉండేందుకు అటూ ఇటూ చిన్న తేలికపాటి ప్లాస్టిక్ బద్దలు పెడుతుంటారు. ముఖ్యమైనవి దాచుకోవటానికి ఆ స్థలాన్ని కూడా వాడుతుంటారు. చిన్నగా కట్ చేసి అందులో నుంచి లోపలికి జొప్పిస్తే చాలు, ఎవరికీ కనిపించదు. భద్రంగా ఉంటుంది. కానీ అక్కడేమీ కనిపించలేదు. జేబు వెనక వైపు, అంచుల్లోని కుట్ల వద్ద, చేతుల చివర్లలో చూశాడు. కానీ అంతా ప్లెయిన్. ప్యాంటుకు ఇలాంటి రహస్య అరలు చాలా ఉంటాయి. బెల్టు పెట్టుకునే స్ట్రాప్స్ మంచి పాయింట్స్. పాకెట్స్ వెనుకగా కుట్టే రెండు రకాల సీక్రెట్ పాకెట్స్ కూడా చెక్ చేశాడు. అక్కడక్కడా వాటిని కట్ చేసి ఎవరో చూసినట్టు అనిపిస్తోంది. సో, ఇక్కడా శతృవు యాక్టివ్‌గానే ఉన్నాడన్నమాట.

బెల్టు బకిల్ వెనుక వైపు చూసి దాన్ని తీసి, బెల్టు అంచులు చెక్ చేశాడు. బూట్లు చూశాడు. రెండు సోల్స్ కట్ చేసి ఉన్నాయి. సో, ఏమీ లేవన్నమాటే. బనియన్ చాలా పలుచగా ఉండి, అంతా సెమీ ట్రాన్స్‌పరెంట్‌గా ఉంది. విసుగ్గా పక్కన పడేసి ఆలోచిస్తున్నాడు.

కట్ డ్రాయర్ వైపు పడింది తన చూపు. నిజానికి దాన్ని కట్ డ్రాయర్ అనడంకన్నా మరీ చిన్న షార్ట్ అనాలి. సింపుల్‌గా చెప్పాలంటే ఊళ్లలో వేసుకునే చెడ్డీ. కానీ బ్రాండెడ్. ఓసారి దాని ఎలాస్టిక్ పార్ట్ చెక్ చేశాడు. ఓచోట కొంచెం గరుకుగా తగిలింది. కొద్దిసేపు కుస్తీ పట్టాక ఓ చిన్న మెమొరీ కార్డు బయటి కొచ్చింది. అందులో ఏముందో చూడాలంటే దివిజ ఆఫీసే శరణ్యం. డేటా ఉందో లేదో తెలియదు. డేటా ట్రాన్స్‌ఫర్ కోసం గానీ, రీడ్ చేయడం కోసం గానీ ఉపయోగపడే కార్డు హోల్డర్ బహుశా ల్యాప్‌తో పాటే ఉండిపోయి ఉంటుంది. మరి దీన్ని చదివేదెలా?

దాన్ని చేతిలో ఉన్న సిగరెట్ పాకెట్లోకి తోసేసి, సీఐ వద్దకు వచ్చాడు.

'మీరు లాయరా? దేనికోసం చెక్ చేశారు..?' అనడిగాడు సీఐ అతన్ని. తన రిఫరెన్స్‌తో ఒక వ్యక్తి వస్తాడు, తనుకు కోఆపరేట్ చేయమని చెప్పిందే తప్ప వసుధ తనేమిటో చెప్పలేదు.

'కాదు, అతని కొలీగ్‌ను...' అని మాత్రం చెప్పి, ఇతరత్రా ప్రశ్నలు వేసే అవకాశం ఇవ్వకుండా... 'థ్యాంక్సండీ...' అని అక్కడి నుంచి బయటికి వచ్చేసి, ఓ ట్యాక్సీని పిలిచి హోటల్ పేరు చెప్పి కూర్చున్నాడు.

❄ ❄ ❄

అప్పటికే హోటల్ రూంకు వెళ్లిన ఆమె కాస్త మొహం కడుక్కుని ఫ్రెషప్ అయిపోయి, కాఫీకి ఆర్డర్ ఇచ్చింది. చెక్ ఇన్ టైంలోనే రిసెప్షన్ స్టాఫ్‌కు చెప్పింది. చిన్న పార్టీ కోసం వచ్చామనీ, ఏ తెల్లవారుజామునో వెళ్లిపోతామని చెప్పింది. అవి కామనే అక్కడ. కాన్ఫిడెన్షియల్‌గా మంతనాలు జరుపుకోవటానికి, పార్టీలు చేసుకోవటానికి హోటల్ రూమ్స్ బుక్ చేసుకోవడం సహజమే. ప్రైవసీ ఉంటుంది. డిస్ట్రబెన్స్ ఉండదు. ఎవరెవరు కలిశారో బయటి వారెవరికీ తెలియదు. ఆ హోటల్‌లో బషీర్ దిగిన రూం తాలూకు మాస్టర్ కీ హోటల్ వద్ద ఉంటే... మరో కీ పోలీసుల స్వాధీనంలో ఉంది. ఆ కీ తెచ్చుకుంది ఆమె. టీవీ చూస్తూ ద్వివేదీ కోసం వెయిట్ చేయసాగింది...

కాలింగ్ బజర్ మోగింది. వ్యూ గ్లాస్ నుంచి చూస్తే ద్వివేదీ కాదు, మరి ఎవరు వచ్చింది?

తలుపు ఓరగా తీసి... 'ఎస్...' అంది ఏమిటన్నట్టుగా... ఎవరూ అన్నట్టుగా...

'మేమ్, హౌస్ కీపింగ్ చెక్ చేయటానికి వచ్చాను... '

'తర్వాత రా, ఇప్పుడు వద్దు...' అంటూ తలుపు మూసేసి నవ్వుకుంది. వచ్చింది యాదగిరి. కాస్త వేషం మార్చాడు. అంతే... కానీ తను గుర్తుపట్టగలదు. ఆ విషయము యాదగిరికీ తెలుసు.

తనిక్కడే ఉన్నట్టు చెప్పటానికి రూం వద్దకు వచ్చాడు.

❄ ❄ ❄

ద్వివేదీ వచ్చేసరికి టీవీ చూస్తూనే ఓ కునుకు తీసింది. తను వచ్చీ రావడంతోనే మరోసారి కాఫీకి ఆర్డర్ చేసింది.

'చక్రధర్ దాచుకున్న మెమొరీ కార్డు దొరికింది. దాన్ని ఆఫీసుకు పంపిస్తే గానీ అందులో ఏమున్నాయో తెలుసుకుని చెబుతారు మన ఐటీ ఎక్స్‌పర్ట్స్. లేదంటే మీ ఆఫీసులో ఓ కంప్యూటర్ ఇస్తే నేనే కుస్తీపడతాను. నేను దిగిన

హోటల్ రూంలో నా ల్యాపీ ఉంది గానీ, ఈ చిన్న కార్డు రీడ్ చేయటానికి తగిన రీడర్ లేదు...' అని డిటెయిల్స్ చెప్పాడు.

దాన్ని చేతిలోకి తీసుకుని చూసింది. నానో సిమ్ కార్డు సైజులో ఉందది. కానీ చాలా స్టోరేజీ కెపాసిటీ ఉంటుంది. 'ఎక్కడి నుంచి తెచ్చుకున్నాడో ఏమో గానీ మా డిపార్ట్‌మెంట్ వాడదు ఇలాంటివి...' అన్నాడు ద్వివేదీ.

దీని సంగతి తరువాత చూద్దాం. ఓసారి కారిడార్‌లోకి చూడు. ఎవరూ లేకపోతే ఆ రూంలోకి జొరబడదాం...

'ఇంకాసేపు ఉందాం. ఈలోపు భోజనాలు చేసేద్దాం. నాకూ ఆకలిగా ఉంది.'

'సరే...' అంటూ కాఫీ ఆర్డర్ కేన్సిల్ చేసి, రెండు సౌతిండియా తాలీ చెప్పింది...

యాదగిరి తన తిప్పలు తను చూసుకుంటాడు. భోజనాలు చేసి, ప్లేట్లన్నీ ఓ మూలన పెట్టేశారు.

బయటకు వెళ్లి చూశాడు. తమ హోటల్ రూం తాళం వేయలేదు. అలాగే వదిలేసి, బషీర్ రూం వైపు అడుగులేసి తాళం తీసి లోపలికి దూరారు. డోర్ తనంతట తాను మూసుకుపోయింది. పవర్‌ఫుల్ పెన్ టార్చీలతో రూం మొత్తం వెతకడం మొదలెట్టారు...

పలుసార్లు ఎవరో రూమంతా వెతికినట్లు కనిపిస్తూనే ఉంది. బషీర్ ఏదో ఆ రూంలో దాచి ఉంటాడని ఎనిమీలు భావిస్తున్నారు. అందుకే పట్టువదలకుండా వెతుకుతున్నారు. బషీర్ నోటితోనే బయటపెట్టించాలనుకున్నా అది సాధ్యం కానట్టుంది. ఎదురుతిరిగినట్టుంది. ఇక వీలుగాక ఖతం చేసినట్టు అనుకోవల్సిందే...

శిక్షణ పొందిన ఏజెంట్ ఎవరూ అంత తేలికగా బయటపడరు. పైగా డాక్యుమెంట్లు గానీ, మరే ఇతర ఫైల్స్ గానీ అంత తేలికగా దొరికేలా దాచిపెట్టరు. టార్చ్ అటూ ఇటూ తిప్పుతున్న ఆమె చేయి అకస్మాత్తుగా ఓచోట ఆగిపోయింది. బెడ్ పక్కన ఉన్న కుర్చీలో గన్ పట్టుకుని ఆమె వంకే చూస్తున్నాడు ఓ భారీకాయుడు. గుండె హఠాత్తుగా ఆగిపోయినట్టయింది ఆమెకు. గొంతులో నుంచి సన్నగా కేక. ఆశ్చర్యంతో అటువైపు టార్చ్ తిప్పి చూసిన ద్వివేదీ కూడా షాక్ తగిలినట్టు నిలబడిపోయాడు...

* * *

'నిన్ను ఈ కేసులో ఇన్‌వాల్వ్ కావొద్దని ఎంత హెచ్చరించినా విన్లేదు.. ఇక అనుభవించు...' అంటూ ట్రిగ్గర్ నొక్కబోయాడు ఆ అపరిచితుడు.

తొందరగానే షాక్ నుంచి తేరుకున్న దివిజ పక్కకు దూకింది. సైలెన్సర్ బిగించిన గన్ నుంచి వెలువడిన బుల్లెట్ పక్క నుంచి దూసుకుపోయింది. టార్చిలైట్ కిందపడిపోయింది. ద్వివేదీ టార్చి ఇంకోవైపు ఫోకస్ చేస్తోంది. చీకట్లో ఆమె ఎక్కడున్నదో తెలియక అతను ఈసారి గన్ ద్వివేదీ వైపు గురిపెట్టాడు.

తన చేతిలోని టార్చిలైట్‌ను ఆ అపరిచితుడి గన్ వైపు విసిరి వెంటనే సోఫా వెనక్కి దొర్లాడు ద్వివేదీ. గన్‌కు తగిలిన టార్చి కిందపడిందే తప్ప గన్ పట్టుకున్న చేయిని ఏమీ చేయలేకపోయింది.

కొద్దిసేపు రూంలో నిశ్శబ్దం ఆవరించింది. ఎటువైపు ఎయిమ్ చేయాలో అర్థం గాక సైలెంట్‌గా ఉన్న అపరిచితుడు ఆ ఇద్దరి కదలికల కోసం చూస్తున్నాడు. ఎటువైపు అలికిడి వినిపిస్తే అటు కాల్పులు జరపాలనేది ఆలోచన.

హత్య జరిగిన రూంనే అడ్డాగా చేసుకున్న వాళ్ల తెలివితేటలకు ఆశ్చర్య పోయింది దివిజ.

ఎవరెక్కడ ఉన్నారో ఎవరికీ తెలియదు. తను కూడా వెపన్ తీసి రెడీగా పట్టుకుంది. అరచేతిలో ఇమిడిపోయే వెపన్ అది. మరోవైపు ద్వివేదీ కూడా జేబులో నుంచి గన్ తీసి రెడీగా ఉన్నాడు. ఎక్కడ పొరపాటు జరిగినా ప్రాణాలు పోవడం ఖాయం. చీకటిలో పోరాటం.

చిన్న వెలుతురు చాలు, అక్కడ యుద్ధం మొదలవడానికి... దివిజ ఆలోచిస్తోంది. తను ఎక్కడ ఉంది. తను అన్నీ వెతుకుతున్నప్పుడు ఏయే ఫర్నీచర్, వస్తువులు ఎక్కడున్నాయో గుర్తుతెచ్చుకుంటోంది. క్షణాలు నిశ్శబ్దంగా కదులు తున్నాయి. ఆ అపరిచితుడెవరో పక్కా ప్రొఫెషనల్‌లా ఉన్నాడు. కామ్‌గా నిరీక్షిస్తున్నాడే తప్ప తొందర పడటం లేదు.

ఇంతలో ఆమె ఫోన్ మోగింది... డిస్‌ప్లే లైట్‌తోపాటు ఆమె ఎక్కడుందో ఆ రింగ్ టోన్ బయటపెట్టేసింది. ఉలిక్కిపడి మొబైల్ వదిలేసి మరోవైపు దూకింది వెంటనే... కానీ ఆ క్షణం చాలు, బెడ్ వెనక దాక్కున్న అపరిచితుడు ఆ మొబైల్ వైపు రెండు రౌండ్లు కాల్చాడు. బుల్లెట్లు వదులుతున్నప్పుడు గన్ బ్యారెల్ చివరలో రేగిన కాసింత నిప్పు, వెలుతురు చూసి అటు వైపు తనూ రెండు రౌండ్లు కాల్చింది దివిజ. ద్వివేదీ నుంచి కూడా మరో రెండు బుల్లెట్లు దూసుకొచ్చాయి. బోర్లాపడిన

అపరిచితుడు బుల్లెట్ల నుంచి కాపాడుకున్నాడు. కానీ అతనెక్కడున్నాడో తెలిసి పోయింది కాబట్టి ఆమె అమాంతంగా లేచి షాట్ చేస్తూ ఆ ఆకారంపై పడింది. సరిగ్గా వెళ్లి అతని నడుం మీద పడిందామె. మూలుగుతూ ఆమెను విదిలించుకుని లేచి మరోసారి గన్ గురిపెట్టబోయాడు. ఈలోపు ద్వివేదీ కూడా షాట్ చేస్తూ గుడ్డిగా ఓ సైడ్ కిక్ ఇచ్చాడు. అతని భుజాలపై దెబ్బ బలంగా తగిలి కెవ్వుమన్నాడు. ఓ మూలన ఏదో తగిలినట్టు సౌండ్ వచ్చింది. అతడి గన్ దేనికో పోయి తాకిందని అర్థమైంది ఆమెకు. సో, ప్రమాదం తగ్గిపోయింది. కానీ వాడెవడో తెలియాలంటే పట్టుకోవాలి... పారిపోకుండా చూడాలి.

తన మొబైల్ కాల్‌కు ఆన్సర్ రాకపోయేసరికి అనుమానమొచ్చి... అప్పటికే తను ప్లాన్ చేసుకున్నట్టే పక్క రూం బాల్కనీ నుంచి ఈ రూం బాల్కనీలోకి సైలెంట్‌గా చేరాడు యాదగిరి. నిజానికి ఏదైనా ప్రమాదం వస్తే పారిపోవటానికి వీలుగా ఆ బాల్కనీ తలుపు లాక్ చేయకుండా అలా వదిలిపెట్టాడు ఆ అపరిచితుడు.

ఇది తెలియని యాదగిరి ఓ ఇనుపచువ్వతో దాని లాక్ తీయటానికి ట్రై చేస్తుంటే తలుపే ఓరగా లోపలికి కదిలింది. బయట ఉన్న లైట్ల వెలుతురు గదిలోకి ప్రవేశించింది. తలుపు లాక్ లేకపోవడంతో ఆశ్చర్యపోతూ తనూ గన్ పట్టుకుని తలుపు మరికాస్త తెరిచాడు. ఆ వెలుతురులో లోపల ఉన్న ముగ్గురికీ ఎవరెవరు ఎక్కడెక్కడున్నారో తెలిసిపోయింది. అంతే... సరిగ్గా ఎయిమ్ చేసి ఆ అపరిచితుడి కాళ్లవైపు కాల్చింది. ప్రాణాలతో పట్టుకోవాలనేది ఆమె ఆలోచన. పరిస్థితి దిగజారిందని తెలిసిన అతను యాదగిరిని పక్కకు నెట్టేస్తూ వేగంగా బాల్కనీలోకి చేరుకుని, వెంటనే పక్కనే ఉన్న డ్రైనేజీ పైపు పట్టుకుని వేగంగా దిగిపోసాగాడు. రూంలో ఉన్న ముగ్గురూ తేరుకుని అక్కడికి వచ్చేసరికి సగం దూరం దిగిపోయాడు. యాదగిరి గన్ గురిపెట్టేలోపు కిందకు దూకి క్రోటన్ల మధ్యకు దూరిపోయాడు అపరిచితుడు. ఆ తరువాత వారికి అతను కనిపించలేదు...

కేవలం అదృష్టం బాగుండి ప్రాణాలతో బయటపడ్డారు. సైలెన్సర్లున్న గన్లు కావడం, ఆ రూం సౌండ్ ప్రూఫ్ కావడంతో లోపల ఏం జరిగిందో బయటికి తెలియలేదు. రూంలో కరెంటు లేదు. బాల్కనీలో నుంచి వస్తున్న కాస్త వెలుతురులోనే వెతికి తమ టార్చిలైట్లను తీసుకున్నారు.

పగటిపూటే వచ్చి వెతికితే సరిపోయేది కదా మేడమ్... రహస్యంగా ఎందుకు ఇలా రాత్రివేళ వెతుకుదామని చెప్పారు..? అనుమానంగా, అసహనంగా అడిగాడు ద్వివేదీ.

'ఎనిమీలు పగటిపూటైతే ఎక్కడో ఇక్కడే కాపేసుకుని ఉంటారనీ అనుకున్నాను. రూంలోకి వెళ్తే అటాక్ చేయటానికీ వెనుకాడరనీ అనుకున్నాను. పట్టువదలకుండా ఆ రూంలో ఏముందో వెతుకుతున్న వాళ్లు రాత్రి కూడా అందులో కాపేసుకుని కూర్చుంటారని అంచనా వేయలేకపోయాను...' వివరించింది దివిజ.

'మరేం చేద్దామిప్పుడు?' అడిగాడతను.

'మనం కూడా రూంలో వెతుకుతున్నామని శత్రువులకు తెలియకుండా రహస్యంగా పనిచేసుకుపోదామని అనుకున్నాను. కానీ ఇక తప్పేదేముంది? అంచనా తప్పిపోయింది. నాపై నిఘా కొనసాగుతోందనీ తెలిసింది. ఇక అఫీషియల్‌గా చేయాల్సినవే కొన్ని పనులు.. పదండిక రేపు పగలే వద్దాం...'

చేసేదేమీ లేక వెనక్కి తిరిగారు ముగ్గురూ... ఆమె ఇల్లు చేరేసరికి అర్ధరాత్రి దాటిపోయింది...

❄ ❄ ❄

ఉదయం తొమ్మిది గంటలకల్లా మళ్లీ పనిలో పడిపోయింది ఆమె.

'ఇంత నొటోరియస్‌గా కనిపిస్తున్నారు. ఏదో పెద్ద ముఠా ఉండే ఉంటుంది మేడమ్... ఇకపై మరింత జాగ్రత్తగా ఉండాలి మనం...'

'నిజానికి పాకిస్థాన్ డేంజరా? చైనా డేంజరా? మనకు ఏది ఎక్కువ ప్రమాదకరం మేడమ్...'

'ఎక్కువ, తక్కువ డేంజర్లంటూ ఉండవు యాదీ... కాస్త వివరంగా చెబుతా విను... నాకు తెలియని కోణాలూ బోలెడు ఉండొచ్చు... అవి రెండు మన పొరుగు దేశాలే. రెండింటితోనూ మనకు వైరముంది. గతంలో యుద్ధాలున్నాయి. ఇండియాను అస్థిరం చేసేందుకు రెండూ ప్రయత్నిస్తాయి... దేని స్టైల్ దానిది. పాకిస్థాన్‌తో వైరం వెనుక విభజన విషాదాలున్నాయి. కాశ్మీర్ ఉంది. మతముంది. గతంలో దెబ్బతిన్న కసి ఉంది. ఇస్లామిక్ తీవ్రవాదుల భావజాలమూ ఉంది. అందుకే అది చైనాతో పోలిస్తే కొంత రూడ్‌గా బిహేవ్ చేస్తుంటుంది. కానీ చైనాయే సైలెంట్ కిల్లర్. అది మనదేశం కోణంలో గాకుండా ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలనే కోణంలో ప్రణాళికలు వేస్తుంది. కానీ పాకిస్థాన్ స్టైల్ వేరు... తీవ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, శిక్షణ ఇవ్వడం, నేరుగా కసబ్ వంటి టెర్రరిస్టులను ట్రెయిన్ చేసి దాడికి పురికొల్పడం, ఇండియాలో స్లీపర్ సెల్స్‌ను

పోషిస్తూ అప్పుడప్పుడూ మతం పేరిట లోబరుచుకుని పేలుళ్లతో అల్లకల్లోలం సృష్టించడం ఇలాంటివి... ఇదంతా వాళ్ల సీక్రెట్ ఆపరేషన్స్ సెల్ ఐఎస్ఐ చూస్తుంటుంది... ఈమధ్య దేశాన్ని ఆర్థికంగానూ దెబ్బతీయడం కోసం భారీ ఎత్తున నకిలీ కరెన్సీని దేశంలోకి ప్రవేశపెట్టడం అందులో ఒకటి. దీన్ని యుద్ధప్రాతిపదిక, యుద్ధం రీతిలోనే ఆపరేట్ చేస్తోంది. ఈ మధ్యకాలంలోనే బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని ఒకే పాయింట్ నుంచి దాదాపు 4000 కోట్ల కరెన్సీ దాకా ప్రవేశించిందని ఆర్మీయే చెబుతోంది. ఇంకా అంచనా వేయలేని సొమ్ము నేపాల్ నుంచి కూడా భారీగా వస్తోందనేదీ సందేహం... కానీ పెద్దగా ఆర్థికంగా బలంగా ఉన్న దేశం కాదు కాబట్టి దానికి సాయం చేసే ఏ అమెరికా వాడో గట్టిగా బెదిరిస్తే కిమ్మనకుండా ఉండిపోతుంది. అందుకే తాను పెంచి పోషించిన తాలిబన్లపై కూడా తనే డ్రోన్లతో దాడులు చేస్తూ హతమారుస్తోంది. తీవ్రవాదంపై పోరాటానికి సపోర్ట్ చేస్తామని చెబుతూనే, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో భారీగా తీవ్రవాద శిక్షణ శిబిరాలు నడిపిస్తుంటుంది. అఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని తీవ్రవాద గిరిజన తండాలపై వైమానిక దాడులు చేస్తుంది. మరోవైపు దావూద్ ఇబ్రహీంను కళ్లల్లో పెట్టి కాపాడుకుంటుంది. ముంబై దాడుల సూత్రధారి లఖ్వీని అందరూ వద్దూ వద్దంటున్నా విడుదల చేస్తుంది. ఆ దేశంలో ప్రజాస్వామ్యం ఉత్త డొల్ల. అంతా సైన్యం పెత్తనమెక్కువ. రాజకీయాల్లోనూ మతం, భారత వ్యతిరేకత బాగా పనిచేస్తుంటాయి. పెద్ద నాయకులంతా కాశ్మీర్‌ను విముక్తం చేస్తామంటూ మాట్లాడతారే తప్ప పాకిస్థాన్ సమగ్ర అభివృద్ధికి ఏం చేస్తారో ఎవరూ చెప్పరు. ఎమోషన్స్ బేస్డ్ పాలిటిక్స్... తన రేంజికి మించి భారీగా యుద్ధపరికరాలు కొంటుంది. అణ్వస్త్రాలు, ఖండాంతర క్షిపణులు తయారు చేస్తుంది. ఇండియా అంటే దానికి ఉలికిపాటు... కలవరం... అభద్రత... అందులో నుంచి పుట్టిన కసితోనే మనపై రకరకాల పద్ధతుల్లో యుద్ధం చేస్తుంటుంది అది... కానీ చైనా పద్ధతి అలా కాదు...'

శ్రద్ధగా వింటున్నాడు యాదగిరి. చాలా విషయాలు తనకూ తెలుసు. కానీ దివిజ ఫ్లోకు అడ్డుపడకుండా వింటున్నాడు.

'మనమూ చేస్తున్నది అదే కదా మేడమ్... మొత్తం 25 ఆఫ్రికా దేశాల్లో ఉన్న పేదలకంటే మన దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఉన్న పేదల సంఖ్య ఎక్కువ. ప్రపంచం మొత్తమ్మీద ఉన్న అన్నార్తుల్లో ఎక్కువ మంది మనదేశంలోనే ఉన్నారు. 57 శాతం మంది పిల్లలకు, మహిళలకు పౌష్టికాహారలోపం. ఆడపిల్లల పేరుతో

అబార్షన్లు చేయించుకుంటున్నవారి సంఖ్య ప్రపంచంలోనే ఎక్కువ ఇక్కడ... ఐనా మనమూ చేస్తున్నాం కదా మేడమ్.., అణ్వస్త్రాలు, అంతరిక్ష ప్రయోగాలు, అంగారక యాత్రలు, చంద్రయాన్‌లూ...'

యాదగిరి వైపు ఆశ్చర్యంగా చూసింది దివిజ.

'నీకు దేశంపట్ల కన్‌సర్న్ ఉంది కాబట్టే అలా మాట్లాడావు. గుడ్. కానీ అది నెగిటివ్ ధోరణితో ఉండొద్దు. పదేళ్లకూ ఇప్పటికీ దేశంలో సామాజికంగా చాలా మార్పు కనిపిస్తోంది కదా... నాగరిక సమాజం వైపు మెల్లిగా ట్రాన్స్‌ఫామ్ అవుతోంది... మనదేశానికి ఒకటే లోపం. వ్యక్తిత్వ నిర్మాణం జరగడం లేదు ఇక్కడ. వ్యక్తిగత శీలం అధికంగా ఉండే సమాజం అవసరం. ప్రత్యేకించి రాజకీయాల్లో వ్యక్తిగత స్వార్థం లేకుండా పనిచేయగల టవరింగ్ పర్సనాలిటీలు లేకుండా పోవడం... అన్నీ కుంభకోణాలు, విపరీత ఆర్జన, విలాసాలు... యథారాజా తథాప్రజా అన్నట్టు కింది దాకా అదే ధోరణి పెరిగిపోతోంది. విలువలు లోపించి నప్పుడు చోటుచేసుకునే విపరిణామాలే దేశంలోనూ కనిపిస్తున్నాయి ఇప్పుడు... ఐతే ఎప్పుడూ ఇదే స్థితిలో ఉంటామని అనుకోవడం ఎందుకు? ఐనా నువ్వు అడిగావు చూడు. ఎందుకీ అణ్వస్త్రాలు, అంతరిక్ష ప్రయోగాలూ అని... మన బడ్జెట్ భరించే స్థాయిలోనే వాటిపై ఖర్చు చేస్తున్నాం. ప్రపంచంతో అన్నిరకాలుగా పోటీపడాలంటే మనమూ అన్ని విషయాల్లో ముందుండాలి. ఎవరిపైనా ఆధారపడకుండా ఉండాలి. ఇంట్లో అన్నీ ఉన్నాయి. కానీ ఇంటికి తలుపులు, తాళాలు, ప్రహరీ అవసరం లేదనుకుంటే ఎట్లా... తిండీతిప్పలు, చదువులు, వైద్యం ఎంత అవసరమో... రక్షణ కూడా అంతే అవసరం కదా... లేకపోతే చిల్లర దొంగలు కూడా దోచుకుపోతారు... దేశానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది...'

యాదగిరి మాట్లాడలేదు. అతని గతమంతా చాలా నీచమైన, దుర్భరమైన స్థితిగతుల నడుమ సాగింది. తను చూసిన జీవితం వేరు, తనకున్న చేదు అనుభవాలు వేరు... ఆమె అభిప్రాయాలతో చాలాసార్లు విభేదిస్తాడు కానీ వాదించడు. ఆమె అంటే ప్రాణం తనకు... అందుకే మౌనంగా ఉండిపోయాడు...

'పద పద, ఈరోజు ఉపన్యాసాలు ఎక్కువైపోయాయి నాకు... నీకు చైనా స్టైల్ ఆఫ్ ఆపరేషన్స్ కూడా చెప్పాలి తరువాత... ఇప్పుడైతే ఛలో హోటల్ మేరియట్' అంటూ లేచిందామె...

❄ ❄ ❄

వసుధ సాయం తీసుకుని మేరియట్ హోటల్ రూం చేరుకున్నారు ద్వివేదీ, దివిజ, యాదగిరి.

లోకల్ ఇన్‌స్పెక్టర్, మరికొందరు పోలీసులు వచ్చారు.

జల్లెడ పడుతున్నారు. అణువణువూ గాలిస్తున్నారు. ఏదైనా అనుమానించ దగిన వస్తువు కోసం...

'ఆల్ రెడీ శత్రువులు జల్లెడ పట్టినట్టే ఉంది. మనకేం దొరుకుతుంది? పైగా వాళ్ల ఏజెంట్లు రహస్య పత్రాల్ని, డేటాను ఎక్కడెక్కడ దాస్తారో మనకన్నా వాళ్లకే ఎక్కువ తెలుసు...' అంటూ విసుక్కుంటూనే వెతుకుతున్నాడు ద్వివేదీ.

'ఇంటికి వెళ్లి చాలా రోజులైందా ద్వివేదీ... బాగా చిరాకుగా ఉంటున్నావు ఈమధ్య...' అంటూ జోకేసి తనూ వెతుకుతోంది దివిజ.

హత్యకు గురైన సమయంలో బషీర్ లాల్చీ, పైజామాతో ఉన్నాడు. అతని డ్రెస్ అక్కడే పడి ఉంది. బూట్లు, బెల్టు, డ్రెస్సులు థరోగా చెక్ చేసినట్టు తెలుస్తూనే ఉంది. నో, నో యూజ్... అనుకుంటూనే యాష్ ట్రే సహా అన్నీ వెతుకుతోంది. బాత్ రూంలో వినియోగానికి హోటల్ ఇచ్చిన టూత్ బ్రష్, పేస్ట్, షాంపూ, సోప్, కండిషనర్ ఖాళీ కవర్లను కూడా వదిలిపెట్టడం లేదు... స్టార్ హోటళ్లలో అవన్నీ కాంప్లిమెంటరీగా ఇస్తారు. చాలామంది వాటిని వాడకపోయినా హోటల్ ఖాళీ చేస్తున్నప్పుడు తమతోపాటే తెచ్చేసుకుంటారు... పెద్ద ఖరీదేమీ కాదు గానీ అదో సరదా ... టీ బ్యాగులు, షుగర్ మినీ ప్యాకెట్లు, కెటిల్, గ్లాసులు ఓ పక్కన ఉన్నాయి. కెటిల్ కిందా మీదా తిరగేసి చూశారు.

మినీ ఫ్రిజ్‌లో పెట్టి ఉండే బిస్కట్లు, మినీ బీర్లు, సోడా, మినరల్ వాటర్, చిప్స్, సాఫ్ట్ డ్రింక్స్ అలాగే ఉన్నాయి. చెకవుట్ అప్పుడు అందులో ఎన్ని ఖాళీ అవుతే వాటికి బిల్ వేస్తుంటారు హోటల్ సిబ్బంది.

బషీర్ తన దగ్గరున్న సమాచారాన్ని తనకు మాత్రమే తెలిసిన చోట పెట్టే ఉంటాడు. దానికోసమే చైనీస్ ఏజెంట్ల ముఠా విపరీతంగా ప్రయత్నిస్తోంది అనేది ఆమె అంచనా. షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్, స్మాల్ సీజర్స్ ఉన్నచోట ఓ కీ చెయిన్ కనిపించిందామెకు... అక్కడున్న షేవింగ్ కిట్‌లోనే కలిసి పోయిందది. దాన్ని పరిశీలనగా చూస్తే తేడా తెలియడం లేదు గానీ, షేవింగ్ కిట్‌లో కీ చెయిన్ ఏమిటనేది ఆమె డౌట్. చూడ్డానికి చిన్నగా ముద్దుగా ఉంది గానీ

మామూలు కీ చెయిన్లతో పోలిస్తే వెరయిటీగా ఉంది. దాన్ని జీన్స్ బ్యాక్ ప్యాకెట్‌లోకి వేసేసుకుంది దివిజ.

ఈలోపు హోటల్ సిబ్బంది వచ్చి మినీ ఐరన్ సేఫ్ కోడ్ నంబర్లు కొట్టి ఓపెన్ చేశారు. స్టార్ హోటళ్లలో ఉన్నప్పుడు విలువైన వస్తువులు దాచుకోవటానికి అది ప్రొవైడ్ చేస్తుంటారు. అందులో ఓ పర్స్ బయటపడింది. కానీ అది ఖాళీ పర్స్. చిల్లిగవ్వ గానీ, కార్డులు గానీ ఏమీలేవు. అప్పటికే ఆగంతకులు దాన్ని ఓపెన్ చేసి, అవన్నీ స్వాధీనం చేసుకుని ఖాళీ పర్స్ అక్కడే ఉంచి, మళ్లీ సేఫ్‌ను సేఫ్‌గా లాక్ చేసి ఉంటారని అర్థం చేసుకుంది వసుధ. అందులో ఏమీ దొరికి ఉండవు కాబట్టే ఇంకా సెర్చింగ్ కొనసాగిస్తున్నారని అనుకుంది.

రెండు గంటల సెర్చింగ్ తరువాత ఇక ఏమీ దొరకవని నిర్ణయించుకుని, ఇక ఆ రూంను హోటల్‌కు స్వాధీనం చేసేసింది వసుధ. అంటే... క్లీన్ చేసి, రెగ్యులర్‌గా దాన్ని కూడా కస్టమర్లకు ఇచ్చేయవచ్చన్నమాట.

దివిజ వైపు ఏమంటావు అన్నట్టు చూసింది వసుధ.

'కాస్త కాఫీ తాగించు మేడమ్... ఇక ఎవరి బాటన వాళ్లం వెళ్లిపోదాం' అనడంతో అక్కడి నుంచి అందరూ కిందకు దిగారు.

తనపై మళ్లీ అటాక్ జరగవచ్చునని అనుమానిస్తున్న దివిజ, ఇక రహస్య పరిశోధన అవసరం లేదని నిర్ణయించుకుంది. సాయంత్రం ఓసారి తన ఆఫీసులోనే కలుద్దామని ద్వివేదీకి చెప్పి ఇంటికి బయల్దేరారు దివిజ, యాదగిరి...

❄ ❄ ❄

లంచ్ తరువాత తాపీగా కూర్చుని మథనం మొదలెట్టారు దివిజ, యాదగిరి...

'సో, మన దగ్గర ఇప్పుడున్నది ఒక మెమొరీ కార్డు... ఆ ఎండీ ఫోన్ ద్వారా ఏమైనా వివరాలు తెలుస్తాయేమో చూడాలి... అంతకుమించి మన కేసులో ఏమీ ప్రోగ్రెస్ లేదు... అంతేకదా యాదీ' అంది దివిజ.

ఏదో మరిచిపోయినట్టు చకచకా ఇంట్లోకి వెళ్లి, పొద్దున హోటల్‌లో దొరికిన కీచెయిన్‌ను తీసుకొచ్చింది.

పరిశీలనగా చూస్తూ సన్నగా ఈల వేసింది ఆమె... యాదగిరి ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు

టేబుల్ డ్రాయర్‌లో ఉన్న మల్టిపుల్ యూసేజీ కిట్ ఓపెన్ చేసి, సన్నని

స్క్రూ డ్రైవర్‌తో ఆ కీ చెయిన్‌కు ఓ వైపు ఉన్న స్క్రూ విడదీసింది. వర్టికల్‌గా రెండుగా విడిపోయింది అది. లోపల ఉన్నవి చూపించింది యాదగిరికి...

సూక్ష్మమైన కెమెరా, మైక్రోఫోన్, చిన్న చిప్, దానికి అటాచ్డ్‌గా ఓ మెమొరీ కార్డు ఉన్నాయందులో...

'నా అనుమానం నిజమైతే ఇందులో బషీర్ ఏదో రికార్డు చేసి ఉండాలి. దానికోసమే చైనీస్ ముఠా వెతుకులాట అయి ఉంటుంది...'

'వాళ్ల ఏజెంటే కదా మేడమ్ అతను... వాళ్లెందుకు మర్డర్ చేసి ఉంటారు?'

'చాలా సింపుల్... అంతర్జాతీయ గూఢచర్యంలో డబుల్ క్రాస్ కూడా సహజంగా జరుగుతూ ఉంటుంది. తమకు దొరికిన విలువైన సమాచారాన్ని తమ ఏజెన్సీలకు గాకుండా ఇంకే దేశానికో అమ్మేసుకుని, ఆ వచ్చిన డబ్బుతో ఇక జీవితాంతం ఏ సింగపూర్‌లోనో, మలేషియాలోనో సెటిలై పోవడం అన్నమాట...'

'అంత ఈజీయా...? వాళ్లు వదిలిపెట్టరు కదా మరి...?'

'ఇదీ సింపులే యాదీ... నీ రహస్యాలు నాకు తెలిస్తేనే నాకు డేంజర్. నిన్ను వదిలిపెట్టొద్దు. కానీ నువ్వేదో సమాచారాన్ని తెచ్చుకుని నన్ను మోసం చేసి, వేరేవాళ్లకు ఇచ్చేశావనుకో... దాంతో నాకు రావల్సింది రాకుండా పోయిందే తప్ప, నాకు లిటరల్లీ నష్టం లేదన్నట్లే కదా... ఇక అన్నీ మానేసుకుని సన్యాసం స్వీకరించాక నిన్ను ఖతం చేసే శ్రమ, ప్రయాస నాకెందుకు?' వివరించింది దివిజ.

'స్పయింగ్ సమాచారం కూడా అంగట్లో సరుకేనా? కొనేవాడెవడుంటాడు మేడమ్... వాళ్లకేం ఫాయిదా?'

'అందరికీ అవసరమే... ఇండియా సమాచారం ఒక్క చైనాకే కాదు, పాకిస్థాన్‌కూ అవసరమే. ప్రపంచ పోలీస్‌గా వ్యవహరించే అమెరికాకూ అవసరమే. అలాగే అన్ని దేశాలకూ కామన్ శత్రువులుంటారు. ఒకరు సేకరించిన విలువైన సమాచారాన్ని వేరే దేశం కొనుగోలు చేస్తుంది. ఈ స్పయింగ్ పేరిట అన్ని దేశాలూ కలిసి కొన్ని బిలియన్ల మేరకు ఏటా ఖర్చు చేస్తుంటాయి. ఏజెంట్ల కొనుగోళ్లు, సమాచారం కొనుగోళ్ల బడ్జెట్ కూడా అందులో ఒకటి...'

నాకో చిన్న డౌట్ మేడం... ఒకవేళ చైనా ఏజెంట్ ఇండియాకు సంబంధించిన విలువైన సమాచారం ఏదైనా సేకరించి ఉంటాడంటారా? మీరు

చెబుతున్నదాన్ని బట్టి దాన్ని బషీర్ వేరే దేశానికి అమ్ముకోవటానికి ప్రయత్నించి ఉంటాడా? అదేనా మీ అంచనా?'

'అదే కావచ్చునిపిస్తోంది. ఇంకా నిర్ధారణకు రాలేం. బషీర్ బహుశా డబుల్ క్రాస్ చేయటానికి ప్రయత్నించి ఉంటాడు. దీన్ని పసిగట్టిన చైనీస్ ఏజెన్సీ దాన్ని చేజిక్కించుకోవటానికి ట్రై చేసి, అందులో ఫెయిలైనట్టుంది. బషీర్ రక్షణ కోసం ప్రయత్నించినప్పుడు అనుకోకుండా వాడి ఛాప్టర్ వాళ్లు క్లోజ్ చేసి ఉంటారు...'

'మరి దాన్ని కొనుగోలు చేయటానికి ప్రయత్నించేదెవరు? మీ లెక్క ప్రకారం పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ అయి ఉంటుంది... అంతేనా?'

'ఇప్పటికైతే అంతే అనుకోవాలి...'

'ఒకవేళ నాకు ఇండియా రక్షణ వ్యవహారాలకు సంబంధించిన మంచి సమాచారం తెలిసింది. కానీ కొనుగోలుదారు ఎవరో తెలిసేది ఎలా మేడం? నా దగ్గర సరుకున్నా కొనేవాడెవడో తెలియాలి. మీడియేటర్ కావాలి. దాని విలువ ఏందో చెప్పేవాడు కావాలి, డీల్ కుదిరితే డబ్బు చెల్లింపుతోపాటు మన రక్షణ కూడా చూసుకోవాలి... అంతా చేసి దాన్ని కొనుగోలు చేసేవాడు, తీరా మనం డేటా ఇచ్చేశాక, ఠప్ మని మనల్ని కాల్చేసి, తెలుగు సినిమా విలన్‌లాగా నవ్వేసి వెళ్లిపోతే ఎలా...?'

'ఇంటర్ నేషనల్ స్పయింగ్ లో అనుభవం వచ్చాక... ఈ వ్యవహారంలో బ్రోకర్లు ఎవరెవరు ఉంటారో, ఎవరెవరు ఎలా ఆర్గనైజ్ చేస్తారో తెలుస్తుంటాయి. ఎక్కువగా నేపాల్ వంటి న్యూట్రల్ దేశాల్లో వీళ్ల సంచారం ఉంటుంది. అక్కడ పెద్దగా పోలీస్ నిఘా వంటివి ఎక్కువగా ఉండవు. కొందరికి ఇదే దందా. డీల్స్ కుదర్చడమే పని. దొంగలకూ కొన్ని కట్టుబాట్లున్నట్టే ఈ వ్యాపారంలోనూ కొంత నిజాయితీ ఉంటుంది. ప్రాణాలకు తెగించి తెచ్చిన సమాచారానికి మంచి ధర ఇవ్వడమే గాకుండా, ఖతం చేయడం వంటి చర్యల జోలికి పోరు... కానీ అలాంటి ఏజెంట్లను ఇక నమ్మరు. ఎందుకంటే... డబుల్ క్రాసింగుకు అలవాటు పడినవాడి మాటలకు ఈ అంతర్జాతీయ స్పయింగ్ మార్కెట్‌లో క్రెడిబులిటీ ఉండదు. అందుకే ఇలాంటివాళ్లు మంచి రేటు, మంచి డీల్, మంచి మెటీరియల్ రాగానే రిటైరై పోతారు..'

'ఎలాగూ పాకిస్థాన్, చైనా మిత్రదేశాలే కదా మేడమ్... ఇద్దరూ ఉమ్మడిగా స్పై సమాచారం పంచుకోవచ్చుగా...' అమాయకంగానే అడిగాడు యాదగిరి. ఇవన్నీ తను కొత్తగా వింటున్నాడు...

'చూడు యాదీ... వాళ్లు మిత్రులే కావచ్చు. కానీ కొన్ని విషయాల వరకే... మళ్లీ ఒకరినొకరు నమ్మరు. మరీ ముఖ్యంగా పాకిస్థాన్ మరీ తింగరి కంట్రీ అని చైనాకు మనకన్నా ఎక్కువ తెలుసు. పైగా చైనా ఆపరేషన్లన్నీ తను సొంతంగానే చేపడుతుంది. ఎవడినీ నమ్మదు. ఎవడినీ అంత త్వరగా ఓన్ చేసుకోదు. తన అవసరాల మేరకు మాత్రమే పాకిస్థాన్‌ను చేరదీస్తుంది. పాకిస్థాన్‌కు కూడా అది తెలుసు. అదీ స్నేహాన్ని నటిస్తుంది. ఎందుకంటే, ఇండియా కోణంలో చైనా తనకు సహకరిస్తుందనేది దాని ఆశ. అందుకే ఎవరి ప్రయోజనాలు వారివి... ఇవి దేశదేశాల విదేశీవ్యవహారాల్లో, వేసే ఎత్తుగడల్లో, రచించే వ్యూహాల్లో చాలా కామన్... ' తాపీగా వివరించింది దివిజ.

'పరస్పర నమ్మకాలు లేని స్నేహం ఎన్నాళ్లు నిలబడుతుంది మేడం...?'

'అన్ని దేశాలూ అలాగే ఉంటాయని అనుకోవద్దు. ఉదాహరణకు రష్యా, అమెరికాల నడుమ ప్రచ్ఛన్న యుద్ధం నడిచినన్ని రోజుల్లో రష్యాకు మన అవసరం ఉందనీ, మన స్నేహం కావాల్సి వచ్చిందనీ అనుకుందాం. కానీ ప్రస్తుతం ఏకధ్రువ ప్రపంచంగా మారిపోతున్నా... రష్యా ఆర్థికంగా అంత బలోపేతంగా లేకపోయినా... మనం మారుతున్న కాలం, రాజకీయాల కారణంగా అమెరికా వైపు కన్నుగొడుతున్నా... రష్యాతో మన స్నేహం చెదరలేదు. ఇప్పటికీ అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇండియాకు బాసటగా నిలుస్తుంది రష్యా...'

'వ్యూహాత్మకంగా ఇండియా కీలకస్థానంలో ఉండటం వల్ల, ఎప్పటికైనా అంతర్జాతీయ వ్యవహారాల్లో మనతో స్నేహం అవసరమయ్యే ఇలా ఉంటుందేమో మేడమ్... ఏ దేశానికైనా తన ప్రయోజనాలే ముఖ్యం కదా...'

'కావచ్చు. కానీ మన విదేశీనిపుణులు చాలామంది అభిప్రాయమేమిటంటే... పరిమితులెన్ని ఉన్నా సరే, రష్యాను మనం విశ్వసనీయమైన స్నేహితుడిగా నమ్మవచ్చునని...'

'నాకెందుకో పాకిస్థాన్ కు చైనా చేసే సాయాన్ని బట్టి, వారిమధ్య అపనమ్మకాలు ఏమీ లేవనిపిస్తోంది మేడమ్...'

'కాదు, కాదు... నిన్నటి సమాచారమే చెబుతా విను. చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అంటే పీఎల్ఏకు చెందిన 5000 మంది మా స్వాధీనంలో ఉన్న కాశ్మీర్‌లోకి చొచ్చుకువచ్చారని పాకిస్థాన్ గగ్గోలు పెట్టింది...'

'అవునా... మరి చైనా ఏమంది?'

'మనం అనుకున్నట్టు, మనం మ్యాపుల్లో చూపుకుంటున్నట్టు కాశ్మీర్ లేదు యాదగిరీ... కొంత భాగం పాకిస్థాన్ ఆక్రమించుకోగా, దానికన్నా ఎక్కువ భాగం చైనా ఆక్రమించుకుని ఉంది. జమ్మును వదిలేస్తే మన ఆధీనంలో ఉన్న ప్రస్తుత కాశ్మీర్ పాత కాశ్మీర్‌లో సగమే... ఆ సగంలోనూ మనం పరాయివారిగానే కనిపిస్తుంటాం అక్కడి ప్రజలకు. అదీ ట్రాజెడీ... చైనా తను ఆక్రమించుకున్న స్థలాన్ని అట్లాగే ఉంచుకుంది గానీ పాకిస్థాన్‌లాగా ఇంకా కాశ్మీర్‌లో అల్లర్లను రెచ్చగొట్టడం, విముక్తి పోరాటాలంటూ ప్రోగ్రామ్స్ తీసుకోవడం వంటివేమీ చేయడం లేదు. ఎందుకంటే రాను రాను ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ఇస్లామిక్ టెర్రరిస్టుల గ్రూపులతో తనకూ కష్టమేననీ, మతం పేరిట కాశ్మీర్‌లో చిచ్చు పెరిగితే అది భవిష్యత్తులో తనకూ నష్టమేననీ, అలాంటి సమయాల్లో పాకిస్థాన్ నుంచి తనకు ఎలాంటి ఉపయోగం ఉండదు సరికదా నష్టం చేస్తుందని చైనా లోలోపల సందేహం...'

'మీరు చెబుతున్నది అంత విశ్వసనీయంగా ఏమీ లేదు మేడమ్... చైనాకు ఈ టెర్రరిస్టుల బెడద లేదు కదా...'

'లేదని ఎవరన్నారు. చైనాలో జింజియాంగ్ ప్రావిన్స్ ఓ పక్కన ఉంటుంది. దానిచుట్టూ ఉండే ప్రదేశాలు ఏమిటో తెలుసా...? పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, కజికిస్థాన్, రష్యా, మంగోలియా... అక్కడక్కడా ఇండియా సరిహద్దు కూడా... అందులో చాలా ప్రాంతాలపై ఆల్ ఖైదా వంటి గ్రూపుల ప్రభావం ఉంది. ప్రపంచాన్ని ప్రస్తుతం వణికిస్తున్న ఐఎస్ఐఎస్ ఉనికి కూడా తాజాగా అక్కడ కనిపించింది. గతంలోనూ కొన్ని గ్రూపుల ఉనికిని నిర్దాక్షిణ్యం అణిచివేసింది చైనా. కానీ ఆ వార్తలు బయటికిరావు. అసలు పాత రష్యా నుంచి పలు దేశాలు విడిపోయాయి కదా... అవన్నీ మతం ప్రభావమున్న ప్రాంతాలే... ఇప్పటికీ రష్యాకు పలుచోట్ల ఈ తిరుగుబాట్లు, కల్లోలాల బెడద ఉంది కూడా... మనం కాశ్మీర్‌లో ఫేస్ చేస్తున్నట్టుగా...'

'మీరేదో పక్కా బీజేపీ నాయకుడిలా ఉపన్యాసం ఇచ్చినట్టనిపిస్తోంది మేడమ్... వాస్తవానికి సమస్య అంత తీవ్రంగా ఉండదు లెండి...'

'హహహహ...' అని నవ్వేసిన దివిజ కీ చెయిన్‌లో దొరికిన కార్డు రీడ్ చేయడం ఎలా అని ఆలోచిస్తోంది. 'ముందుగా మనకు మంచి కాఫీ ఆర్డరివ్వు' అంటూ యాదగిరికి పురమాయించి... ఆ కార్డును పట్టుకుని అటూఇటూ తిప్పుతోంది. ఇండియన్ ఏజెంట్ చక్రధర్ వద్ద దొరికిన కార్డు కూడా దాదాపు

అదే సైజులో ఉంది. తన దగ్గర ఉన్న మల్టిపుల్ కార్డు రీడర్‌లో ఇంత చిన్న కార్డు పట్టే స్లాట్ లేనట్టుంది. ఏం చేద్దామబ్బా... అని ఆలోచిస్తుంటే ఓ ఐడియా తట్టిందామెకు...

❄ ❄ ❄

గతంలో సిమ్ కార్డులు ఒకే తరహాలో వచ్చేవి. తరువాత మైక్రో సిమ్ పేరిట కాస్త చిన్న సిమ్ కార్డులు వచ్చాయి. ప్రస్తుతం నానో సిమ్ కార్డుల తరం నడుస్తోంది. అవి ఇంకా చిన్నవి. ఏ మొబైల్‌కైనా ఉపయోగపడేలా సర్వీస్ ప్రొవైడర్లు ఇప్పుడు అనువైన రీతిలో కార్డులు ఇస్తున్నారు. జస్ట్, వేలితో గట్టిగా నొక్కితే చాలు కార్డు మైక్రో లేదా నానో సిమ్‌గా ఊడివస్తుంది. ఇప్పుడు దివిజ చేతిలో ఉన్నది నానో సిమ్ పరిమాణంలో ఉన్న మెమోరీ కార్డు. అంతకన్నా చిన్నవి కూడా వచ్చాయి కానీ బషీర్ వాడుతున్నది ఎక్కువ డేటా నిల్వ కెపాసిటీ ఉన్నది. నానో సిమ్ విడతీశాక ఖాళీగా ఉండే సిమ్ కార్డు మిగతా భాగాన్ని టేబుల్ నుంచి బయటికి తీసిందామె. అందులో ఈ మెమోరీ కార్డును బిగించింది. కొంచెం కష్టమైనా అటూఇటూ కదలకుండా ఫిటైంది. దాన్ని కార్డు రీడర్‌లో పెట్టి కంప్యూటర్ యూఎస్ బీలోకి ఇన్‌సర్ట్ చేసిందామె... కంప్యూటర్‌లో రీడవుతున్నది అది... వోకే అనుకుని, ముందు జాగ్రత్తగా అందులోని మొత్తం డేటాను కంప్యూటర్‌లోని వేరే డ్రైవ్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసింది. అది మరో రెండుచోట్ల సేవ్ చేసింది. ఆ డేటాలో ఏమున్నాయో తెలియదు, కోడ్ భాషలో ఉంటే డీకోడ్ చేసుకోవాలి...

చక్రధర్ దగ్గర దొరికిన కార్డుకూ ఇదే చిట్కా పాటించింది. ద్వివేదీ ఆ పనినీ తనకే వదిలిపెట్టేశాడు. వేరే ఫోల్డర్ క్రియేట్ చేసి అందులోని డేటాను కూడా ట్రాన్స్‌ఫర్ చేసింది. దాన్ని కూడా సేవ్ చేసింది. తన కంప్యూటర్ కూడా హ్యాకింగ్‌కు అతీతమేమీ కాదు కాబట్టి క్లౌడ్ స్టోరేజీలోనూ సేవ్ చేసింది. ఇంటర్ నెట్ సర్వీస్ ప్రొవైడర్లు ఇటీవల క్లౌడ్ స్టోరేజీ కూడా కొంత పరిమితి కెపాసిటీకి ఉచితంగా ఇస్తున్నారు. ఆమెకు స్వతహాగా ఎథికల్ హ్యాకింగ్ అంటే క్రేజు. ఎథికల్ హ్యాకింగ్ అంటే హ్యాకింగ్‌ను పాజిటివ్ అవసరాల కోసం వినియోగించడం! చాలా పెద్ద సబ్జెక్టు ఇది...

తరువాత తాపీగా ఆ కార్డుల్లో దొరికిన సమాచారాన్ని విశ్లేషించవచ్చునని అనుకుందామె.

తన మొబైల్‌లో ఆల్ రెడీ హ్యాక్ చేసి ఉన్న ఆ టీవీఎండీ నంబర్

వ్యవహారమేందో చూద్దామని, ఆ బగ్‌ని యాక్టివేట్ చేసింది. కాల్ డేటాలో ఏవేవో నంబర్లున్నాయి. అవి ఎవరివో తనకు తెలియదు. అందులో అనుమానించతగిన నంబర్లు ఏమిటో అస్సలు తెలియదు. మెస్సేజీల్లోనూ ఎక్కువగా రిపోర్టర్లకు, సెంట్రల్ డెస్కుకు పంపించిన అసైన్‌మెంట్లు ఎట్సెట్రాలే ఎక్కువగా ఉన్నాయి. కింద నుంచి పైకి ఎస్ఎంఎస్‌లు చెక్ చేయసాగింది. ఓ మెసేజ్ ఆమెను ఆకర్షించింది. ఈసీఐఎల్‌లోని ఫలానా పార్కులో తప్పకుండా ఈరోజు కలుద్దామనీ, నేరుగా అక్కడికే రమ్మనీ, ఆపరేషన్ ఇన్ ట్రబుల్ అనీ ఉందా మెసేజీ... సెండర్ దగ్గర లీ అని కంటాక్ట్ చూపిస్తోంది. ఎవడీ లీ...? నగరం శివారులో ఉండే ఈసీఐల్ పార్కు అది. తనకు తెలిసిందే. పెద్దగా జనసంచారం ఉండదు. పాడుపడ్డట్టు ఉంటుంది. పెద్దగా పెరిగిన చెట్లతో అడవిలా ఉంటుంది అది... లీ అంటే ఎవడైనా చైనీస్ ఏజెంటా? ఆపరేషన్ అంటే ఏమిటి? ఒకవేళ చైనీస్ వాళ్లతో ఈ ఎండీ భేటీ కావాలనుకున్నా, ఈ కాలంలో మెసేజీల ద్వారా ఎవరూ సమాచారం ఇచ్చుకోరు... ఇచ్చుకున్నా కోడ్ భాషలో ఉంటుంది. మరేమిటీ లోగుట్టు... అక్కడికే వెళ్లి తెలుసుకోవాలి. ఎక్కడో ఓచోట డొంక కదలాల్సిందే అనుకుంది. మొబైల్ లోనే టైం చూసింది. ఇంకో అరగంట ఉంది. మరింతగా ఆలోచనల్లో పడకుండా వెంటనే బయల్దేరింది. యాదగిరి ఆఫీసులో లేడు. ఓ మెసేజీ రాసి తమకు తెలిసిన ప్లేస్‌లో పెట్టింది. తను రాగానే ఎలాగూ చూస్తాడు. ద్వివేదీకి మెసేజ్ పెట్టింది. ఫలానా టైమ్‌కు, ఫలానా చోటికి రమ్మని...

❄ ❄ ❄

పార్కింగులో ఓ మూలన ఎండీ కారు కనిపిస్తూనే ఉంది. అంత బహిరంగంగా తన కారునే తీసుకొస్తాడు. తెలియకుండా వేరే కారులోనో, టాక్సీలోనో వస్తాడు. సో, సమ్‌థింగ్ రాంగ్ హియర్... ఐనా సరే, వెళ్లాలి... పార్కుకు కాస్త దూరంగా చిన్న వెల్డింగ్ షాపుంది. అక్కడ బైక్ పెట్టి, కాస్త చూస్తుండమని చెప్పి నడుస్తూ పార్కు వద్దకు వెళ్లిందామె. గేటు దగ్గరకు చేరేసరికి ద్వివేదీ వచ్చి చేరాడు... ఇద్దరూ కలిసి లోనికి వెళ్లారు. అక్కడక్కడ ప్రేమ జంటల ఉనికి తప్ప పెద్దగా జనం లేరు. ప్రేమజంటలు ఈలోకంలోనే లేరు... ఇంకొంచెం లోనికి వెళ్లారు... తన మనస్సు ఏదో కీడు శంకిస్తోంది.

మాట్లాడకుండా మౌనంగా పార్కు లోలోపలికి నడుస్తున్నారు. దూరంగా పాడుబడిన క్యాంటీన్ ఉందక్కడ. అదెలాగూ నడవడం లేదు. మెల్లిగా దాని

వెనుకవైపు చేరుకున్నారు. లోన ఏముందో చూడటానికి దాని వెనకవైపు తలుపును మెల్లిగా తోసింది. కిటికీలు, తలుపులూ మూసి ఉన్నందున కాస్త చీకటిగానే ఉందక్కడ. మరికొంత తోసి లోనికి అడుగుపెట్టింది. వెనుకే ద్వివేదీ... మరికొంత లోనికి వెళ్లగానే తలుపులు మూసుకున్నట్టు సౌండ్ వచ్చింది. వెంటనే ఛివాలున వెనక్కి తిరిగి చూసింది. ఈలోపు లైట్లు వెలిగాయి. దివిజ, ద్వివేదీ చుట్టూ అయిదుగురు బలశాలులు రౌండప్ చేశారు. ఇద్దరి వద్ద వెపన్లు ఈ ఇద్దరి వైపు కోరగా చూస్తున్నాయి. చాలా క్లోజ్ రేంజ్‌లో దొరికిపోయారు. తమ దగ్గర కూడా వెపన్లున్నా వాటిని బయటికి తీసేంతలోపు రెండు రౌండ్లు కొట్టగలడు ఎనిమీ. ఆ దెబ్బకు ఇక ఖతం...

తను ఏదో ప్రమాదాన్ని ఊహిస్తున్నదే కానీ, మరీ అంత స్ట్రెయిట్‌గా ఎదుట నిలుస్తుందని అనుకోలేదు. ఆమె మానసికంగా సిద్ధపడుతూనే వచ్చింది. ముఖాముఖీ ఫైటింగ్ కూడా తప్పదనీ అనుమానిస్తోంది. కాబట్టి బెంబేలు పడలేదు. కాకపోతే ఏదో చేసి ప్రాణాలు దక్కించుకోవడమే ఇప్పుడు శరణ్యం.. పైగా ఇద్దరి చేతుల్లో వెపన్లున్నాయి.వాళ్లను ఉత్త చేతులతోనే ఎదుర్కోవాలంటే కష్టమే.పైగా చైనీస్ ఏజెంట్లు కరాటే, జుడోలలో బాగా శిక్షణ పొందినవారే... క్షణం ఆలస్యమైతే చాలు, తూటాలు కూడా రివ్వున గుండెల్లోకి దూసుకుపోతాయి...

ఇక తను మార్షల్ ఆర్ట్స్‌లోనే విశిష్ట యుద్ధకళ టైక్వాండోను ఆశ్రయించడమే కరెక్టనుకుంది. ఇప్పుడు అన్నింటికన్నా వేగం, సరైన అంచనా, టైమింగ్, బలమైన పంచ్, ఎవరు నిల్చున్న పొజిషన్‌ను బట్టి ఎవరిని ఏ కిక్‌తో ఎదుర్కోవాలో నిర్ణయించుకోవడం ముఖ్యం. ఏమాత్రం తేడా వచ్చినా ఆమెను చెండాడేస్తారు. వెపన్స్ కూడా అవసరం లేదు. అదృష్టం అద్భుతంగా సహకరిస్తే తప్ప ఆమె బయటపడదు... ఈలోపు బయట ఏదో ఓ శబ్దం. కొమ్మ విరిగిపడినట్టు... ఒక్క క్షణం ఆగంతకుల దృష్టి చెదిరింది. అంతే... ఎనిమీలు ఎవరెవరు ఏ పొజిషన్‌లో ఉన్నారో ఓసారి వేగంగా చూసుకుంది.

ద్వివేదీకి వెనక్కి జరగాల్సిందిగా కళ్లతోనే సైగ చేసిన ఆమె అకస్మాత్తుగా కిందకు వంగింది. ఎదుటోడి కాళ్లు మొక్కడానికి వంగినట్లు అనిపిస్తుంది. కానీ ప్రత్యర్థి నడుం భాగంలో ఒక 'లో కిక్' డెలివరీ చేసింది. ఆ దెబ్బకు అతని చేతిలోని గన్ కిందిపడిపోయి, రెండు చేతులతోనూ పొత్తికడుపును పట్టుకుని బాధగా కిందకు ఒరిగిపోయాడు...

వెంటనే లేచి నిల్చున్న ఆమె కాస్త వెనక్కి అడుగేసి, కొంచెం శరీరాన్ని

తిప్పుతూనే, వేగంగా కాలితో వెనక ఉన్న మరో ఎనిమీపైకి 'బ్యాక్ స్పిన్ కిక్' ఇచ్చింది. అది నేరుగా వెళ్లి వాడి దవడను కనెక్టయింది. దవడ విరిగిపోయినంత బాధతో గొల్లుమన్నాడు వాడు. తను వెపన్ కూడా ఎక్కడో పడిపోయినట్లుంది...

ఈలోపు ఆ పక్కనే నిల్చున్నవాడు కాస్త తేరుకుని ఆమె వైపు పంచ్ విసిరాడు. దాన్ని కనీసం క్రాస్ కూడా చేయాల్సిన అవసరం లేకుండా ఓ 'సైడ్ కిక్' డెలివరీ చేసింది. కేక బయటికి కూడా రాకుండానే వెనక్కి పడ్డాడు...

అదే ఊపుతో తన ముందువైపు నిల్చున్న వాడిపైకి 'ఫ్రంట్ కిక్' డెలివరీ చేసింది. వాడి చేతిలో వెపన్ కూడా లేదు. నిజానికి ఆమె పోరాటం తీరుతో వాడు ఒకింత దిగ్భ్రమలో ఉన్నాడు. తను తేరుకుని పొజిషన్ తీసుకునేలోపు ఆమె విసిరిన ఫ్రంట్ కిక్ వాడిని దెబ్బతీసింది...

మరొకడు కొంచెం దూరంగా నిల్చున్నాడు. చేతిలో వెపన్ లేదు. అప్పటికే పొజిషన్ తీసుకుని 'ఫ్లయింగ్ కిక్' షాట్ చేస్తూ గాలిలోకి లేస్తున్నాడు. నిర్దాక్షిణ్యంగా ఆమె కొంచెం ఎక్కువ ఎత్తుతో అదే ఫ్లయింగ్ కిక్ డెలివరీ ఇచ్చింది. రెండూ దాదాపు ఒకేతరం షాట్స్. కానీ రెండు వేర్వేరు యుద్ధరీతులు. ఆమె కొంచెం ఎక్కువ ఎత్తుకు ఎగిరింది. కానీ టైమింగ్ పర్ ఫెక్ట్. సూటిగా వెళ్లి వాడి ఛాతీకి ఓ ఇనుప గోళీలా తాకింది ఆమె పాదం. ఎంత వేగంగా తనవైపు ఎగిరి వచ్చాడో అంతే వేగంగా వెనక్కి వెళ్లి పడ్డాడు. గెక్కుమనే శబ్దం వచ్చింది వాడి నోటినుంచి...

ఒక నిమిషంలోనే ముగిసిపోయింది పోరాటం. నిజానికి ఆమె చేసింది ప్రయోగం. కానీ ఆ స్థితిలో ప్రాణాలను రక్షించుకోవటానికి అదే మార్గంగా ఎంచుకుందామె... ఏ ఒక్క కిక్ మిస్సయినా ఆమె తీవ్ర ఇబ్బందుల్లో పడేది. ద్వివేదీ సైతం అబ్బురంగా చూస్తుండిపోయాడు ఆమె ఫైటింగ్ టెక్నిక్కును... వాస్తవంగా ఇప్పటి స్పయింగ్ పోరాటాల్లో ముఖాముఖీ ఫైటింగులు ఉండటం లేదు... వెపన్ల వాడకమే ఎక్కువ. టెక్నాలజీ పెరిగాక దాని సాయంతో చేస్తున్న గూఢచర్యమే ఎక్కువైపోయింది. కానీ అవసరమొచ్చినప్పుడు మార్షల్ ఆర్ట్స్ ఎలా ఆదుకుంటాయో చెప్పటానికి ఇందాకా జరిగిన అద్భుత ఫైటింగే నిదర్శనం. తనకూ కరాటేలో బ్లాక్ బెల్టుంది. ఆమె సైగతో కాస్త వెనక్కి వెళ్లాడు గానీ అవసరాన్ని బట్టి తనూ రంగంలోకి దిగేవాడే. కానీ ఆమె తనకా ఛాన్సే ఇవ్వలేదు.

అతనికి టైక్వాండో బేసిక్స్ తెలుసు గానీ ప్రవేశం లేదు. ఆమె కూడా దాంట్లో ఎక్కువ కాలం శిక్షణ పొందలేదు. బ్రిటన్‌లో శిక్షణ పొందినప్పుడు తన మాస్టర్‌ను బతిమిలాడి కొన్ని ప్రమాదకరమైన కిక్స్ నేర్చుకుంది. తను నేర్చుకున్న

ఇతర మార్షల్ ఆర్ట్స్‌లాగా ఓ సిలబస్‌లాగా గాకుండా, ఈ కిక్స్‌ను సొంతంగా సాధన చేస్తూ మెరుగుపెట్టుకుంది... టైక్వాండ్లో అత్యంత ప్రమాదకరమైన కిక్కులు అయిదు. ఆ అయిదింటినీ విడివిడిగా ప్రత్యర్థులపై వాడి, ఒకేసారి వాటిని బ్రహ్మాండంగా ప్రదర్శించిందామె. ఐతే ఆమె సన్నద్ధతను ప్రత్యర్థులు తక్కువగా అంచనా వేయడం, ఆడదే కదా అనే తేలికభావం ఉండటం, దీనికి తోడు అదృష్టమూ ఆమె వెంట ఉండటంతో ఆ అయిదుగురూ కిందపడ్డారు.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నెన్నో యుద్ధకళలుండగా, వాటిల్లో బాగా పాపులరైంది 133 మాత్రమే...దేశాల వారీగా, శిక్షణ ఇచ్చే సంస్థల వారీగా, నేర్పించే గురువుల వారీగా వాటిల్లో కొద్దితేడాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు కరాటేలోనే అయిదారు ముఖ్యమైన సబ్ గ్రూపులున్నాయి. మన కర్రసాము, కత్తియుద్ధం, కేరళలోని కళరియపట్టు వంటివి ఈ జాబితాలో లేకపోయినా... దేని విశిష్టత దానిది...

ఐకిడో, జియూజిట్సూ, జుడో, కరాటే, క్రే మగా, కుంగ్ ఫూ, ముయ్ థాయ్, టైక్వాండో, ట్యాంగ్ సుడో, మిక్స్‌డ్... ఇలా 10 రకాల స్టైల్స్ మాత్రం ప్రపంచంలో బాగా పాపులరయ్యాయి. అవి కేవలం ఆత్మరక్షణ, దాడుల కోసమే గాకుండా శరీరాన్ని ఫిట్‌గా ఉంచటానికి ఉపయోగపడతాయి. కఠోరసాధన, చేతిలో ఓ ఆర్ట్ ఉందనే ధీమా మనిషి గుండె ధైర్యాన్ని పెంచుతాయి. ఇప్పుడామె ప్రదర్శించిన టైక్వాండో ఆ 133 జాబితాలో 116 వది. ఇది కొరియన్ స్టైల్.

వెపన్లు స్వాధీనం చేసుకుని, కాస్త కదులుతున్న ఇద్దరిని మరో నాలుగు దెబ్బలు బాది, అందరినీ పారలైజ్ చేసేశాడు ద్వివేదీ. అటూఇటూ చూశాడు. రోజూ రాత్రి ఎవరో అందులో పడుకుంటున్నట్టుంది. ఓ బెడ్, పిల్లో, దుప్పటి కనిపిస్తున్నాయి. పిల్లో కవర్‌ను ముక్కలు చేసి వాళ్ల నోళ్లలో కుక్కాడు. దుప్పటిని పేలికలు చేసి వాళ్ల కాళ్లూ, చేతులు ఉమ్మడిగా కట్టేశాడు... వాళ్ల వెంట నిజాలు కక్కించడమూ కష్టమే. చాలా రోజులు కట్టిపడేయడమూ కష్టమే. ఏం చేద్దామంటూ ఆలోచించి, వసుధ సాయమే తీసుకోవాలని భావించింది దివిజ. వెనుక వైపు తలుపులు మూసింది. ముందువైపు ఎలాగూ తాళాలేసి ఉన్నాయి.

ఆ ఎండీ ఎలాగూ సీన్‌లోకి వస్తాడని అనుకోలేదు. కానీ ఇక్కడ చాలా ప్లాన్డ్‌గా చేరి తనకోసం వెయిట్ చేస్తున్నారంటే... ఏదో జరిగింది బ్లండర్... ఏమిటది? ఏమిటది?

ఎస్, తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారు ఎవరో... తను ఎండీ ఫోన్ హ్యాక్ చేసిన తీరూ గమనించారు... అతన్ని అలర్ట్ చేశారు. పక్కాగా తనను మిస్ గైడ్ చేయటానికి వీలుగా ఎండీకి పంపించినట్టు ఓ మెసేజీ పెట్టారు. సరిగ్గా వాళ్లు అనుకున్నట్టే తను ట్రాప్‌లో పడింది. ముందునుంచే తను ఏదో సందేహిస్తున్నా స్పష్టంగా ఇదీ అని తెలియలేదు. ఇప్పుడర్థమవుతోంది. ఈ రివర్స్ హ్యాకింగ్ ఆమెకు ఇంతకుముందు తెలియదు. ఏదో ఓ రీతిలో వీళ్ల నోటి నుంచి నిజాలు బయటపెట్టించక తప్పదు...

ఇక తన ఫోన్ గానీ, ద్వివేదీ ఫోన్ గానీ ఉపయోగించడం శ్రేయస్కరం కాదు... పార్కు బయటకెళ్లి ఫోన్ చేయడమే ఉత్తమం అనుకుంది. చాలాసేపు ఆ ముఠాను దుప్పటి పేలికలు కట్టి ఉంచలేవు. ద్వివేదీని అక్కడే ఉంచి, తను బయటికి వెళ్లి దగ్గరలోని ఓ పబ్లిక్ కాల్ ఆఫీసు చూసుకుంది. నరసింహన్ నంబర్ తన మొబైల్‌లో చూసుకుని ఆ కంటాక్టు నంబర్‌కు కాల్ చేసింది. కనెక్టు కావడం లేదు. లోకల్ పోలీస్ సాయం తప్పనిసరి. వసుధకు కాల్ చేసింది. నేనే వస్తున్నానంటూ చెప్పిన వసుధ ఓ పోలీస్ టీంతో బయల్దేరింది...

ద్వివేదీ ఒక్కడే ఉన్నాడక్కడ. ఎలాగూ వసుధ రావటానికి అరగంటైనా పడుతుంది. అనుకుంటూ వెనక్కి తిరిగి క్యాంటీన్ వద్దకు చేరుకుంది. లోపలికి వెళ్లి హతాశురాలైంది. ద్వివేదీ కింద పడి ఉన్నాడు. స్పృహలో లేడు. బలమైన దెబ్బలు కనిపిస్తున్నాయి. తలపై గాయం నుంచి రక్తం స్రవిస్తోంది. శతృవులు తప్పించుకున్నారని అర్థమైంది ఆమెకు. అంత జాగ్రత్తగా ఉండే ద్వివేదీ ఎలా దెబ్బతిన్నాడో అర్థం కాలేదు. తన మాట్లాడే స్థితిలో లేడు...

❄ ❄ ❄

ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది ఆమెను...

చూడబోతే ఏదో పెద్ద ముఠా ఆపరేట్ చేస్తున్నట్టుంది. ప్రాణాలు తీయటానికి కూడా వెనకాడకుండా జరుగుతున్న ఆపరేషన్ అంటే... ఏదో కీలకమైన అంశమే వారిని ప్రేరేపిస్తున్నట్టుంది. తన శక్తిసామర్థ్యాలు సరిపోతాయా, తాను ఇందులో సక్సెస్ కాగలదా? ద్వివేదీ కోలుకోవటానికి కొద్దిరోజులు పడుతుంది. యాదగిరి సామర్థ్యం ఇలాంటి క్లిష్టమైన కేసులకు సూట్ కాదు...

రా, ఎన్ఐఏ, మిలిటరీ ఇంటలిజెన్స్, ఐబీ వంటి సంస్థలు... ఒకరు చేపట్టిన కేసులో మరొకరు వేలుపెట్టరు. సమన్వయరాహిత్యం సరేసరి... దొరికినట్టే దొరికి

జారిపోతున్నాయి చేపలు... ఎవడో ఒకడు నోరు విప్పకపోతే కేసు ముందుకు సాగే స్థితి లేదు... ఆమె ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.

ఆలోచిస్తూనే ద్వివేదీ తల గాయం నుంచి మరింత రక్తం కారిపోకుండా అక్కడ దొరికిన ఓ బట్టపేలికతో కట్టుకట్టింది. ఖచ్చితంగా హాస్పిటల్‌లో చేర్చాల్సిందే. తన జేబుల్లో ఉన్న మూడు వెపన్లు తీసుకుంది. రెండు ఆ ముఠావి, ఒకటి ద్వివేదీది... చిన్న చిన్న సోఫిస్టికేటెడ్ వెపన్స్ అవి. అందుకే ఈజీగా ప్యాంటు జేబుల్లో పట్టాయి...

ఈలోపు వసుధ అక్కడికి చేరుకుంది. విషయం తెలిసి ఆమె కూడా ఉసూరుమంది...

అప్పటికే దివిజ కాల్ అందుకుని 108 అంబులెన్స్ అక్కడికి చేరింది. ద్వివేదీని అందులోకి చేర్చారు. ఫస్ట్ ఎయిడ్ ప్రారంభమైంది.

'ఏం జరిగి ఉంటుంది? అసలు అంతటి నొటోరియస్ ముఠా ద్వివేదీని కాల్చి చంపకుండా ఎలా వదిలివెళ్లింది? ద్వివేదీ స్పృహలోకి వచ్చాక తనే వెల్లడించాలి ఇక...' అంటూ దివిజ బయటికి నడిచింది.

'నేరుగా ఆఫీస్‌కేనా?' అడిగింది వసుధ

'అవును... మనస్సు ఏమీ బాగాలేదు... డీప్ స్లీప్ కావాలిప్పుడు... అదే రీఫ్రెషర్...' అంటూ బైక్ పెట్టి వచ్చిన షాప్ వద్దకు అడుగులేసింది... వస్తూ వస్తూ పార్కింగ్ వైపు చూసింది. ఎండీ కారు లేదు.

'అంటే అతనూ వచ్చి ఉంటాడు. ఎక్కడో ఉండి ఉండాలి. అదును చూసి క్యాంటీన్ వైపు వచ్చి ఆ ముఠాకు సాయపడి ఉండాలి... నేరుగా ఇన్వాల్వ్‌మెంట్ కనిపిస్తున్నది కాబట్టి ఒకసారి ఓ చూపు చూడాల్సిందే వాడిని...' అనుకుంది.

❄ ❄ ❄

ఆఫీసు చేరగానే నిస్త్రాణగా కుర్చీలో కూలబడిపోయింది.

'నేనే ఆ పార్కువైపు బయల్దేరాలని అనుకుంటున్నాను. మీరే వచ్చేశారు... ఏమైంది మేడమ్...?'

'నాలుగైదు గంటలపాటు నన్ను డిస్టర్బ్ చేయకు యాదీ...' అని ఓ కాఫీ తెప్పించుకుని తాగి ఇంటిలోకి వెళ్లి తలుపులు మూసుకుంది. సెల్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి, బెడ్‌పై పడిపోయింది. ఒక్క గాఢనిద్ర చాలు, మళ్లీ తనను ఈ

టెంపరరీ డిప్రెషన్ నుంచి బయటికి తీసుకురావటానికి అనుకుంటూ... వెంటనే నిద్రపోవటానికి వీలుగా చిన్న చిన్న హిప్నాటిక్ సజెషన్స్ ఇచ్చుకుంటూనే నిద్రలోకి జారిపోయింది. ఇలాంటి చిన్న చిన్న అవసరాల కోసం సెల్ఫ్ హిప్నాటిక్ సజెషన్స్ ఇచ్చుకోవడం కొద్దిగా సాధన ద్వారా నేర్చుకోవచ్చు...

❄ ❄ ❄

'ఫ్రెష్‌గా కనిపిస్తున్నారే... ఇప్పుడు చెప్పండి మేడమ్, ఏమైంది...?' అడిగాడు యాదగిరి.

ఫ్యాక్స్, ప్రింటర్, ఫోన్, జిరాక్సు, స్కానర్... ఇలా అయిదారు అవసరాలకు ఉపయోగపడే ఓ ఆల్ ఇన్ వన్ మిషన్ ఉంది ఆమె కుర్చీకి దగ్గరలోనే... ఎలాగూ తన సెల్ ఫోన్ కాల్స్ ఎవరో వింటున్నారు. ట్రాక్ చేస్తున్నారనే భావనతో ఆ ఫోన్ ద్వారా నరసింహన్‌కు కాల్ చేసింది. మొత్తం వివరంగా చెప్పసాగింది... జాగ్రత్తగా వినమంటూ యాదగిరికి సైగ చేసింది.

'నన్నేం చేయమంటారిప్పుడు...?' అడిగిందామె చివరలో...

'నిజమే, చాలా చిన్నగా అంచనా వేసినట్టున్నాం మొదట్లో... సపరేట్‌గా ఓ టీం ఏర్పాటు చేసి అప్పగిస్తే బెటరని అనిపిస్తోంది ఇప్పుడు. నిన్ను నేను రిస్క్‌లో పడేస్తున్నాను...' అన్నాడాయన.

'పర్లేదు సార్... నేను ఫేస్ చేయగలను... ఇంకొంచెం ప్రోబ్ చేస్తా... అప్పటికీ నావల్ల కాకపోతే అప్పుడు మీరన్నట్టు ఓ టీమ్ ఏర్పాటు చేద్దాం. కేసు తీవ్రత ఏమిటో తెలియాలి కదా ముందు...' అందామె

'మరీ అవసరమనుకుంటే అక్కడి ఎన్ఐఏ ఎస్పీ సాయం తీసుకో... చాలా షార్ప్... కమిటెడ్... అనఫీషియల్‌గా సాయం చేయలేనంటే నేను నేరుగా అతని హయ్యర్ అఫీషియల్స్‌తో మాట్లాడి ఇక వాళ్లనూ ఇన్‌వాల్వ్ చేద్దాం...'

'తను నాకూ తెలుసు సార్... అవసరాన్ని బట్టి చూద్దాం...' అని పెట్టేసింది...

❄ ❄ ❄

'ఎలా ఉందిప్పుడు?' ద్వివేదీని అడిగింది దివిజ.

హాస్పిటల్ బెడ్‌పై పడుకుని ఉన్నాడతను. స్పృహలోకి వచ్చినా చాలా నీరసంగా ఉన్నాడు. బ్యాండేజీలు కనిపిస్తున్నాయి.

'పర్లేదు... ఈ ప్రొఫెషన్‌లో ఇవన్నీ మామూలే. గతంలో ఓసారి ప్రాణాలు

పోయేటంతగా దెబ్బలు తిన్నాను. 15 రోజులు కోమాలో ఉండి బయటికొచ్చాను. నేను బతకననే అనుకున్నారందరూ... ఇప్పుడిక మిగిలిన జీవితమంతా బోనసే కదా అనుకుని మరింత రెచ్చిపోయి పనిచేస్తున్నా...' అంటూ జీవం లేని నవ్వొకటి నవ్వాడు ద్వివేదీ. సొంతంగా ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పుకునే పద్ధతి అది. మెంటల్‌గా వీక్ గాకుండా ఈ టెక్నిక్ ఉపయోగపడుతుంది.

'అసలు ఏం జరిగింది అప్పుడు...?'

'మీరు బయటికి వెళ్లారు కదా... కొద్దిసేపు బాగానే ఉంది. అయిదుగురూ తేరుకుని కట్లు తెంచుకోవటానికి ప్రయత్నించారు. విసుగ్గా నాలుగు బాదాను. అందరూ కొంత తేరుకుని కట్లు కాస్త వదులైతే చాలు, నా అంతు చూసేందుకు రెడీ అవుతున్నట్టనిపించింది. ఒకసారి మన కస్టడీలోకి వస్తే బతుకు ఎంత దుర్భరమవుతుందో వారికి తెలుసు కదా... ఒకడి నోరు మూయించేసరికి ఇంకొకడు లేచి నిల్చున్నాడు. వీడిని కంట్రోల్ తెచ్చేసరికి, మరొకడు లేచాడు. ఈలోపు వెనుక నుంచి నా తలపై పడింది దెబ్బ. ఎవడో బయటి నుంచి నిశ్శబ్దంగా లోపలికి వచ్చాడు. ఆ దెబ్బకు నా కళ్లు తిరుగుతున్నాయి. వాళ్లిద్దరి వెపన్లూ నా వద్దే ఉన్నాయి. అయిదుగురూ తలా రెండు పంచులు ఇచ్చారు. అన్నీ కాచుకోవడం నావల్ల కాలేదు. మొత్తానికి వెపన్స్ వారి చేతికి అందకుండా పెనుగులాడటం మొదలెట్టాను. పులిసిపోయినట్టయింది ఒళ్లు. ఈలోపు బయట అలికిడి వినవచ్చింది. మీరొస్తున్నారని నాతోపాటు వాళ్లూ అనుకున్నట్టున్నారు... మూకుమ్మడిగా కిక్కులు కురిపించారు నాపై... తరువాత ఒక్కసారిగా బయటికి పరుగులు తీశారు. నాకు అప్పుడు పోయిన స్పృహ మళ్లీ హాస్పిటల్‌లోనే మళ్లీ వచ్చింది... బహుశా నేను ఖతమైపోయాయనే నమ్మి ఉంటారు...' అని వివరించాడు

'నిజానికి నేను వచ్చినా సరే..., మన ఇద్దరినీ కలిపి ఖతం చేయాలని అక్కడే ఉండేవారు కదా... ఎలా వదిలి వెళ్లారు? అప్పటికే వాళ్లది అప్పర్ హ్యాండ్ అయ్యింది కదా...'

'మీ దగ్గర వెపన్ ఉంది. మీ ఫైటింగ్ తీరు అప్పటికే చూశారు కూడా. పరిస్థితి ఎదురు తిరిగితే మీరు నిర్దాక్షిణ్యంగా కాల్చి పడేస్తారని అనుకుని ఉంటారు. వాళ్ల దగ్గర వెపన్స్ లేవు కదా... పైగా బయటి నుంచి వచ్చినోడు పదండి పదండి అంటూ తొందరపెట్టడంతో వెళ్లిపోయినట్టున్నారు...'

'బహుశా ఏదో అలికిడికి వాళ్లలా భ్రమపడి ఉంటారు. నేనక్కడికి వచ్చేసరికే

వాళ్లు అదృశ్యమయ్యారు. పోనీలే... గండం గడిచింది. నువ్వు రెస్ట్ తీసుకో, ఇంకొంతసేపు వాళ్లు అక్కడే ఉండి ఉంటే మూడు వెపన్లు వాళ్ల చేతికి వచ్చేవి. నేను అక్కడికి చేరుకున్నాక ఇద్దరినీ కాల్చిపారేసి తాపీగా వెళ్లిపోయేవారు... డెసిషన్ తీసుకోవడంలో తప్పు చేశారు వాళ్లు... ఏదైతేనేం, వాళ్లు తప్పించుకున్నా సరే, ఈ ఎపిసోడ్‌లో అదృష్టం పూర్తిగా మన పక్షానే ఉందిలే...'

'అకస్మాత్తుగా ఆపరేషన్‌కు బ్రేకులు పడినట్టయింది కదా...'

'మన ప్రయత్నం మనం చేస్తున్నాం. మీ బాస్‌కు జరిగిందంతా రిపోర్ట్ చేశాను... టేక్ రెస్ట్...' అంటూ బయటికి వచ్చేసింది...

❄ ❄ ❄

'మేడమ్ చిన్న డౌటూ... అంత సీరియస్ వ్యవహారం ఏమై ఉంటుంది చైనీస్ ఏజెంట్లు ఇంతగా పట్టుదలగా ప్రయత్నించటానికి...? పైగా స్పయింగ్ సాధారణంగా దేశరాజధాని కేంద్రంగా జరుగుతుంటుంది. లాబీయింగ్, ఇంపార్టెంట్ పాలసీ డెసిషన్స్, డాక్యుమెంట్లు, ఫైళ్లు అక్కడే కదా దొరికేవి... మరిక్కడ హైదరాబాద్ బేస్ చేసుకుని ఏం చేస్తున్నట్టు వీళ్లంతా?'

'హైదరాబాద్ డిఫెన్స్ పరంగా మనకు చాలా కీలకం. రక్షణకు సంబంధించిన ముఖ్యమైన పరిశోధనలు చేసే సంస్థలు చాలా ఉన్నాయిక్కడ. న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ ఉంది. డిఫెన్స్ ఫ్యాక్టరీ ఉంది. ఎన్జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీసీఎంబీ, ఐఐసీటీ వంటివీ ఎన్నో... ఒక కంటోన్మెంట్ కూడా ఉంది... సో, ఏదో డిఫెన్స్‌కు సంబంధించిన ఆపరేషన్ ఇక్కడే జరుగుతుండాలి...'

'ఐనా వాళ్ల పరిశోధనలు వాళ్లు చేసుకుంటారు గానీ, ఇతర పరిశోధనలపై నిఘా ఎందుకు?'

'అలా ఉండదు. ఒక దేశం తను సొంతంగా కొత్త ఆయుధాలను డెవలప్ చేసుకోవడం ఎంత ముఖ్యమో, శత్రుదేశం ఏ మేరకు డెవలపైందో కనుక్కోవడం అంతే ముఖ్యం. చైనా కొన్ని విషయాల్లో వీక్. అందుకే మనమేం చేస్తున్నామో తెలుసుకోవాలని ప్రయత్నం...'

'చైనా వీక్ అంటే నేన్నమ్మను... అన్నింట్లోనూ దూసుకుపోతున్నారు కదా... వాళ్ల ప్రాజెక్టులు, భారీ నిర్మాణాలు గట్రా చదువుతూనే ఉన్నాం కదా...'

'కొన్ని వైఫల్యాలు వారు బయటికి రానివ్వరు. సక్సెస్ స్టోరీలే బయటికి

వస్తాయి. మనలాగా డెమక్రటిక్ కంట్రీ కాదు అది... దాని చుట్టూ ఇనుపతెర ఉంటుంది. వాళ్లు చూపాలనుకున్నదే ప్రపంచానికి చూపిస్తారు...'

'ఎలాంటివి?'

'ఉదాహరణకు శత్రుభీకరమైన కొత్త ట్యాంకుల నిర్మాణంలో వాళ్లు పెద్దగా విజయం సాధించలేదు. కొత్తగా డెవలప్ చేసిన మన అర్జున్ ట్యాంకులను చూసి వాళ్లే మెచ్చుకున్నారు ఈమధ్య... అలాగే అంతరిక్ష ప్రయోగాల్లోనూ వాళ్లు వీక్... క్షిపణుల విషయంలో ప్రపంచదేశాలకు దీటుగా డెవలపైనా మిగతా ప్రయోగాల్లో కొంచెం వెనుకబడ్డారు. ఈ విషయంలో మన ఇస్రో సాధించిన ప్రగతి అద్భుతం. రాకెట్ టెక్నాలజీని అందించటానికి గానీ, అణు టెక్నాలజీ విషయంలో సాయం చేయటానికి గానీ ప్రపంచ దేశాలు ఏమీ ముందుకు రాలేదు. కానీ మన శాస్త్రవేత్తలే ఒక్కొక్కటే పట్టుదలతో సాధిస్తూ అన్ని దేశాలకూ సమాధానం చెప్పగలిగిన స్థితికి చేర్చారు. మన అణ్వస్త్రాన్ని మనం పరీక్షించినప్పుడు ప్రపంచ దేశాలు నివ్వెర బోయాయి. అంతెందుకు రాకెట్ ప్రయోగాలకు సంబంధించి మనం వేరే దేశాల్లోని ప్రయోగ కేంద్రాల నుంచి మన ఉపగ్రహాలను పంపించుకునేవాళ్లం. మనం క్రయోజనిక్ ఇంజన్లనూ తయారు చేసుకునే స్థితికి చేరాం. అగ్రదేశం బ్రిటన్‌కు చెందిన నాలుగు ఉపగ్రహాలను మనం వచ్చే నెలలో శ్రీహరికోట నుంచి ప్రయోగించబోతున్నాం... అదీ ప్రోగ్రెస్... అంగారకయాత్ర, చంద్రయాన్, ఖగోళయాత్ర... వాట్ నాట్... కొన్ని ప్రయోగాలు మన దేశరక్షణకు సంబంధించినవీ ఉంటాయి. బయటికి చెప్పరు అంతే...'

'ఊరుకోమ్మా... ఆల్ రెడీ అమెరికా, రష్యాలు చేసి వదిలేసినవో, ఇంకా చేస్తున్నవో మనమూ ఎందుకు చేయాలని చైనా వాళ్లు వదిలేసి ఉంటారు. ఎలాగూ వాళ్లు చేసిన పరిశోధనల ఫలితాలు అందరికీ తెలుస్తాయి కదా... అందరూ ఉత్త మంచుదిబ్బ అని వదిలేసిన అంటార్కిటికాకు మనవాళ్లు వెళ్లి పరిశోధనలు చేసొస్తారు... అంతా డబ్బు దండగ వ్యవహారం...' అన్నాడు యాదగిరి.

'అలా మనం వదిలేసి ఉంటే రాకెట్ టెక్నాలజీలో సెల్ఫ్ సఫీషియెంట్ స్టేజ్‌కు చేరుకునేవాళ్లమా... టెక్నాలజీలో మనం సొంతంగా మన కాళ్ల మీద నిలబడే స్థితిలో ఉండాలి...'

'అలా అనుకున్నప్పుడు మన ఆయుధాలు మెరుగుపడాలి. వేరేదేశాల ఆయుధాలు నిర్వీర్యం కావాలి. ఆ పరిశోధనలు జరగాలి ఇప్పుడు... కానీ అవేమీ

లేవే... ఏటా వేల కోట్లు ఆయుధాల కొనుగోలుకు ఖర్చు చేస్తున్నాం. అందులో మనం సెల్ఫ్ సఫీషియెంట్ ఎందుకు కాలేదు మరి...?'

'వాదనలో నిన్ను ఓడించడం కష్టంలే యాదీ...'

'కాదు మేడమ్... మీరే అన్నారు... యుద్ధాల రీతులు మారిపోతున్నాయి. రాబోయేవి అన్నీ ఆర్థిక యుద్ధాలు, సైబర్ యుద్ధాలు అని...'

'అవును... అదే కరెక్టు కూడా...'

'అలాంటప్పుడు  చైనా గానీ, పాకిస్థాన్ గానీ వాటిపైనే కాన్సంట్రేట్ చేస్తాయి గానీ, సంప్రదాయికంగా జరిగే పరిశోధనలపై ఎందుకు నిఘా పెడుతుంది?'

'సైబర్ యుద్ధాలు, ఆర్థిక యుద్ధాలు మనకన్నా ఆ రెండు దేశాలకు బాగానే తెలుసు యాదీ... కాకపోతే పాకిస్థాన్‌కు దాని వనరులు సరిపోవడం లేదు. చైనా పకడ్బందీగా ఆ దిశలో కార్యాచరణ ప్రారంభించేసింది కూడా... ఏదో ఓ రోజున అన్ని కోణాల్లోనూ ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలనే లక్ష్యంతో ఉందిప్పుడు ఆ దేశం...'

'అలాంటప్పుడు ప్రపంచమనే స్థూల దృష్టితో ప్లాన్ వేయాలి గానీ, ఒక్క ఇండియా కోణంలో ప్లానులెందుకు?'

'రెండూ చేస్తుంది. ఒకవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తన గుప్పిట్లోకి తెచ్చుకునే వ్యూహం. మరోవైపు ఇండియాను కట్టడి చేసే వ్యూహం... తను ఎదిగేకొద్దీ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి మిత్రదేశాల కూటమి ఇండియాతో కలిసి తనకు ప్రతికూలంగా మారతాయేననేది చైనా భయం... అందుకే ఇండియాను ముందే కట్టడిలో పడేసే ఎత్తుగడలు పన్నుతోంది. అమలు చేస్తోంది కూడా... చాలా స్ట్రాటజీతో మన చుట్టూ బ్రహ్మాండమైన వల బిగిస్తోంది...'

'నిజమా... ఎలా? మనదేశం దాన్ని గుర్తించడం లేదంటారా? ఢిల్లీలో దీనికోసం చాలా శాఖలు పనిచేస్తున్నాయి కదా...'

'కొన్ని నాకు తెలిసినవి చెబుతా విను...'

❄ ❄ ❄

చైనా ప్రపంచంలోనే ప్రబలమైన ఆర్థిక, రాజకీయ, మిలిటరీ శక్తిగా ఎదగాలని లక్ష్యం పెట్టుకుంది. దీనికి రకరకాల స్ట్రాటజీలు రచించుకుంది. ముందుగా తనకున్న అపారమైన మానవ వనరుల సాయంతో దేశాన్ని అతి పెద్ద

తయారీ యూనిట్‌గా మార్చేసింది. మాన్యుఫాక్చరింగ్ సెక్టార్ ప్రాధాన్యం బాగా అర్థం చేసుకున్న దేశం అదే. ఉత్పత్తులను అతి చౌకగా ప్రపంచ మార్కెట్‌లోకి డంప్ చేయడం మొదలెట్టింది. అందుకే చైనాను ప్రపంచ కార్ఖానా అంటుంటారు. ఆర్థికంగా బలోపేతమవుతూ మెల్లిగా అమెరికా డాలర్‌లో పెట్టుబడులు పెట్టసాగింది. ఇదంతా వరల్డ్ ఫైనాన్స్. దాన్ని అంత తేలికగా వివరించలేం. కానీ ఇప్పటికిప్పుడు డాలర్ నుంచి చైనా తన పెట్టుబడుల్ని తిరిగి తీసుకోవడం మొదలు పెడితే అమెరికా ఆర్థికవ్యవస్థ కుదేలవుతుంది. అదీ చైనా పవర్ ఇప్పుడు...

రెండోవైపు మిలిటరీపరంగా విపరీతంగా బడ్జెట్ ఖర్చు పెట్టసాగింది. సైన్యంలోకి కొత్త రిక్రూట్ మెంట్లు, కొత్త ఆయుధాలతో చైనా ఇప్పుడు దుర్భేధ్యంగా మారింది. ఇంకా కొత్త ఆయుధాలను పరిశోధిస్తోంది. వాటిని సైన్యం అమ్ముల పొదిలోకి చేరుస్తోంది. ఎంత వేగంగా పెరిగినా... ఎక్కడికంటే అక్కడికి వేగంగా సైన్యం, జలాంతర్గాములు, యుద్ధనౌకలు, యుద్ధవిమానాలు, మిస్సయిల్స్ చేరడమెలా? దీనికి మరో బృహత్తర ప్రణాళిక రచించింది.

ముత్యాల దండ, సిల్క్ రూట్ అని రెండు పథకాలు అవి. ముత్యాల దండలో భాగంగా చైనాకు ఆ మూల నుంచి హిందూ మహాసముద్రం మీదుగా యూరోప్, గల్ఫ్ కంట్రీస్, దక్షిణాఫ్రికాలను కలిపే ఓ అద్భుతమైన రూట్ ఎంచుకుంది. ఈ రూట్‌లోకి వచ్చే ప్రతీ దేశంతోనూ సత్సంబంధాలు నెలకొల్పుకుంది. దాదాపు మూడు ఖండాలతోనూ చైనా అత్యంత సులభమైన యాక్సెస్ ఏర్పడుతుంది. ప్రతీ చోట పోర్టుల అభివృద్ధికి డబ్బులు అత్యంత ఉదారంగా సమకూరుస్తోంది.

ఇదంతా వాణిజ్య అవసరాలు, దేశాల పరస్పర సహకారం పేరిట చేస్తున్నట్టు చైనా బయటికి చెబుతుంది. చమురు, ఇతర సరుకుల రవాణాకు ఇది అత్యంత ఉపయోగకరమని పేర్కొంటుంది. దాదాపు 30, 40 దేశాలతో దానికి ప్రత్యక్ష సంబంధం ఏర్పడుతుంది. చిన్న చిన్న దేశాలకు మరింత సాయం చేసి, నౌకాస్థావరాలను ఏర్పాటు చేస్తోంది. అంటే... నేవల్ బేస్ అన్నమాట. అక్కడ తన యుద్ధనౌకల్ని, జలాంతర్గాముల్ని మోహరించవచ్చు.

ఇంకోవైపు చైనా నుంచి నేరుగా యూరప్ చివరి దేశాల దాకా సిల్క్ రూట్ ను అభివృద్ధి పరుస్తోంది. ఇది మరో బృహత్తర ప్రాజెక్టు. సిల్క్ రూట్ అంటే ఒకప్పుడు ప్రపంచ వాణిజ్యానికి ఆటపట్టు అది. దాన్ని డెవలప్ చేయడంతో పాటు అక్కడక్కడ ఎయిర్ పోర్టులకూ చైనా డబ్బులిస్తోంది. అవసరానికి తగినట్టు వాటిని ఎయిర్ బేస్ లుగా వాడుకుంటుంది. యుద్ధవిమానాలకు స్థావరాలు అవి.

మొన్నమొన్ననే చైనా యూరప్ ఆ మూలను టచ్ చేసేలా 1400 కిలోమీటర్ల రైలును ప్రారంభించింది. సింపుల్‌గా చెప్పాలంటే కొన్ని లక్షల కోట్ల వ్యయంతో అత్యంత పకడ్బందీగా నిర్మాణాత్మక యుద్ధతంత్రం అమలుపరుస్తోంది... రోడ్డు మార్గం, సముద్ర మార్గం, రైలు మార్గం, ఆకాశ మార్గం... అన్నిరకాలుగా ఇన్ని దేశాలకు యాక్సెస్ పెంచుకుంది. ఇదంతా రక్షణపరంగా ఇండియాకు చాలా చిక్కులు తెచ్చిపెడుతుంది. మనకు ఎగువన రైలు, రోడ్డుమార్గాలు, దిగువన హిందూ మహాసముద్రంలో మన చుట్టూ చైనా నేవల్ బేస్‌లు... పరిస్థితి విషమిస్తే... మనల్ని చిటికెలో చక్రబంధంలో ఇరికిస్తుంది చైనా... ఇంత ధీమా వచ్చింది కాబట్టే మొన్న... 'హిందూ మహాసముద్రం మీ ఇంటి పెరడేమీ కాదు...' అని కామెంట్ చేసింది చైనా... ఇలా మిలిటరీ వ్యూహంలో పావులు కదుపుతూనే చైనా మరో ఆర్థికవ్యూహాన్ని వేగంగా అమలుపరుస్తోంది...

ప్రస్తుతం ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ వంటి ఆర్థికసంస్థలను చెప్పుచేతల్లో పెట్టుకుని పేద దేశాల్ని, వర్ధమాన దేశాల్ని గుప్పిట్లోకి తీసుకుని ఆడిస్తోంది అమెరికా... అనేక షరతులతో దేశాల్ని పాదాక్రాంతం చేసుకోవడం దాని ప్లాన్. ఇప్పుడు గ్రీస్ కూడా ప్రపంచబ్యాంకు బాధితురాలే. అనేక దక్షిణ అమెరికా దేశాలు దాని కారణంగా చితికిపోయాయి. ఇప్పుడు చైనా దానికి కూడా చెక్ పెడుతోంది. ఎఐఐబీ పేరిట ఓ బ్యాంకు పెట్టింది. అందులో మనమూ సభ్యులమే. 70 దేశాలు దానిలో భాగస్వాములు. ఇది ప్రపంచబ్యాంకుకు పర్ఫెక్టు చెక్ అన్నమాట. ఇది గాకుండా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికాలు కలిపి బ్రిక్స్ కూటమిగా ఏర్పడ్డాయి. అన్నిరకాలుగా ఈ దేశాలు కలిస్తే ఇక ప్రపంచంలో ప్రబలశక్తిగా ఎదగడానికి ఈ కూటమికే అవకాశాలుంటాయి. మన చుట్టూ ఎంత మిలిటరీ వలయాన్ని నిర్మిస్తున్నా ప్రస్తుతం ఇండియాతో వైరాన్ని పనిగట్టుకుని పెంచుకోదు చైనా.

అరుణాచల్‌ప్రదేశ్ వంటి విషయాల్లో అప్పుడప్పుడూ గెలుకుతూ మనల్ని డిఫెన్స్‌లో ఉంచుతూనే, అమెరికాకు మరీ మనం అనుకూలంగా ఉండకుండా మనల్ని బ్రిక్స్, ఎఐఐబీ వంటి వ్యూహాత్మక పథకాల్లో భాగస్వామిని చేస్తోంది. నిజానికి బయట ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువ. చైనా వాస్తవిక వ్యూహాలు, రహస్య పథకాలు మరింత విస్తృతంగా ఉంటాయి... అదీ చైనా ధోరణి... అర్థమైందా...? నిన్న అమెరికా నేత హిల్లరీ క్లింటన్ ప్రకటన చూడు... చైనా మిలిటరీపరంగా బాగా బలోపేతమవుతోంది అని ఆమె ఆందోళన...'

'పెద్ద ఉపన్యాసమే ఇచ్చారు మేడమ్. కానీ ఇవన్నీ ఇంత కీన్‌గా అధ్యయనం చేస్తున్నారన్నమాట...'

'దేశవిదేశీ సంబంధాలు, వ్యూహాలు పెద్ద సబ్జెక్టు. ఒకసారి అది చదవడం, తెలుసుకోవడం మొదలుపెడితే అదో వ్యసనం. మనందేశంలో అంతర్గతంగా ఉన్న చిన్న చిన్న కలహాలను భూతద్దంలో చూస్తాం. మీడియాకు విస్తృత అవగాహన లేకపోవడం వల్ల అత్యంత అల్పవిషయాలనే కొండంతలుగా చూపిస్తుంటాయి. వాస్తవానికి మన చుట్టూ పెరుగుతున్న ప్రమాదాలు, రాబోయే ఉపద్రవాల తీవ్రత చాలా ఎక్కువ... ఎప్పుడైనా పొరపాటున చైనాతో కయ్యం మొదలైతే మన పరిస్థితి ఎలా ఉంటుందో అర్థమైంది కదా... '

మరి మన విదేశాంగశాఖ, రక్షణశాఖ ఏం చేస్తున్నట్టు మేడమ్...?'

'2జీ స్పెక్ట్రం అమ్ముకోవడం, బొగ్గుగనుల కేటాయింపులు వంటి కుంభ కోణాల్లో అందినకాడికి దండుకునే పనిలో నేతలు నిమగ్నమై ఉంటే ఏ అధికారైనా ఏం చేయగలడు? తన వాటాకు ఏమైనా వస్తుందేమో వెతుక్కోవడంలో మునిగిపోయింది మన బ్యూరోక్రసీ... ప్రతీచోట లంచం, స్వార్థం, సంపాదన... ఇవే ప్రధానమయ్యాయి... చీప్‌గా దొరికే మందు, చీప్ రేషన్ కోసం జనం సైన్యంలో చేరతారని ఈమధ్య ఓ ఎంపీ వాగాడు... రక్తం కూడా గడ్డకట్టుకుని పోయే సియాచిన్ మంచుకొండల్లో అయిదు నిమిషాలు నిలబెడితే గానీ అలాంటివాళ్లకు అర్థం కాదు, సైనికులు ఏం త్యాగాలు చేస్తున్నారో... వాళ్లే లేకపోతే రక్షణెక్కడిది? వీళ్లకు ఈ డబ్బు, విలాసాలు, ఆడంబరాలు, స్వేచ్ఛ ఎక్కడివి? రేప్పొద్దున చైనా నుంచి ఖండాంతర క్షిపణులు వచ్చిపడుతుంటే, ఊళ్లకు ఊళ్లు వాళ్ల సైన్యం చేతుల్లో ఇరుక్కుంటే అప్పుడు తెలుస్తుంది వీరికి స్వేచ్ఛ విలువేమిటో, దేశరక్షణ విలువేమిటో... యుద్ధఫలితాలు, గాయాలు ఎంత భయంకరంగా ఉంటాయో ఈ జనరేషన్‌కు తెలియదు...'

'మన స్థాయికి మనమే ఇన్ని మాట్లాడుకుంటున్నాం. పైస్థాయిలో ఇలాంటివి సీరియస్‌గా ఆలోచించరంటారా?'

'ఇప్పుడిప్పుడే దిద్దుబాటు ఆరంభమైనట్టు కనిపిస్తోంది. మొన్న ఓ క్రూషియల్ మీటింగ్ వివరాలు నాకు నరసింహన్ చెప్పారు. అందరూ మోడీ అదేపనిగా దేశాలు తిరుగుతున్నారని నిందిస్తున్నారు గానీ ఆయన ప్రతీ దేశ సందర్శన వెనుక మనకంటూ ఓ ప్లాన్ ఉంది. మోడీ వ్యక్తిగత ఇష్టాలను బట్టి ఆ పర్యటనలు

ఉండవని చాలా మందికి తెలియదు. అవన్నీ ప్లాన్ చేసే శాఖ వేరే ఉంటుంది. అయిదారేళ్లుగా భ్రష్టుపట్టిన విదేశాంగశాఖను సంస్కరించే పని ఆరంభమైంది. ఫస్ట్ ఆ సెక్రెటరీ లేడీని తొలగించి, ఓ సమర్థుడిని పెట్టారు. మన గోవా, పాండిచ్చేరితో సమానంగా ఉండే సీషెల్స్ వంటి దేశానికి కూడా ప్రధానిని తీసుకెళ్లారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు వంటి దేశాలతోనూ మనకు సంబంధాలు చెడిపోయాయి మొన్నటిదాకా. చైనా అద్భుతంగా వాడుకుని తన ఫోల్డ్‌లోకి లాక్కుంది. ఒక్కొక్క దేశమే తిరుగుతూ ప్రధాని హోదాలో పలు ప్రకటనలు చేస్తూ, పాత సంబంధాలన్నీ పునరుద్ధరించుకునే పనిలో పడ్డాం మనమిప్పుడు. మొన్ననే బంగ్లాదేశ్‌తో ఉన్న భూవివాదాన్ని పరిష్కరించేశారు. ఇప్పుడు మధ్య ఆసియా దేశాల్లోనూ పర్యటనకు బయల్దేరారు. కజకిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజకిస్థాన్, కిర్గిజిస్థాన్ దేశాల్లో పర్యటిస్తారు. ఎందుకో తెలుసా... అన్నీ పాత రష్యా దేశాలు. అదేమీ పట్టించుకోవడం లేదు. దీన్ని చైనా వాడుకుంది. భద్రతరీత్యా మధ్య ఆసియా అత్యంత కీలకం. చివరకు మనకూ బాగా థ్రెట్‌గా మారిన ఇస్లామిక్ తీవ్రవాదాన్ని ఎదుర్కోవాలన్నా ఆ దేశాల సహకారం కావాలి. వీటితో సమన్వయం కోసం ఐబీ మాజీ డైరెక్టర్‌ను స్పెషల్‌గా నియమించారు... అదీ దాని ఇంపార్టెన్స్... ఇన్నాళ్లూ పాలస్తీనాకు అనుకూలంగా ఉన్న విదేశీ విధానాన్ని ఇజ్రాయిల్ అనుకూల విధానంగా మార్చుకుంది. నువ్వు కూడా అందరిలాగా మోడీ సెల్ఫీలు, డ్రెస్సులనే కోణంలో ఆ పర్యటనలు చూడొద్దు... మన చుట్టూ ఉన్న దేశాల్ని చైనా సిల్క్ రూట్ అనీ, ముత్యాలదండ అనీ చెంత చేర్చుకుంటుంటే మనం కళ్లప్పగించి చూశాం ఇన్ని రోజులూ...'

'ఇప్పటికైనా మనం చేయగలిగేది ఏముంటుంది మేడమ్..?'

'చేయలేమని చేతులు ముడుచుకోలేం కదా... లుక్ ఈస్ట్ అంటూ కొత్త పాలసీ ఒకటి పెట్టుకుని కదులుతున్నాం. అమెరికా దాని మిత్రదేశాల ప్లాన్ ప్రకారమే ఇండియా ఈ కొత్త పాలసీతో కదులుతోందని చైనా సందేహం. నిజానికి గతంలో మనకు భద్రతపరంగా దేశానికి ఎగువన సున్నితమైన ప్రాంతాలుండేవి. కానీ ఇప్పుడు ప్రమాదం దిగువన ఉన్న సముద్రం వైపు నుంచే ఆరంభమైంది'

'సముద్రం నుంచి సైన్యాన్ని నడిపించలేరు కదా మేడమ్...'

'కోస్ట్ గార్డ్‌లో మనం వీక్. హిందూ మహాసముద్రంపై కొంత మన ఆధిపత్యం కొనసాగుతున్నా త్వరలోనే చైనా దాన్ని తీసేసుకోనుంది. మనకున్న యుద్ధనౌకలు,

జలాంతర్గాములు తక్కువే. ఓ చిన్న పడవలో పాకిస్థాన్ నుంచి తుపాకులేసుకుని వచ్చిన ఓ ఉగ్రవాద ముఠా మన గడ్డపై అడుగుపెట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపిందంటే మనమెంత బలహీనంగా ఉన్నామో అర్థం కావడం లేదూ... మరొకటీ బయల్దేరింది కానీ ఇటీవల మధ్యలోనే దగ్ధమైంది. ఇప్పటిదాకా దక్షిణాఫ్రికాలోని కొన్ని దేశాలకే పరిమితమైన పైరేట్స్ బెడద అరేబియా సమద్రంలోనూ మొదలైందని సమాచారం. మొన్నటికి మొన్న ఇరాన్ వెళ్తున్న 10 చైనా నౌకలను దిగ్బంధనం చేశారని, ఇండియన్ నేవీ వెళ్లి కాపాడిందనీ తెలుస్తోంది. నిజానిజాలు ఇంకా బయటికి రాలేదనుకో... మన చుట్టూ తను నిర్మించుకుంటున్న నేవల్ బేస్‌ల నుంచి చైనా చాలా వేగంగా మన సరిహద్దులకు చేరుకోగలదు. అందుకే ప్రస్తుతం సముద్రమే భద్రతపరంగా సున్నితమైంది... ఇన్ విజిబుల్ జలాంతర్గామిని తయారు చేసుకుందట చైనా ఈమధ్య... అంటే ఏ వైజాగ్ వద్దకో అది చేరుకునేదాకా మనం కనిపెట్టలేమన్నమాట...'

'మీరు చెబుతున్నవన్నీ వింటుంటే భయమేస్తోంది. మన జనానికి ఇందులో ఎన్ని విషయాలు తెలుసు?'

'తెలియనివ్వరు. స్మృతి ఇరానీ విద్యార్హతలపై వివాదాలే ముఖ్యం మన జనానికి. ఆమె ఏం చదివితే ఏం పోయింది దేశానికి...? ముల్లును ముల్లుతోనే తీస్తామనే పారీకర్ వ్యాఖ్యలకూ విపరీతార్థాలు తీస్తారు. అందులో తప్పేముంది.? ఇప్పుడిప్పుడే దూకుడు కనిపిస్తోంది. మనదేశ చరిత్రలోనే మొదటిసారి పొరుగు దేశంలోకి జొచ్చుకుపోయి మరీ కొందరు ఉగ్రవాదులను ఏరిపారేశాం. ఇది పాకిస్థాన్‌కు పరోక్ష హెచ్చరిక. ఇక్కడి ఏదో ఆపరేషన్ చేసి, ఏ పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకో వెళ్లి దాక్కుంటే ఇకపై ఊరుకోబోమని చెప్పాం మనం... అందుకే పాకిస్థాన్ ఉలిక్కిపడింది. మా భద్రతకు ప్రమాదం ఎదురైనప్పుడు ఎక్కడికైనా వెళ్తాం, ఎవరినైనా వేటాడతామని మన ప్రభుత్వం ప్రపంచానికి చెబుతుందన్నమాట...'

మణిపూర్, నాగాలాండ్ తీవ్రవాదులైనా మన పౌరులే కదా... వారిని ఏరిపారేయడం అంటే మన పౌరుల్ని మనమే చంపుకోవడమే కదా... ఇతర దేశసైనికులు కాదుకదా వాళ్లు... వాళ్లకు డిమాండ్లున్నాయి... న్యాయమైన కోర్కెలు ఉన్నాయి. వాళ్ల అస్తిత్వానికి ప్రమాదకరంగా మారిన పరిస్థితులపై వాళ్లు పోరాడుతున్నారు. సరైన పరిష్కారం చూపలేక మనల్ని మనమే చంపేసుకోవడాన్ని నేనైతే వ్యతిరేకిస్తాను మేడమ్... నా అవగాహన స్థాయి తక్కువైనా సరే...'

'నేనూ అంగీకరిస్తాను యాదీ... మామూలు  సెగ్గడ్డ అయితే చికిత్స ఉంటుంది. ట్యూమర్‌గా మారితే దాన్ని తొలగించడమే మార్గం. లేదంటే అది దేహం మొత్తానికీ వ్యాపిస్తుంది. దేశమైనా అంతే...'

'అది మీ అభిప్రాయం... నా అభిప్రాయం మాత్రం మారదు...'

'సరే, ఈరోజంతా నా ఉపన్యాసాలకే సరిపోతున్నట్టుంది... నాలుగైదు గంటలు నన్ను వదిలిపెట్టు... ఇవ్వాళ మన చైనా హీరోల అసలు ఆపరేషన్ ఏందో ఓ చిన్న హింటైనా పట్టుకుంటాను...'

'సరే మేడమ్... మనం పట్టుకున్న చిన్న చిన్న కేసులు అలాగే పెండింగ్ పడిపోతున్నాయి. ఆ పనిమీద వెళ్తా... మీరెలాగూ ఇప్పట్లో ఈ కేసు నుంచి బయటికి తేలేరా లేరు...'

యాదగిరి బయటికి వెళ్లిపోయాడు. ఆమె మొదట చక్రధర్ దగ్గర దొరికిన కార్డును కంప్యూటర్‌కు అనుసంధానించింది. ఒక్కొక్క ఫోల్డర్ తిరగేయసాగింది... చాలా ఆసక్తికరమైన అంశాలు ఆమెకు అర్థం కాసాగాయి...

❄ ❄ ❄

బషీర్ సంపాదించిన సమాచారం స్పయింగ్ గేమ్‌లో అత్యంత విలువైనదే గాకుండా సున్నితమైన కొన్ని దేశాల నడుమ సంబంధాలను, ప్రత్యేకించి ఇండియా భద్రత వ్యూహాలను డిస్ట్రబ్ చేసే ప్రమాదమూ దాంతో ఉంది. ఇండియాను శత్రుదుర్భేద్యంగా మార్చే ఆపరేషన్ వివరాలున్నాయి. ఫోటోలు, డాక్యుమెంట్లు, ఫైళ్ల స్కానింగులు, వీడియోలు, కీలక ప్రదేశాల టోపోగ్రఫీ... అత్యంత వివరంగా పొందుపరిచాడు బషీర్... దేశవిదేశాల విదేశాంగ విధానాలు, వ్యూహాలు, ఎత్తుగడలపై బాగా అధ్యయనం చేస్తున్న ఆమెకే ఆ వివరాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. అనేక కొత్త విషయాలు తెలుస్తున్నాయి. చైనా ఏజెంట్లకు బషీర్ చేసిన ఆపరేషన్ విలువేమిటో ఇంకా పూర్తిగా తెలియనట్టుంది. లేకపోతే మరింత సీరియస్ ఎఫర్ట్స్ పెట్టేవారు. అత్యంత ముఖ్యమైన సీబీఐ, రా, మిలిటరీ డిఫెన్స్, డీఆర్డీవో, అణుపరిశోధన కేంద్రం, ఇస్రో, డిఫెన్స్ మినిస్ట్రీ, ఫారిన్ అఫయిర్స్ మినిస్ట్రీ, పీఎంవో ఉన్నతాధికారులకు తప్ప అన్యులెవరికీ తెలియని ఓ ఆపరేషన్ గురించిన సమాచారమది...

చైనా ముత్యాలదండ, సిల్క్ రూట్, చైనా-పాక్ ఎకనమిక్ కారిడార్ తదితర ప్రాజెక్టుల పేరుతో చేపట్టిన యాక్షన్ ప్లాన్ ఇండియాకు అత్యంత ప్రమాదకరంగా

మారనుంది. ఇండియా అదే సందేహిస్తోంది. తన చుట్టూ ఎక్కడబడితే అక్కడ సబ్ మెరైన్లను, యుద్ధనౌకలను, యుద్ధవిమానాలను మోహరింపజేసే అవకాశం చైనాకు కలగడం ఇండియాను చికాకుపెడుతోంది. ప్రత్యేకించి హిందూ మహాసముద్రంపై పెరుగుతున్న చైనా గ్రిప్ ఇండియాను అభద్రతకు గురిచేస్తోంది.

అందుకని, చైనా దూకుడును నిలువరించటానికి గాను కొద్దిసంవత్సరాలుగా ఇండియా ఓ రహస్య ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఎలాగూ అమెరికా కూడా చైనా ఆధిపత్యపోకడలకు చెక్ పెట్టాలనుకుంటోంది. ఈ క్రమంలో తన పాత దోస్తు పాకిస్థాన్‌ను నమ్మలేదు. ఎందుకంటే చైనా, పాకిస్థాన్ రెండూ భారత వ్యతిరేకతతో అంటకాగుతూ దోస్తీ చేస్తున్నాయి. తీవ్రవాదంపై పోరు విషయంలోనూ పాకిస్థాన్ బయటకి చెప్పేదొకటి, చేసేదొకటి అని అమెరికా రుసరుసలాడుతోంది.

చైనా చెప్పినట్టుగా ఆడుతున్న పాకిస్థాన్‌ను నమ్మలేమనే కారణంతో క్రమేపీ ఇండియా స్నేహం కోసం చేతులు సాచింది. ఇండియా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, జపాన్, వియత్నాం, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ తదితర దేశాలు ఒక్కటైతే తప్ప చైనా వ్యూహాలకు కౌంటర్ చెక్ పెట్టలేమనేది అమెరికా అభిప్రాయం. రష్యాతో బలమైన స్నేహం ఉన్న ఇండియా కూడా అర్ధమనస్కంగానే అమెరికాతో దోస్తీ పెంచుకుంటోంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రచ్ఛన్నయుద్ధం నెలకొన్న సమయంలో రష్యా, అమెరికా రెండూ స్టార్ వార్స్ టెక్నాలజీని డెవలప్ చేసుకున్నాయి. శతృదేశాల నుంచి వచ్చే మిస్సయిల్స్, మానవరహిత విమానాలను అంతరిక్షం నుంచే పడగొట్టడం ఈ టెక్నాలజీ లక్ష్యం. ఆ టెక్నాలజీ కోసం కొంతకాలంగా ఇండియా విశ్వప్రయత్నాలు చేస్తోంది. నేరుగా గాకుండా ఈ ఆపరేషన్ కోసం ఒక వైపు ఇజ్రాయిల్, అమెరికాల సహకారాన్ని, ఇంకోవైపు రష్యా సహకారాన్ని రహస్యంగా తీసుకుంటోంది. ప్రైవేటు స్పై ఏజెంట్లు, డిఫెన్స్ బ్రోకర్ల సాయాన్ని కూడా కొనుక్కుంటోంది. 2015 ఏప్రిల్ లో అమెరికాకు చెందిన ఓ డిఫెన్స్ కంట్రాక్టర్ ఇండియాకు ఇలాగే న్యూక్లియర్ సబ్మెరైన్ సమాచారం, టార్పెడోలు, ఆధునిక యుద్ధవిమానాల టెక్నాలజీ వివరాలు అందిస్తూ దొరికిపోయాడు...

ఐతే తాము ఇస్తున్న పరిమితి టెక్నాలజీని, బ్రోకర్లు (కంట్రాక్టర్లు) నుంచి కొనుక్కుంటున్న టెక్నాలజీని రష్యాకు చేరవేస్తోందనీ, ఆ దేశం నుంచి కూడా టెక్నాలజీని తమకు తెలియకుండా ఇండియా వాడుకుంటోందని... అందరిపీ

కలిపి కొత్తతరం ఆయుధాల్ని ఇండియా రూపొందించుకుంటోందని అమెరికా సందేహం. కొన్ని ఆధారాలను కూడా సేకరించి ఇండియాను అడిగితే... డీఆర్డీవో చీఫ్ పైకి నెపాన్ని నెట్టేసి అమెరికా కోపాన్ని తగ్గించటానికి అతన్ని టర్మినేట్ చేసింది.

ఇండియా ఇప్పుడు డెవలప్ చేసుకుంటున్న ఒక వెపన్ పేరు... కాళి!

కిలో ఆంపియర్ లైనర్ ఇంజక్టర్... దీనికే సంక్షిప్తనామం కాళి...

స్టార్ వార్స్ వెపన్ ఇది... ఇందులో రెండురకాలు ఉంటాయి...

ఒకటేమో రేడియో ధార్మిక కిరణాలను ప్రయోగిస్తుంది. మరొకటేమో మైక్రోవేవ్ తరంగాలను ప్రయోగిస్తుంది.

ఇవి శత్రుదేశాల నుంచి వచ్చిపడే మిస్సయిళ్లను, విమానాలను, ఇతరత్రా ఏ ఆయుధాలనైనా ఇవి అడ్డుకుంటాయి. వాటి ఎలక్ట్రానిక్ సిస్టమ్స్‌ను చెల్లాచెదురు చేసి వాటి దిశలను మళ్లిస్తాయి. లేదా అక్కడే కుప్పకూలేలా చేస్తాయి. ఇప్పటికే చండీగఢ్‌లో ఉన్న 'డిఫెన్స్ బాలిస్టిక్ ఇన్ స్టిట్యూట్' కాళి ప్రాజెక్టులోని ఒక వెర్షన్‌ను పరీక్షించింది. దీనిలోని మైక్రోవేవ్ వెర్షన్‌ను బెంగుళూరులోని 'ఇండియన్ ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ' పరీక్షిస్తోంది. ఇన్నాళ్లూ ఈ మైక్రోవేవ్ గన్స్ రహస్య ఆపరేషన్ మాత్రమే. ఇటీవల అమెరికా, రష్యా రెండూ ఈ ఆయుధాలను విజయవంతంగా పరీక్షించినట్టు ప్రకటించాయి. అవి ఇజ్రాయిల్, ఇండియాలకూ ఉన్నాయనేది రహస్యం.

వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు గతంలోనే 'కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ' గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అప్పటి రక్షణ మంత్రి తాత్కాలికంగా దాన్ని పక్కన పెట్టారు. గతంలో పనిచేసిన మరో పార్టీకి చెందిన రక్షణ మంత్రి ఒకరు, నేవల్ ఛీఫ్ ఒకరు ఈ యాంటీ మిస్సయిల్స్ టెక్నాలజీ కొనుగోళ్ల కుంభకోణంలో నిందితులంటూ సీబీఐ ఓ కేసు నడుపుతోంది. అందుకని ఒకవైపు సీబీఐ కేసు ఉండగా ఈ ప్రాజెక్టు విషయంలో అడుగులు వేయవచ్చునా లేదానేది ఆయన సందేహం. దాంతో ఆయన విజిలెన్స్ ఒపీనియన్ అడిగారు. దేశరక్షణ కోణంలో ఆలోచించాలంటూ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ 'జాతీయ అవసరాలు' అని పేర్కొంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో చివరకు సొలిసిటర్ జనరల్ ఒపీనియన్ కూడా తీసుకున్నారు.

ఐతే అందరికీ ఈ ఆపరేషన్ కేవలం ఇజ్రాయిల్‌కు చెందిన బరాక్ సీరిస్

యాంటీ మిస్సయిల్ టెక్నాలజీగా మాత్రమే తెలుసు. బరాక్ యాంటీ మిస్సయిళ్ల సీరీస్ అమలులో భాగంగా ఇజ్రాయిల్ మిలిటరీ ఇండస్ట్రీస్, ఇండియాకు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డు కలిసి అయిదు ఆయుధ ఫ్యాక్టరీలను బీహార్ లో రాబోయే మూడేళ్లలో నిర్మిస్తాయి.

ఇదంతా ఒక ఎత్తు... ఇండియా రహస్య ఆపరేషన్ వేరు. ఈ యాంటీ మిస్సయిల్, మైక్రోవేవ్ గన్ టెక్నాలజీకి అనుబంధంగా మరికొన్ని రకాల ఆధునిక సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్, ఫార్ములాలను ఇండియా సేకరించుకుంది. అమెరికా నుంచి వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు రష్యాలోని, సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో ఉన్న నేవీ రీసెర్స్ అండ్ డెవలప్‌మెంట్ ఫెసిలిటీకి పంపించి, వాళ్ల సహకారంతో ఇండియాకే ఆ టెక్నాలజీని మరికొంత మెరుగుపర్చుకుంది. ఈ టెక్నాలజీలను కలిపి ఇండియా సొంతంగానే ఓ వెపన్‌ను రూపొందించుకుంది. దానిపేరు... పాశుపత!

దీనికి డిఫెన్స్ లేబరేటరీల్లోని మెరికల్లాంటి నిపుణులనే గాకుండా ఇస్రో, బార్క్‌ల నుంచి కొందరు నిపుణులను ఎంపిక చేసి... ఓ టీంగా చేసింది ఇండియా. వాళ్లు అభివృద్ధపరిచిందే ఈ పాశుపత...

ఇది అమెరికా, ఇజ్రాయిల్, రష్యాలకూ సాధ్యం కాలేదు. ముంబైలోని బాబా న్యూక్లియర్ రీసెర్చ్ సెంటర్‌లో మొదట దీన్ని డెవలప్ చేసిన ఇండియా... అక్కడ కొన్ని చేదు సంఘటనల నేపథ్యంలో భద్రతపై సందేహాలతో హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యుయల్ కాంప్లెక్స్‌లో కట్టుదిట్టమైన భద్రత నడుమ దాన్ని పరీక్షిస్తోంది.

దీని సామర్థ్యం ఏమిటంటే... ప్రపంచంలో ఏ మూలనైనా అణ్వస్త్రం యాక్టివేట్ అయితే చాలు, ఈ పాశుపత దాన్ని ఆటోమేటిక్‌గా పసిగడుతుంది. అంతరిక్షంలో తిరిగే ఉపగ్రహానికి అనుసంధానించి ఉండే ఈ వెపన్ నుంచి వెలువడే ప్రత్యేక రేడియో ధార్మిక కిరణాలు ఆ అణ్వస్త్రంపైకి దూసుకెళ్తాయి. ఈ కిరణాల ప్రభావంతో ఆ అణ్వస్త్రంలో ఉండే యురేనియం, థోరియం, ప్లుటోనియం వంటి మూలకాలు తమ భారశక్తిని అత్యంత వేగంగా కోల్పోయి సీసంగా మారి పోతాయి. దాంతో ఆ అణ్వస్త్రం ఎక్కడ పడినా దానివల్ల ఇసుమంతైనా నష్టముండదు.

ఒక్కసారి ఇది ఇండియా అమ్ములపొదిలో చేరిందంటే... ఇక ఇండియాకు తిరుగులేదు... ఖండాంతర క్షిపణులే కాదు, అణ్వస్త్రాలు కూడా ఏమీ చేయలేవు...

❄ ❄ ❄

ఇద్దరు మనుషులతో ఈ ఫార్ములాలు, పరిశోధనల వివరాలను చెప్పిస్తున్న వీడియోలు కనిపిస్తున్నాయి. కానీ వారెవరో దివిజకు అర్థం కాలేదు. ఎక్కడెక్కడ పరిశోధనలు జరుగుతున్నాయో, వాటి డిజైన్లు ఏమిటో చెబుతున్నట్టుగా ఉంది గానీ ఆ టెక్నికల్ వివరాలు కొన్ని ఆమెకు అంతుపట్టలేదు. రకరకాల డాక్యుమెంట్లు, డిజైన్లు స్కానింగ్ చేసి ఉన్నాయి. ఇది చైనాకే కాదు, అమెరికా, రష్యాలకు కూడా కొత్త సమాచారమే అవుతుంది. ఐతే ఆమె మైండ్‌లో కొన్ని ప్రశ్నలు సమాధానం దొరక్కుండా వేధిస్తున్నాయి. అప్పటికే మెదడు వేడెక్కడంతో కంప్యూటర్‌ను స్లీప్ మోడ్‌లో పెట్టి, బయటికి వచ్చింది. ఈ వివరాలు ప్రభుత్వంలోని కీలకవ్యక్తులకు తప్ప వేరేవాళ్లకు అర్థం కావు.

వీధి చివరివరకూ నడుస్తూ వెళ్లి, ఓ ఉడిపి హోటల్‌లో కూర్చుని కాఫీ ఆర్డరిచ్చింది. తననెవరో గమనిస్తున్నట్టు అనిపిస్తోంది. థ్రెట్ విపరీతంగా ఉన్న విషయం తెలిసీ కనీసం వెపన్ కూడా లేకుండా నడుచుకుంటూ రావడం తప్పేమో అనుకుంటూ చుట్టూ అనుమానాస్పద వ్యక్తుల కోసం చూసింది. ఎవరూ కనిపించలేదు...

ఈలోపు ఆమె మొబైల్ మోగసాగింది. రా చీఫ్ నరసింహన్ నుంచి కాల్...

ఆమె తనకు తెలిసిన సమాచారమంతా వెంటనే చెప్పేసి, తనను వేధిస్తున్న ప్రశ్నలన్నీ ఆయన ముందుంచాలనుకుంది. ఆ ఫోన్ సురక్షితం కాదని తెలిసి తమాయించుకుంది..

'నువ్వు ఎయిర్ పోర్టుకు రా... విశాఖపట్టణం వెళ్లొద్దాం... ' అన్నాడాయన...

మారుమాట్లాడకుండా ఓకే సార్ అని ఫోన్ పెట్టేసి, ఆఫీస్ వైపు చకచకా అడుగులు వేసింది. ఎవరో తనను వెంటాడుతున్నట్టు అనిపిస్తోంది గానీ అదేమిటో ఆమెకు అంతుపట్టడం లేదు. ఆలోచనలు ఆపి, ఓ చిట్టీపై యాదగిరికి తను వెళ్తున్న పని రాసి, ఓ సంకేత స్థలంలో పెట్టేసి బయల్దేరింది. తన కారులోనే ఎయిర్ పోర్టు చేరుకుని, పార్కింగ్‌లో పెట్టేసింది. తన పేరిట విశాఖపట్టణానికి బుక్ చేసి ఉన్న టికెట్‌ను నరసింహన్ వాట్సాప్ ద్వారా పంపించాడు. ఎంట్రన్స్ గేటు వద్ద దాంతోపాటు తన ఐడెంటిటీ ప్రూఫ్ చూపించి, బోర్డింగ్ పాస్ తీసుకుంది. ఈలోపు యూనిఫామ్‌లో ఉన్న ఓ వ్యక్తి వచ్చి ఆమెను పలకరించాడు. మిమ్మల్ని సార్ తీసుకురమ్మన్నారు అంటూ సెక్యూరిటీ తతంగాన్ని మమ

అనిపించేసి నేరుగా నరసింహన్ కూర్చున్న ప్రైవేటు కాన్ఫిడెన్షియల్ రూంలోకి ఆమెను తీసుకెళ్లి అతను వెళ్లిపోయాడు...

'విశాఖపట్టణం ఎందుకు సార్? నేనెందుకు ?' అనడిగింది దివిజ...

ఆయన ముందున్న టీపాయ్‌పై ట్రేలో ఫ్లాస్కు, టీ బ్యాగులు, సుగర్ పాకెట్లు, కప్పులు, చెంచాలు ఉన్నాయి.. నాలుగైదు చిన్న ప్లేట్లలో కొన్ని స్నాక్స్, బిస్కెట్లు ఉన్నాయి...

వాటిని చూపించి 'తీసుకో... చెబుతా...' అంటూ తనే టీ కలపసాగాడు.

టీ తాగుతూ సిగరెట్ ముట్టించాడు. ఆ గదుల్లో వీవీఐపీల స్టేటస్‌ను బట్టి పొగ తాగటానికి అనుమతిస్తున్నారు గానీ ఎయిర్ పోర్టులో ఓ క్యాంటీన్ వద్ద ఉన్న స్మోకింగ్ ఛాంబర్‌లో తప్ప ఇంకెక్కడా సిగరెట్ తాగడానికి వీలులేదు.

'వైజాగ్‌లో ఇవ్వాళ ఐసీజీఎస్ దుర్గావతి అనే కోస్ట్ గార్డ్ నౌక సముద్రజల ప్రవేశం ప్రోగ్రామ్ ఉంది. అంతా ఫార్మాలిటీలే... హిందుస్థాన్ షిప్ యార్డు నిర్మిస్తున్న ఇలాంటి 5 నౌకల్లో ఇది మొదటిది. మనం సొంతంగా నిర్మించుకున్నాం. దీంతో మన కోస్ట్ గార్డ్, నేవీ మరికొంత బలోపేతం అవుతాయి. అందుకే ముఖ్యులందరినీ పిలిచారు... మనం చేసేది ఏమీ ఉండదు. కానీ హాజరు కావడం ముఖ్యం...' అంటూ ఓ పాస్ ఆమె చేతికి ఇచ్చాడు. ముందే ఆమె పేరిట పాస్ తెప్పించాడన్నమాట...

టీ తాగగానే విమానంలోకి వెళ్లే ఎంట్రన్స్ వైపు బయల్దేరారు...

❄ ❄ ❄

వైజాగ్ వెళ్లగానే కోస్ట్ గార్డ్ విభాగం పంపించిన వెహికల్‌లో నేరుగా నేవీ గెస్ట్ హౌజ్‌కు వెళ్లారు. 'మనకు ఇంకా చాలా టైముంది... కొద్దిసేపు రెస్ట్ తీసుకో... నేను ఓ ముఖ్యమైన పనిమీద బయటికి వెళ్లొస్తా... నీకు ప్రవేశం ఉండదక్కడ...' అంటూ వెంటనే బయటికి వెళ్లిపోయారాయన..

బెడ్‌పై వాలి హాయిగా మూడు గంటలపాటు నిద్రపోయింది. తిరిగి వచ్చిన నరసింహన్ లేపేదాకా పడుకునే ఉంది...

'సారీ సర్... నిద్ర నా రీఫ్రెషర్, గాఢనిద్ర నా తల్లి. అందుకే ఒళ్లెరగకుండా పడుకున్నాను...' అంటూ ఫ్రెషప్ అయి వచ్చింది దివిజ...

'నువ్వు అడగవని నాకు తెలుసు. నేనే చెబుతున్నా... ఓ వార్ షిప్‌కు కొత్తగా డెవలప్ చేసిన కాళి అనే పేరుగల మైక్రోవేవ్ వర్షన్ గన్ బిగించడానికి ట్రయల్స్

జరుగుతున్నాయి. నేనొచ్చింది అందుకే... పేరుకు ఏదో నౌక జలప్రవేశం అని చెబుతాం... అంతే...' అని నవ్వేశాడాయన...

'అన్నట్టు... నీకు ఆ కొత్త ఆయుధం గురించి తెలుసా...? చెబుతానుండు...' అని ఏదో చెప్పబోయాడు.

'నాకు తెలుసు సార్...' అందామె. ఆయన ఆశ్చర్యంగా చూశాడామెవైపు...

'అత్యంత కీలకమైన స్థానాల్లో ఉన్న వాళ్లకే మొత్తం వివరాలు తెలియవు. ఏదో బేసిక్ వివరాలు మాత్రమే తెలుసు. నీకెలా తెలుసా ఆయుధం?'

'అదే చెప్పాలనుకుంటున్నాను సార్...' అంటూ స్ట్రెయిట్‌గా తను సేకరించిన సమాచారమంతా వేగంగా చెప్పేసింది. 'ఇంకా మన చక్రధర్ కార్డు అనలైజ్ చేయలేదు. బషీర్ సేకరించిన సమాచారం చదివి, అర్థం చేసుకునేలోపు మీరు వచ్చారు... నాకు చాలా సందేహాలున్నాయి... మీరైతేనే సరిగ్గా అనలైజ్ చేయగలరు' అందామె...

కొద్దిసేపు మౌనంగా ఉన్న ఆయన రిటర్న్ జర్నీలో మీ ఆఫీసుకొస్తాను... పోర్టు వద్ద ఆ అధికారిక ప్రోగ్రాం చూసుకుని వెళ్లిపోదాం పద.. అక్కడ మాట్లాడుకుందాం...' అన్నాడాయన. పది నిమిషాల్లో ఇద్దరూ తయారై కారెక్కారు.. పోర్టు చేరేవరకూ ఆయన ఏదో ఆలోచిస్తూనే ఉండిపోయారు... ఆయన మౌనం చూసి దివిజ కూడా ఏమీ మాట్లాడకుండా కూర్చుంది...

'చూడమ్మా... మన రక్షణ అవసరాలు, మన కొనుగోళ్ల ప్రాధాన్యం మన పాలసీ మేకర్లకు సరిగ్గా అర్థం కాదు... అఫ్ కోర్స్ ఇక్కడా కుంభకోణాలు, నిధుల దుర్వినియోగం ఉంది. మొత్తం సమాజంలో పెరిగిపోతున్న వ్యక్తిగత అవలక్షణాలకు మన రక్షణ సంస్థలేమీ భిన్నం కాదు... స్వార్థం అంతటా ఉంది, ఇక్కడా ఉంది... కానీ జాతీయ అవసరాల నేపథ్యంలో మొత్తం సిస్టమ్ ఆలోచించాలి... కానీ చిన్న చిన్న ఫైళ్లకు కూడా కొర్రీలు వేస్తున్నారు...'

'దేని గురించి సార్, మీరు చెప్పేది...'

'మనం ఇప్పుడు వెళ్తున్న జలప్రవేశం ప్రోగ్రాం ఉంది చూడు. దాన్ని మనమే సొంతంగా తయారు చేసుకున్నాం. కానీ టెక్నాలజీపరంగా కొన్ని బయట కొంటేనే మనకు ఉపయోగకరం. కేవలం 1760 కోట్ల వ్యయానికి అయిదేళ్లుగా క్లియరెన్స్ రావడం లేదు. మన నేవీ  అవసరాల కోసం 16 మల్టీ రోల్ హెలికాప్టర్లను కొనటానికి 2008లోనే డిఫెన్స్ మినిస్ట్రీ అప్రూవల్ ఇచ్చింది. కానీ మన

బ్యూరోక్రాట్లు ఎటూ తేల్చరు. మనం డబ్బులు ఇవ్వలేదు. అమెరికన్ కంపెనీ సికోర్ స్కై ఇప్పుడు మూడు రెట్లు ఎక్కువ డబ్బు ఇస్తేనే ఛాపర్లను ఇస్తానంటూ కొర్రీ పెట్టింది. దాన్ని సెటిల్ చేసే బాధ్యత నాపై పెట్టారు. నిజానికి దానికీ నాకూ ఏం సంబంధం?' చెప్పారాయన

'మీకు పలానా బాధ్యతలంటూ ఏమీ స్పష్టంగా నిర్దేశించరు కదా సార్... అందుకే ఏ పనైనా చేయాల్సిందే...' అందామె నవ్వుతూ...

'ఎంతో కొంత ఎక్కువ ఇస్తే గానీ డెలివరీ చేయమంటున్నారు వాళ్లు. మరో 6 కొనాల్సి ఉంది. ఇది గాకుండా మేక్ ఇన్ ఇండియా ప్రోగ్రాం కింద కనీసం 123 ఛాపర్లను మనమే సొంతంగా ఇండియాలో నిర్మించాలనే ఆలోచన కూడా ఉంది. 16 ఛాపర్లకే ఇన్నేళ్లు పడితే... మిగతా వాటికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో...? ఇవే కాదు..., ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌కు సంబంధించిన ఫైళ్లకూ ఆర్థిక శాఖ కొర్రీలు పెడుతుంటుంది. యుద్ధం చెప్పిరాదు, మనం సన్నద్ధంగా ఉండటమే చాలా కీలకం. ఈ విషయం ఎక్కడా వాళ్ల బుర్రలకి...' అంటూ తిట్టాడాయన...

'ఇప్పుడు మనం వాడుతున్న ఛాపర్లు ముసలివైపోయాయి. నౌకలనూ ఆధునీకరించాలి. యాంటీ సబ్ మెరైన్ ఛాపర్లు కావాలి. ఒకవైపు చైనా ఇన్ విజిబుల్ సబ్ మెరైన్లు తయారు చేసుకుంటుంటే... మనం ఉన్నవాటినీ మోడిఫై చేయలేకపోతున్నాం. నీకు తెలుసా... రాబోయే పదేళ్లలో మనం 1200 ఛాపర్లను మన మూడు రకాల రక్షణ విభాగాలకు ఇవ్వాలని ప్లాన్. దీనికి లక్షన్నర కోట్లు కావాలి... అయ్యే పనేనా? ఎప్పుడయ్యే పని?' అంటూ నిట్టూర్చాడాయన...

'సర్, నాకో డౌటు. ఆ మధ్య వరుసగా మన సబ్ మెరైన్లలో అగ్నిప్రమాదాలు జరిగాయి. నాకెందుకో యాక్సిడెంటల్ కాదని డౌట్... వరుసగా ఒకే తరహా ప్రమాదాలు తప్పకుండా అనుమానించాల్సిందే కదా సార్...' అందామె...

'నువ్వు చెప్పింది నిజమే. మనకు కోవర్టుల బెడద చాలా ఎక్కువ. కుట్ర అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది... నేవీ ఇంటలిజెన్స్ చూస్తోంది ఆ కేసు... కానీ ఏమీ తేలడం లేదు. ఎవరూ సహకరించరు సరిగ్గా...' అంటూ సాలోచనగా ఆమె వైపు చూశాడు...

ఈలోపు పోర్టు చేరుకున్నారు. ఆ నౌక జలప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆడంబరమైన పార్టీ కూడా జరిగింది. నరసింహన్

బిజీబిజీగా ఉన్నా... ఆమెకు వేరే పనేమీ లేకపోవడంతో రకరకాల డిషెస్, మాక్ టెయిల్స్‌తో పార్టీని ఫుల్ ఎంజాయ్ చేసింది. తెల్లారగట్ల తిరిగి హైదరాబాద్ వెళ్లే విమానం ఎక్కారు ఇద్దరూ...

❄ ❄ ❄

నిజానికి మీ ఆఫీసుకే వెళ్దామనుకున్నాం గానీ, వద్దు... హోటల్ కే వెళ్దాం...' అంటూ తను రెగ్యులర్‌గా దిగే హోటల్ పేరు చెప్పాడు ఆమెకు. ఇద్దరూ ఆమె కారులోనే హోటల్ చేరుకున్నారు.

'ఇప్పుడు చెప్పమ్మా నీ సందేహాలేమిటో...'

'హైదరాబాద్ లో ప్రయోగాలు కీలకదశకు చేరుకున్నాయి కాబట్టి ఇక్కడే స్పయింగ్ స్పీడందుకుందని నాకు అర్థమవుతూనే ఉంది. కానీ అంత సమాచారం వచ్చేశాక బషీర్ ఎందుకు తనపై అధికార్లకు రిపోర్ట్ చేయలేదు...?'

'చాలా సింపుల్... అతను డబుల్ క్రాస్ కోసం ప్రయత్నించాడు. ఆ సమాచారాన్ని బేరం పెట్టాడు... అంతే... ఇలాంటివి సహజంగా దాగవు. స్పయింగ్ ఫీల్డ్‌లో ఇది ఇట్టే బయటపడుతుంది. కాన్ఫిడెన్షియల్ బ్రోకర్లు (కంట్రాక్టర్లు) దొరికితేనే సేఫ్‌గా బయటపడతారు. చైనీస్ ఇంటలిజెన్స్ సర్వీస్ వాడి వద్ద ఉన్న సమాచారం తీసుకుని, ఖతం చేసేయమని చెప్పింది. ఆ ఆపరేషన్ సరిగ్గా నిర్వహించలేక వాళ్ల ఏజెంట్లు బషీర్‌ను ఖతం చేశారు కానీ సమాచారం సేకరించలేకపోయారు...'

'బషీర్ పేరు పాకిస్థానీలా ఉంది కదా... చైనీస్ ఏజెంట్ పేరులా లేదు...'

'అంటే చైనాలో ముస్లిములు లేరనా నీ ఉద్దేశం..? '

'అలా అని కాదు..., మరి జెడ్ టీవీ ఎండీ పాత్ర ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవైపు బషీర్ తన కంటాక్టు కోసం ట్రయి చేశాడు. ఇంకోవైపు ఈ ఎండీ చైనీస్ ఏజెంట్లకు సహకరిస్తున్నాడు... ఇదెలా...?'

'డబుల్ క్రాస్ చేస్తున్న వ్యక్తుల్లో ఎండీ కూడా ఒకడు. ఐతే దేంట్లోనూ నేరుగా జోక్యం చేసుకోడు. చైనీస్ ఏజెంట్లకు కావల్సిన అన్ని సహకారాలు అందిస్తూ ఉంటాడన్నమాట... ఇలాంటివాళ్లు మన దేశంలో చాలామంది ఉన్నారు. ఓ పార్టీలోనైతే ఇలాంటోళ్లు కోకొల్లలు... తను నేరుగా లేడు కాబట్టి స్పై ఫీల్డ్‌లో వాడి పేరు బయటపడలేదు. అందుకే చైనీస్ ఏజెంట్లు కూడా అనుమానించలేదు... బషీర్, ఎండీ జాయింట్ ఆపరేషన్ ఇది... ఎప్పుడైతే బషీర్ చనిపోయాడో ఎండీ

కూడా కిక్కుమనకుండా ఆ ఏజెంట్లు చెప్పిన పని చేస్తూ గుంభనంగా ఉంటున్నాడు...'

'అంత ఈజీగా ఇలాంటి సమాచారం క్రయవిక్రయాలు జరుగుతాయా?'

'డెడ్ ఈజీ. గతంలో డిఫెన్స్ రంగంలో ఏ దేశమైనా సరే ప్రైవేటు కంపెనీలను ఎంటర్ కానిచ్చేది కాదు. టాప్ సీక్రెట్ కాబట్టి రహస్యాలు బయటపడతాయనే భయంతో... కానీ ఇప్పుడు ప్రైవేటు కంపెనీలు తామే కొత్త కొత్త ఆయుధాలు కనిపెట్టి, తయారు చేసి బాహటంగానే దేశాలకు విక్రయిస్తున్నాయి. కంపెనీలు సొంతంగా స్పయింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్న ఫీల్డ్ ఇప్పుడు. అందుకే బ్రోకర్లు, కమీషన్ ఏజెంట్లు ఇక్కడా తయారయ్యారు... జేమ్స్ బాండ్ సినిమాల్లో చూపించినట్టు సూట్ కేసులు మార్చుకోవడం... రహస్యంగా రాత్రివేళ తుపాకులు పట్టుకుని ఒకరిపైనొకరు నిఘా వేసుకోవడం... ఇలాంటివేమీ ఉండవు... ఈమధ్య మరీ ఈ సమాచార మార్పిడి ఈజీ అయిపోయింది. హవాలా పద్ధతిలో చెల్లింపులు నువ్వు కోరుకున్న దేశంలో ఏర్పాటు చేస్తారు... ఓ వెబ్ సైట్ ఓపెన్ చేస్తారు. దానికి పాస్ వర్డ్ ఉంటుంది... ఈ సైట్‌లో ముందే అప్‌లోడ్ చేసి పెడతారు. దాన్ని పబ్లిష్ చేయరు... డబ్బు చెల్లింపులు పూర్తి కాగానే పాస్ వర్డ్ చెబుతారు... దాన్ని బయర్స్ డౌన్ లోడ్ చేసుకోగానే వెబ్ సైట్ క్లోజ్ చేస్తారు...'

'అంతా ఈజీయే గానీ, హాక్ చేసేవారికి ఈ సమాచారం దొంగిలించడం ఈజీయే కదా సార్...'

'అంత టైమ్ ఇవ్వరమ్మా... ఏదో మెమొరీ కార్డులో ఉన్న డేటాను సిద్ధంగా ఉంచుకుంటారు. అటు డబ్బు చెల్లింపు కన్ఫరమ్ కాగానే వెబ్ సైట్‌లోకి అప్ లోడ్ చేయడం, పాస్ వర్డ్ తీసుకున్నవాళ్లు డౌన్ లోడ్ చేసుకోవడం వేగంగా జరిగిపోతాయి... అంతకన్నా ఈజీగా కూడా డేటా మార్పిడి చేస్తున్నారు ఈమధ్య...'

'ఏంటి సార్ అది...?'

'సింపుల్... డ్రాఫ్ట్ మెయిల్స్... జీ మెయిల్, రెడిఫ్ మెయిల్, యాహూ మెయిల్ వంటి పాపులర్ మెయిల్ సర్వీస్ గాకుండా ఏదో ఓ అనామక మెయిల్ సర్వీస్ ఎంచుకుంటారు. సహజంగా రిజిష్టర్ చేసుకుంటారు ఫేక్ పేర్లు, అడ్రసులతో...! ఇవ్వదలుచుకున్న సమాచారాన్ని కంపోజ్ చేసి డ్రాఫ్ట్‌గా సేవ్ చేస్తారు. డేటా కొనుక్కున్నవాళ్లకు ఆ మెయిల్ ఐడీ పాస్ వర్డ్ చెబుతారు. వాళ్లు

ఆ డ్రాఫ్ట్‌లో ఉన్న డేటాను డౌన్ లోడ్ చేసుకుంటారు... ఇంకా ఇలాంటి చిన్న చిన్న మెథడ్స్ చాలా ఉన్నాయి.... దేశాలకు దేశాలు ధ్వంసమయ్యే కీలకమైన విషయాలు కూడా అత్యంత చిన్న చిన్న పద్ధతుల్లో చేరాల్సినవారికి చేరిపోతున్నాయి...' వివరించాడాయన.

'ఇదేకాదు సార్... ఈమధ్య ఓ కేసు డీల్ చేశాను. ఫేస్ బుక్, ట్విట్టర్‌లనూ వాడుకుంటున్నారు... వాటిల్లో సీక్రసీ కష్టం. ఫేక్ అకవుంట్లు ఓపెన్ చేసి, ఎవరికైతే డేటా పంపించాలో ఆ ఖాతాకే షేర్ చేస్తారు. కాకపోతే వీలైనంతవరకూ కోడ్ భాష వాడతారు. ఎవరైనా హ్యాక్ చేస్తే అర్థం గాకుండా...'

'బషీర్ అన్ని వివరాలు ఎలా సేకరించాడు? వీడియోల్లో కనిపిస్తున్న వ్యక్తులు ఎవరు? వాళ్లు చెబుతున్న ఫార్ములాలు, డిజైన్లు వాస్తవమేనా? ఈ విషయాలు నిర్ధారించుకోవాలి సార్...'

'ఆ కార్డు నాకు ఇచ్చెయ్. ఢిల్లీకి వెళ్లిన రెండు గంటల్లో నీకు వివరాలు చెప్పేస్తా...' అన్నాడాయన.

'సరే సార్...' తలూపిందామె.

'నేను నిన్ను మీ ఆఫీసు దగ్గరలో దింపుతాను. కారులో వెయిట్ చేస్తుంటాను. మీ అసిస్టెంట్‌కు ఇచ్చి పంపించు. అక్కడ్నుంచి అటే ఢిల్లీ వెళ్లిపోతాను...' అన్నాడాయన. ఆయన స్నానమయ్యేదాకా ఆగి ఇద్దరూ హోటల్ రూంకే టిఫిన్లు తెప్పించుకుని, తాపీగా బయటికి బయల్దేరారు.

❄ ❄ ❄

ఆఫీసుకెళ్లే దారిలో ఓ ఫర్లాంగు ముందే కారు దిగి, నడుచుకుంటూ వెళ్లింది దివిజ...

తను కాఫీ ఆర్డరిచ్చి, అది రాగానే ... కాఫీ తీసుకొచ్చిన హోటల్ బాయ్‌కు ఓ కవర్ ఇచ్చింది. వంద రూపాయల నోటు కూడా ఇచ్చి వీధి మొదట్లో కారు ఆపుకుని కూర్చున్న నరసింహన్ ఆనవాళ్లు చెప్పి, అతనికి అందచేయమని చెప్పింది.

ఎలాగూ తనపై నిఘా ఉంది. రిస్క్ ఎందుకని ఆ పనిచేసింది...

కొద్దిసేపటికే ఆమెకు నరసింహన్ నుంచి ఓ మెసేజీ వచ్చింది. అందులో కుడిచేతి బొటనవేలిని (థమ్సప్ తరహాలో...) చూపిస్తున్నట్టుగా ఓ బొమ్మ ఉంది. రిసీవ్డ్ అని అర్థం చేసుకుని దాన్ని డిలిట్ కొట్టేసింది ఆమె.

యాదగిరి వేరే కేసుల్లో తిరుగుతున్నాడు. ఆఫీసుకు రాలేదు.

మిగిలిన పని కూడా పూర్తి చేయాలనుకుని, చక్రధర్ దగ్గర దొరికిన కార్డునూ కంప్యూటర్‌కు లింక్ చేసి చదువుతూ కూర్చుంది. అందులో పెద్ద కష్టమేమీ అనిపించలేదు ఆమెకు. సబ్జెక్టు ఇప్పటికే మొత్తం తెలిసినందున చక్రధర్ రాసిన వివరాలు ఇట్టే అర్థమైపోయాయి ఆమెకు. మొత్తం అనలైజ్ చేసి, వేరే సీక్రెట్ ఫోల్డర్‌లోకి కాపీ చేసి పెట్టింది. చైనీస్ ఏజెంట్లు ఏ రకంగా ఆపరేషన్ నిర్వహించారో పూర్తి వివరాలు అందులో ఉన్నాయి. తను పై అధికారులకు పంపాల్సిన రిపోర్టు కూడా రెడీ చేసుకున్నాడు. ఐతే బషీర్, టీవీ ఎండీ కలిసి డబుల్ క్రాస్ చేసి, తాము సేకరించిన ఇండియన్ న్యూ వెపన్ సీక్రెట్లు బయటి దేశాలకు అమ్ముకునే ప్రయత్నాలను మాత్రం తను పసిగట్టలేదు. బషీర్‌పై నిఘా వేసి మొత్తం తన డ్యూటీని త్వరలో పూర్తి చేసుకునే తరుణంలోనే హతమారిపోయాడు తను...

తను సేకరించిన సమాచారంలో అత్యంత ముఖ్యమైంది. మన అణు శాస్త్రవేత్తలకు ఏ మాత్రం భద్రత లేకపోవడంతో విదేశీ ఏజెంట్లకు ఇట్టే దొరికిపోతూ, ఏవో భయాలకు లోనై రహస్యాల్ని వెల్లడిస్తున్నారు. కొందరైతే కోవర్టులుగా మారి డబ్బు ఆశకు లొంగిపోతున్నారు.

ఐతే బషీర్ తీసిన వీడియోల్లో ఉన్నది మనదేశ శాస్త్రవేత్తలన్నమాట... అనుకుంది దివిజ...

నలుగురు గూఢచారులు ఒక ముఠాగా మారి హైదరాబాద్‌లో తిష్ట వేసి ఇండియా సీక్రెట్స్ కోసం ప్రయత్నిస్తున్నారు. లోకల్‌గా ఉంటున్న ఇద్దరు చైనీయుల సాయం తీసుకుంటున్నారు. స్థూలంగా ఆమెకు అర్థమైంది అదీ...

ఎలాగైనా ఆ కార్డును రా చీఫ్ నరసింహన్‌కు అప్పగించాలి...

ఇదంతా పూర్తిచేసేసరికి లంచ్ సమయం కావొచ్చింది. ఈలోపు యాదగిరి కూడా వచ్చాడు. ఇద్దరూ కలిసి పాత కేసుల ప్రోగ్రెస్ చూస్తూ, అవసరమైన కొన్ని సలహాలు ఇచ్చింది ఆమె... ఒకసారి ద్వివేదీని చూసొద్దామని యాదగిరిని కారు తీయమని చెప్పింది ఆమె...

❄ ❄ ❄

చాలావరకూ కోలుకున్నాడు ద్వివేదీ. ఢిల్లీ వస్తానంటే నరసింహనే వద్దన్నాడు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి వైద్యం దొరుకుతుందని ఆయనకు బాగా తెలుసు.

'ఎలా ఉంది..?' అంటూ లోపలికి వచ్చింది దివిజ. తలగడను కొంచెం వాలుగా తలకింద పెట్టుకుని టీవీలో న్యూస్ చూస్తున్నాడు తను... నవ్వుతూ 'బెడ్‌పై పనిలేకుండా కాలం గడపడం నిజంగా నరకమే మేడమ్...' అన్నాడు.

'కోలుకోవడమే నీ పని... పనిలేదని ఎవరన్నారు?' అంటూ తనూ నవ్వేసింది. యాదగిరి అక్కడే ఉన్నాడు...

తను విశ్లేషించిన వివరాలు మొత్తం చెప్పేసింది ఆమె.

'ఫర్దర్‌గా ఏం చేయమంటారో మా బాస్‌నే అడగడం మేలనిపిస్తోంది...' అని అభిప్రాయపడ్డాడు తను...

'తనే చెబుతానన్నాడుగా... తొందరెందుకు, వెయిట్ చేద్దాం... టేక్ రెస్ట్...' అని ఇంటిదారి పట్టింది ఆమె...

❄ ❄ ❄

సాయంత్రం వేళ మొబైల్‌కు నరసింహన్ నుంచి 'స్కైప్' గుర్తు మెసేజీ రూపంలో వచ్చింది... ఓహో, స్కైప్‌లోకి రమ్మంటున్నారా? అనుకుని.... తను అరుదుగా ఆల్ ఇన్ వన్ కోసం వాడే లైన్‌ను కంప్యూటర్‌కి కనెక్టు చేసింది. నరసింహన్ ఆఫీస్ ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. స్కైప్ ఇంటర్ నెట్ ఆధారంగా పనిచేసే సర్వీస్... తను చేస్తున్నది వీడియో కాల్... నరసింహన్ తెరపైకి వచ్చాడు...

'వీడియోల్లో ఉన్నది మన శాస్త్రవేత్తలే... హైదరాబాద్‌కు డిప్యూటై పనిచేస్తున్నారు. కానీ వాళ్లు ఒరిజినల్‌గా బార్క్ సైంటిస్టులు. ఈ కొత్త వెపన్ ఆపరేషన్ కోసం ఎన్నికైనా ఎఫీషియెంట్ సిబ్బందిలో వాళ్లూ ఉన్నారు. బాడ్ లక్ ఏమిటంటే వాళ్లిద్దరూ ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నారు. నాకు డౌటుంది కానీ, దానిపై దర్యాప్తు ఇంకా స్టార్ట్ చేయలేదు...' అని క్లారిటీ ఇచ్చాడు ఆయన.

'మన ఏజెంట్ చక్రధర్ కార్డు రీడింగ్ కూడా అయిపోయింది సార్... అవి హత్యలే. రహస్యాలు రాబట్టుకుని చైనీస్ ఏజెంట్లు హతమార్చి ఆత్మహత్యలుగా అందరూ పొరబడే సీన్లు క్రియేట్ చేశారు. చక్రధర్ పరిశోధన కూడా అదే. అంత తేలికగా మన సైంటిస్టులు ఎలా దొరికారనేది అర్థం కావడం లేదు నాకు. పైగా ఎన్ఎఫ్ సీలో భద్రత బాగా కట్టుదిట్టంగా ఉంటుంది...' అందామె.

కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉన్న ఆయన... 'కొద్దిరోజుల క్రితం మహారాష్ట్ర హైకోర్టులో ఓ పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్) ఫైలయింది తెలుసా నీకు...? నిజంగా మన సర్కారుకే ఎంబరాసింగ్‌గా ఉంది ఇది. ఆ పిల్ ఏమిటంటే 2009,

2010 సంవత్సరాల్లో పలువురు అణుశాస్త్రవేత్తలు అనుమానాస్పదంగా మరణించారనీ, దానిపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలనీ పిటిషన్ దారులు కోరారు... ఆత్మహత్యలుగా నమోదవుతున్నాయనేది వారి ఆందోళన. ముంబై కోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా ఇచ్చింది. ఏం భద్రత కల్పిస్తున్నారో, అసలు ఆ మరణాలపై నిజాలేమిటో చెప్పాలని ఆదేశించింది.... ప్రత్యేకంగా ఓ దర్యాప్తు బృందాన్ని కూడా వేసి, ఆ మరణాలపై విచారణ జరపాలని కూడా పేర్కొంది.'

'అంత సీరియస్ విషయం నాకు పత్రికల్లో గానీ, చానెళ్లలో గానీ కనిపించలేదు సార్...'

'ముందే చెప్పాను కదా నీకు... అది ఓ దందా... సన్నీలియోన్ సినిమాను ఎందుకు సెన్సార్ బోర్డు నిలిపేసిందనేది వాళ్లకు వార్త గానీ, అణుశాస్త్రవేత్తల అనుమానాస్పద మరణాలు వారికి వార్త కాదమ్మా... సోషల్ యాక్టివిస్టు చేతన్ కొఠారి వేసిన పిల్ అది. అప్పటిదాకా ఎవరికీ అంతటి సీరియస్ విషయం తలకెక్కలేదు చూడు... ఇంకా ఘోరం ఏమిటంటే స్థానిక పోలీసులు వాటిని ఆత్మహత్యలుగా నమోదు చేసుకుంటున్నారు లేదా 'అన్ ఎక్స్‌ప్లెయిన్డ్' అని రాసి క్లోజ్ చేసేస్తున్నారట... రేడియేషన్ నుంచి రక్షించే సూట్లు సరిగ్గా లేవా, రేడియేషన్ వల్ల కేన్సర్లు వంటివి కబళించి మరణిస్తున్నారా, బయటి శక్తుల ప్రభావం ఉందా, వాళ్లు పనిచేసే ఆవరణలో వాళ్లకు ఏర్పాటు చేసిన భద్రత ఏమిటి... ఇలాంటి కీలకమైన ప్రశ్నలను లేవనెత్తింది ఆ పిల్..'

'రియల్లీ శ్యాడ్ సార్... కొంపదీసి మీకూ ఆ దర్యాప్తు బాధ్యతలేమీ ఇవ్వలేదు కదా...' అనడిగింది ఆమె

'అది సీబీఐ వాళ్లు చూసుకుంటారులే... అది ఎన్నటికి పూర్తయ్యేది మనం చెప్పలేం, తెలుసు కదా...' అని ఆయన మరిన్ని వివరాలు చెప్పసాగాడు....

'2010 లోనే కొఠారీ సమాచార చట్టం కింద దరఖాస్తు చేసుకున్నాడు. బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్‌లో గత 15 సంవత్సరాల్లో ఎందరు ఇలా అనుమానాస్పద మరణాలకు గురయ్యారో చెప్పాలనేది ఆయన దరఖాస్తు... దానికి కేవలం అయిదుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారనే సమాధానం వచ్చిందాయనకు. మరింత లోతుగా వెళ్లేందుకు సిద్ధమైన ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్, బరోడాలోని హెవీ వాటర్ ప్లాంటుల నుంచి సేమ్ సమాచారం

కావాలంటూ మరో దరఖాస్తు చేశాడు... ఇదీ దుస్థితి...' అంటూ నిట్టూర్చా డాయన...

'మన ఖగోళ శాస్త్రవేత్తలు, డిఫెన్స్ నిపుణుల భద్రత కూడా ముఖ్యమే కదా సార్... అదేగాకుండా కోవర్టు ఆపరేషన్ ఎవరూ చేయకుండా వాళ్ల నుంచి ఎలాంటి సమాచారం ఎటూ పోకుండా కూడా జాగ్రత్తలు అవసరం. కీలకమైన డేటా పరిరక్షణ కూడా చాలా పెద్ద సబ్జెక్టు...' అందామె

'ఎస్, రేపు కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ మీటింగ్ ఉంది. దీనిపైనా చర్చ జరగొచ్చు...'

'సార్, ఒక్క నిమిషం...' అంటూ ఆయన్ని లైన్‌లోనే ఉంచి... కంప్యూటర్ డ్యుయల్ స్క్రీన్ ఆన్ చేసింది. అప్పటికప్పుడు వెబ్ సైట్ ఒకటి క్రియేట్ చేసింది. దానికి పాస్ వర్డ్ జనరేట్ చేసింది... వెబ్ సైట్ పేరు, పాస్ వర్డ్ చెప్పింది ఆయనకు...

చక్రధర్ రిపోర్టు, కార్డులో ఉన్నది యథాతథంగా ఆ వెబ్ సైట్‌లోకి అప్ లోడ్ చేయటానికి ప్రయత్నించింది... కానీ సక్సెస్ ఫుల్‌గా అప్ లోడ్ కావడం లేదు. కొద్దిసేపు కాగానే 'ప్లీజ్ ట్రై అగెయిన్...' అంటూ ఎర్రర్ మెసేజీ వస్తోంది...

ఇలా పదేపదే సతాయించేసరికి ఆమె ఇబ్బందిగా ఫీలైంది. అంత పెద్దమనిషిని లైన్‌లోనే ఖాళీగా ఉంచి, ఆ చిన్న పని చేయలేకపోవడం ఆమెకు చిరాకెత్తించింది. 'జస్ట్, వన్ మినట్ సార్...' అంటూనే మళ్లీ మళ్లీ ప్రయత్నించింది కానీ కుదరలేదు... ఈలోపు ఆయన ఆఫీసులోనే ఓ ఐటీ నిపుణుడిని పిలిచాడు తన రూంలోకి... స్కైప్ కెమెరా ముందుకొచ్చిన ఆయన ప్రాబ్లమేంటని అడిగాడు... క్లుప్తంగా తను చేయదలుచుకున్నది చెప్పింది...

మీరో పని చేయండి... మీ సిస్టంలో టీం వ్యూయర్ ఉందా?' అడిగాడతను...
'లేదు, పెద్దగా అవసరం రాలేదు. అందుకని ఇన్‌స్టాల్ చేయలేదు...' అందామె.

'చిన్న ఫైలే ఇన్‌స్టాల్ చేసి, ఓ కోడ్ వర్డ్ వస్తుంది నాకు చెప్పండి...' గైడ్ చేశాడతను. ఆ ప్రోగ్రాం గురించి ఆమెకూ తెలుసు. కానీ ఎప్పుడూ వాడే అవసరం రాలేదు. అతను చెప్పినట్టే ఆ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి, ఆన్ చేసి, కోడ్ వర్డ్ చెప్పింది. కొద్దిక్షణాల్లోనే ఆమె కంప్యూటర్ నరసింహన్ పర్సనల్ కంప్యూటర్‌కి లింకైపోయింది. అంటే... ఆ ప్రోగ్రాం రన్ అవుతున్నంతసేపూ ఢిల్లీ నుంచే రిమోట్ కంట్రోల్‌లాగా ఆమె కంప్యూటర్‌ను ఆపరేట్ చేయగలరు...

ఆ ఐటీ ఎంప్లాయీ ఆమె కంప్యూటర్‌ను చెక్ చేసి, ఓ పవర్ ఫుల్ ఫైర్ వాల్‌తో లింక్ చేశాడు. ఫైర్ వాల్ అంటే సర్వర్ల స్థాయిలోనూ వైరస్ రాకుండా అడ్డుకుంటుంది. స్పామ్‌ను అసలు సిస్టంలోకే ఎంటర్ కానివ్వదు. వైరస్‌లు, హ్యాకింగ్ బెడద తీవ్రత ఎక్కువయ్యే కొద్దీ ఈ ఫైర్ వాల్ కెపాసిటీ కూడా పెంచుకుంటారు. ప్రైవేటు ఫైర్ వాల్ సప్లయిర్స్‌ను నమ్మకుండా కీలకమైన భద్రత సంస్థలకు ఇండియన్ ఐటీ డిపార్ట్‌మెంట్ సొంతంగా పవర్‌ఫుల్ ఫైర్ వాల్‌ను రూపొందించి ఇచ్చింది. ఐనా సరే... పాకిస్థాన్, చైనా, అమెరికా హ్యాకర్లకు అది తట్టుకోలేకపోతోంది...

చకచకా ఆమె కంప్యూటర్‌ను క్లీన్ చేసిన ఆయన, తరువాత పాస్ వర్డులనూ మార్చుకోమని సూచించాడు. ఆమె చెప్పిన డేటాను వెబ్‌సైట్‌లోకి అప్ లోడ్ చేశాడు...

అప్పటిదాకా లైన్‌లోనే ఉండి ఆ పనిని చూస్తున్నాడు నరసింహన్.

'సర్, ఆ మొత్తం డిటెయిల్స్ మీకు చేరాయి. ద్వివేదీ కోలుకుంటున్నాడు. ఇందాకే వెళ్లి చూసొచ్చాను... ఈ కార్డు డిస్పోజ్ చేసేస్తున్నాను... మీరు నాకు అప్పగించిన డ్యూటీ అయిపోయినట్టే కదా సార్...' అనడిగింది ఆమె.

ఇంకేమైనా ఉంటే ఆయనే చెబుతాడు కదానే భావనతో...

'టెక్నికల్‌గా పూర్తయినట్టేనమ్మా... అసలు వాళ్ల ఆలోచన ఏమిటో, ఏం చేస్తున్నారో తెలిసిపోయింది... కానీ అసలు ప్రమాదం ఇప్పుడే ఉంది...' అన్నాడాయన.

ఆశ్చర్యంగా చూసిందామె ఆయనవైపు...

❄ ❄ ❄

నిజంగానే నీకు చెప్పిన పని పూర్తయినట్టే... నిజానికి నీ డ్యూటీ కాదు, రిస్క్ ఎక్కువ... ఐనా దేశంపై కన్సర్న్, ప్రొఫెషన్ పట్ల డెడికేషన్‌తో నేను చెప్పానని చేశావు. ఇలాంటి అసైన్‌మెంట్లే నీ ప్రతిభకు మెరుగుపెట్టేవి. థాంక్సమ్మా...' అన్నారు నరసింహన్.

'కానీ మీరు అసలు ప్రమాదం ఇప్పుడే ఉందని అన్నారు...' అడిగింది దివిజ.

'వాళ్లు తెలుసుకోవాలనుకున్న ఇండియన్ న్యూ వెపన్ సీక్రెట్స్ ఏంటో

వాళ్లకు చేజిక్కినట్టే చిక్కి జారిపోయాయి. వాళ్లు తెలుసుకున్న సమాచారమంతా మన వద్దకు వచ్చేసింది. కానీ ఆ చైనీస్ ఏజెంట్లు నువ్వు బషీర్ విషయంలో ఏదో ట్రేస్ చేసి ఉంటావనే నమ్ముతారు. సో, నీకు థ్రెట్ ఉంది... భయపెట్టడానికి చెప్పడం లేదు. జస్ట్, అనలైజ్ చేస్తున్నానంతే...'

'అది నిజమే సార్...' అంగీకరించిందామె.

'ఒకవేళ ఆపరేషన్ ఫ్లాపయినట్టు గనుక ఒక్కసారి తేల్చుకుంటే వాళ్ల ఏజెన్సీ మరికొందరితో ఫ్రెష్‌గా స్టార్ట్ చేస్తుంది. ఏదో స్వల్ప హింట్లు లేనిదే వాళ్లు ఆ పని మొదలుపెట్టరు కదా... సో, అగెయిన్... మన సీక్రెట్లకు స్పయింగ్ ప్రమాదం ఉన్నట్టే... స్పయింగ్ ఫీల్డ్‌లో ఇంకా ఏమాత్రం మన వెపన్ గురించి ఉప్పందినా ఈసారి పాకిస్థాన్, అమెరికాలు మొదలు పెడతాయి... అప్పుడు మరింత డెలికేట్‌గా మారుతుంది...'

'అదీ నిజమే సార్... ఆ వెపన్ గురించిన సీక్రెట్స్ బయటపడటం మంచిది కాదు. అవి ఇంకా పరీక్షల దశలోనే ఉన్నాయి. వివరాలు బయటపడితే దానికి విరుగుడు కనిపెట్టేస్తారు వాళ్లు... మరింత కట్టుదిట్టమైన రక్షణ మధ్య మాత్రమే మన వెపన్ పరీక్షలు జరగడమొక్కటే దీనికి సొల్యూషన్ అనిపిస్తోంది సార్...'

'యువార్ రైట్... నీకు ఇవ్వమని ఆ కాఫీ బాయ్‌కు ఓ చిన్న బాక్సు ఇచ్చాను. చూశావా...?' అనడిగాడు ఆయన.

'లేదు సార్... టేబుల్‌పై పెట్టి మరిచిపోయాను...'

'తీసుకొచ్చి విప్పి చూడు...'

వెళ్లి పాకెట్ తీసుకొచ్చి విప్పింది. అదేమిటో ఆమెకు అర్థం కాలేదు. క్వశ్చన్ మార్కులా మొహం పెట్టింది.

'అది మన డిఫెన్స్ రీసెర్చ్ వింగ్ తయారు చేసిన కొత్త షార్ట్ వెపన్. యుద్ధ అవసరాల కోసం కాదు, వీవీఐపీల సెక్యూరిటీ కోసం రూపొందించింది. అది అందుకే అంత చిన్నగా అరచేతిలో ఇమిడిపోయేంత సైజులో ఉంది... కొందరు ఏజెంట్లకు ఇచ్చాం. కొన్ని పీఎం సెక్యూరిటీ స్టాఫ్‌కు ఇచ్చాం... నో సౌండ్, నో గన్ పౌడర్, నో ఫైర్, నో స్మోక్, నో హీట్... ఇంకా చాలా నో నో ఉన్నాయి... జాం కూడా కాదు, కాబట్టి అసలు క్లీనింగే అవసరం లేదు...'

'అంటే అసలు తుపాకే కాదా?' నవ్వుతూ అడిగింది. చేతిలోకి తీసుకుని చూసింది.

'చాలా ఈజీ ఆపరేషన్ లే... నేను చెబుతాను... ఒక అమెరికన్ ప్రైవేటు డిఫెన్స్ కంపెనీ డ్రెడ్ పేరిట ఓ గన్ తయారు చేసింది. దాన్నే మనవాళ్లు బాగా మోడిఫై చేసి లేజర్ బీమ్స్ ఉత్పత్తి చేయగల మినీ గన్‌లా మార్చారు... ఎయిమ్ అండ్ క్లిక్... కొన్ని కిరణాలు టార్గెట్‌ను తాకతాయి... అంతా సైలెంట్ ఫైరింగ్ అన్నమాట... ఒక్కసారి ఛార్జి చేసుకుంటే చాలు, ఏడాదిపాటు అలాగే ఉంటుంది అది... అందులోనే ఓ చిన్న జీపీఎస్ చిప్ కూడా ఉంటుంది. అంటే దాని లొకేషన్ ఏమిటో కూడా చూపిస్తుంటుంది....'

'వావ్... సూపర్ సార్... రియల్లీ వండ్రఫుల్. వీవీఐపీల సెక్యూరిటీకి నిజంగా బాగా యూజ్ ఫుల్...'

'నీ దగ్గర ఉంచుకో... ఇవి లెక్కలోకి వచ్చేవి కావు. అమ్యూనిషన్ కూడా ఉండదు కాబట్టి అసలు లెక్కే అవసరం లేదు...' అంటూ దాని ఆపరేషన్ ఎలాగో కొన్ని వివరాలు చెప్పాడాయన...

'అన్నట్టు... ద్వివేదీని ఇక్కడికి రప్పించేస్తున్నాను. సాయంత్రం పీఎం దగ్గర జరిగే మీటింగ్ లో డిస్కషన్ బట్టి మళ్లీ మనమేం చేయాలో ఆలోచిద్దాం... వాళ్లు నీదగ్గర ఏదో ఉందని భ్రమతో నీవెంట పడితే తప్ప ఇక వేరే ప్రమాదం లేదు. అందుకని నువ్వు ఈ ఆపరేషన్‌లో లేవనీ, నీ రొటీన్ కేసులేదో చూసుకుంటున్నావని భ్రమపడేలా వాళ్లను మిస్ లీడ్ చేయాలి... ప్రస్తుతానికి అదే మార్గం... నీ మొబైల్ నుంచి నాకు కాల్ చేయి, రెండు మూడు మెసేజీలు పెట్టు. ఇదేమీ తేలేట్టు లేదని, మీ ఏజెంట్లను వేరే పంపించి ఎంక్వయిరీ చేయించుకొమ్మని! ఎలాగూ అవి వాళ్లకు చేరతాయి... ఆ ఫోన్ రీబూట్ చేయించి, నాలుగు రోజులు ఎక్కడైనా పడెయ్...' అని వివరించాడాయన.

'ష్యూర్ సర్...' అంటూ స్కైప్ కాల్ కట్ చేసి, కంప్యూటర్‌ను స్లీప్ మోడ్‌లోకి మార్చింది. తన మొబైల్ నుంచి కాల్ చేసింది. ముందు అనుకున్నట్టుగానే ఇలా మాట్లాడుకున్నారు...

'సర్, నేను దివిజను మాట్లాడుతున్నాను సార్...'

'ఓహ్, దివిజా... ఏమైందమ్మా, నీకు చెప్పిన పనిలో ఏమన్నా ప్రోగ్రెస్ ఉందా?'

'లేదు సర్, నేనేమో ప్రైవేటు డిటెక్టివ్‌ను. మొన్న పార్కులో తృటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పట్నుంచీ రిస్క్ ఎందుకనుకుని పోలీసులు పెద్దగా

కోఆపరేట్ చేయడం లేదు. మీ ఏజెంట్ బెడ్ మీద పడ్డాడు. ఇంకో ఏజెంట్ మర్డరై పోయాడు. నా రొటీన్ కేసులూ పెండింగ్‌లో పడిపోయాయి. బషీర్‌ది ఆత్మహత్య కాదు, హత్యేనని నా నమ్మకం సార్. కానీ ఎవరు చేశారో, ఎందుకు చేశారో బయటపడటం కష్టం. అసలు ఒక్క హింట్ కూడా దొరకడం లేదు. నేనూ రూం మొత్తం థరోగా చెక్ చేశాను. మీ ఏజెంట్ మరణం మరీ మిస్టీరియస్‌గా ఉంది. అడుగు ముందుకేయాలన్నా ఒక్క సోర్సూ దొరకడం లేదు...'

'సరేలేమ్మా... నీకూ లిమిటేషన్స్ ఉన్నాయి కదా... నీకు శ్రమ ఇచ్చినందుకు సారీ అమ్మా... మాకూ ఇప్పుడు వేర్వేరు పనులు వచ్చిపడ్డాయి. నాలుగు రోజులాగి వేరే టీం ఫామ్ చేసి ఇన్‌వెస్టిగేట్ చేయించుకుంటాను...'

'సరే సార్... బై బై' అని ఫోన్ పెట్టేసింది... ఫోన్‌లో ఉన్న కంటాక్ట్సు, డేటా, యాప్స్ ఎట్సెట్రా అన్నీ జీమెయిల్‌కు లింకై ఉంటాయి. వేరే ఫోన్‌లోకి సిమ్ మార్చి ఆన్ చేయగానే అవన్నీ రీస్టోర్ అవుతాయి. ఇంట్లో వాడకుండా పడేసిన ఓ కొత్త ఫోన్‌లోకి సిమ్ మార్చేసింది. ఓ చోరీ కేసును సక్సెస్ ఫుల్‌గా డీల్ చేసి కోట్ల లబ్ధి చేకూర్చినందుకుగాను ఓ జ్యూయెలరీ యజమాని దాన్ని ఫీజుకు అదనంగా కొనిచ్చాడు... పాత ఫోన్ రీబూట్ నొక్కింది. అన్నీ డిలిటై పోయాయి. హ్యాక్ కావటానికి ఉపయోగపడిన స్పామ్ ప్రోగ్రాం, పాస్ వర్డుల క్యాచె వంటివన్నీ పోయాయి. ఆ ఫోన్ ఆఫ్ చేసి, బాక్సులో పెట్టి ఓ టేబుల్ డ్రాలో పడేసింది.

కొత్త ఫోన్ ఆన్ చేసి, మెయిల్ ఐడీని యాక్టివేట్ చేసేసరికి పాత డేటా అంతా రీస్టోరైపోయింది. తనకు తెలిసిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇటీవల ఓ చిన్న చిప్ ఇచ్చాడు తనకు. నిజానికి చిప్ అనడంకన్నా దాన్ని ఓ స్టిక్కర్ అనడం కరెక్టు. దాన్ని ఫోన్ వెనుక కవర్ వెనకాల అతికించింది. అది జీపీఎస్‌తో పనిచేసే చిన్న పరికరం. ఒకసారి యాక్టివేటైతే చాలు, భూగోళంలో ఆ ఫోన్ ఎక్కడుందో కనిపెట్టొచ్చు. దాని నంబర్ తన కంప్యూటర్‌కు అనుసంధానించింది. దాని నంబర్ యాదగిరికీ తెలుసు. ఓ యాప్ ఆన్ చేసి ఆ జీపీఎస్ నంబర్ ఎంటర్ చేస్తే చాలు, మన లొకేషన్ అక్కడ కనిపిస్తూ ఉంటుంది. దాన్ని జీమ్యాప్స్ యాప్‌కు సింక్రనైజ్ చేశారు కాబట్టి, ఆ ఫోన్ లొకేషన్ ఎక్కడ ఉన్నదో, ఎలా వెళ్లాలో నేవిగేట్ కూడా చేస్తుందది...

జిమ్ రూంలోకి వెళ్లింది... తన ఇంట్లోనే చిన్న జిమ్ ఉంది ఆమెకు. రోజూ పొద్దున వాకింగ్, యోగా వంటివేమీ చేయదు ఆమె. తప్పకుండా ఫలానా

టైంలోనే ప్రాక్టీస్ చేయాలని ఏమీ లేదు. తీరిక దొరికినప్పుడు కొన్ని ముఖ్యమైన కిక్స్ ప్రాక్టీస్ చేస్తుంది. కటాస్ (మార్షల్ ఆర్ట్స్‌లో స్టెప్పులు) కూడా చేస్తుంది. దాంతో ఆటోమేటిక్‌గా శరీరం ఫిట్‌గా ఉంటుంది. మూడు గంటలపాటు ఏకధాటిగా ప్రాక్టీస్ చేసింది...

తరువాత స్నానం చేసి, బెడ్‌పై పడిపోయి గాఢనిద్రలోకి జారిపోయిందామె...

* * *

'చమన్ లాల్ సేట్‌కు సంబంధించిన రేవతి మైనింగ్ కంపెనీ కేసుపై ఏమైనా దొరికిందా?' అడిగింది యాదగిరిని.

'ఆం ... చాలావరకూ దొరికాయి వివరాలు. ఆయన పార్టనరే చేస్తున్నాడు. చాలా ప్లాన్డ్‌గా... మైనింగ్ బిజినెస్‌లో ఆయన ప్రత్యర్థి సేట్ షెకావత్... ఆయనది బాలాజీ మైనింగ్ ఏజెన్సీస్... ఆయన డబ్బు సమకూరుస్తుంటే చమన్ లాల్ పార్టనర్ ప్రదీప్ సేట్ ఆపరేట్ చేస్తున్నాడు...'

'కొంచెం డిటెయిల్డ్‌గా చెప్పు... ఆధారాలున్నాయా?'

'కంపెనీల రిజిస్ట్రార్ దగ్గర కొంత సమాచారం తీసుకున్నా. ఇవీ కాగితాలు. మొత్తం పది చిన్న కంపెనీలు ఫ్లోట్ చేశారు. నాలుగైదు కంపెనీలకు ఒకే అడ్రస్... వాటిల్లోకి కొన్ని ఆసియన్ దేశాల ద్వారా పెట్టుబడులు తెప్పించుకున్నట్టు చూపించారు... ఆ డబ్బుతో స్టాక్ మార్కెట్‌లో ఆ రేవతి మైనింగ్ షేర్లను కొనిపిస్తున్నారు..'

'నాకు తెలిసిపోయిందిలే... అవన్నీ సూట్ కేసు కంపెనీలు. పన్ను ఎగవేతకు, బ్లాక్ మనీని వైట్ చేయటానికి అందరూ పాటిస్తున్న రాచమార్గం అదిప్పుడు. అన్నీ తెలిసీ మనవాళ్లు దానిపై ఏమీ మాట్లాడరు. మార్కెట్‌లో ఉన్న షేర్లు కొనేసి, ఆ పార్టనర్ ప్రదీప్ సేట్ తన షేర్లను కూడా కలిపి 65 శాతం దాటిస్తాడు... అంతేనా?'

'అంతే, అంతే... కొందరు బ్రోకర్లు ఈ షేర్ల కొనుగోలుకే ఎక్కువ టైం కేటాయిస్తున్నారు. వాళ్ల పేర్లు ఇవి. 15 రోజుల్లో కొన్న షేర్లు ఇవి... ఇందులో మరో ట్విస్ట్ ఉంది. ప్రదీప్ సేట్ షేర్లలో కొంత శాతం కొనేసి షెకావత్ సేట్ కూడా ఆ కంపెనీలో నేరుగా డైరెక్టర్ కావాలనేది ప్లాన్. తరువాత ప్రదీప్, షెకావత్ కలిసి చమన్ లాల్‌ను సీఎండీ నుండి దింపేయాలనేది ప్లాన్...'

'సరే..., మొత్తం వివరాలు, ఆధారాలు, పేర్లు, ప్లాన్ రాసేసి ఆ కవర్

చమన్ లాల్ సేటుకు రహస్యంగా అప్పగించి రా... నిజాం క్లబ్‌కు రెగ్యులర్‌గా వెళ్తుంటాడు ఆయన. అక్కడే కలుసుకుని ఇచ్చెయ్... బిల్లు కూడా ఇవ్వు...'

ఆ కేసు డిస్పోజ్ చేసి, మరో కేసు గురించి చర్చిద్దామనుకునేలోపు మొబైల్ మోగింది...

మళ్లీ నరసింహనే చేస్తున్నాడు...

'మీటింగ్ అయిపోయిందమ్మా... ప్రధాని, రక్షణమంత్రి, హోంమంత్రి, విదేశాంగమంత్రి, కేబినెట్ సెక్రెటరీ, డిఫెన్స్ సెక్రెటరీ, మరికొందరు నాలాంటి వాళ్లు ఉన్నాం... కీలకమైన పరిశోధనలు సాగుతున్న ప్రతీ సంస్థ రక్షణ బాధ్యతలను ఇకపై సీఆర్ పీఎఫ్ కు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం అందులో ప్రత్యేకంగా ఓ సెల్ క్రియేట్ చేస్తారు...'

'మంచి నిర్ణయం సార్...'

'అన్నట్టు నీ ప్రస్తావన కూడా వచ్చింది. నిన్ను నేరుగా మా సర్వీస్‌లోకి తీసుకుంటే స్పెషల్ ఎగ్జెంప్షన్ ఇస్తూ సంతకం పెడతానన్నారు ప్రధాని... సో, మంచి అపర్చునిటీ... ఏమంటావు?'

'నాకిష్టం లేదు సార్...' అంది దివిజ వెంటనే...

'అదేమిటి? అలా అనేశావ్...?' అడిగాడు నరసింహన్...!

'ఏమీ లేదు సార్... నా యాటిట్యూడ్ మీకు తెలుసు... నాకు నచ్చని పని ఎవరు చెప్పినా నేను చేయను... నా టెంపర్ నాకు తెలుసు... నా మనస్సుకు నచ్చని పనికి కోట్లు ఇచ్చినా నేను జోక్యం చేసుకోను... నెలకు కొన్ని కేసులు కేవలం ఈ కారణంతోనే నేను వద్దనుకుని వదిలేస్తుంటాను... పైగా నాకు ఈ పోస్టులు, పొజిషన్ల మీద నమ్మకాలు లేవు... మీరు ఇవ్వాళ రా చీఫ్‌గా ఉన్నారు. రేపు ఎవరు? నేనంటే పడకపోతే ఎలా? హాయిగా తోచిన పని చేసుకుని బతుకుతున్నాను... నేను మీ ఉద్యోగిగా పనిచేయలేను సార్...' చాలా క్లియర్‌గా చెప్పింది దివిజ నరసింహన్‌తో....

చిన్నగా నవ్వాడు ఆయన...

'ఎందుకు సార్ , నవ్వుతున్నారు... నెలకు నాలుగు పిచ్చి కేసులు చేసుకున్నా చాలు, మా యాదగిరి, నేను బతకడానికి... అధికారిక చట్రంలోకి ఇరికి, ఎవరో చెప్పే దబాయింపు పనులకు మా ఆత్మల్ని చంపుకుని ఎలా పనిచేస్తాం...? అవసరమైతే మేం ఆరు నెలలు ఖాళీగా ఉండగలం... ఏడాదికి ఒక్క మంచి

కేసు చాలు మాకు...' అంటూ చెబుతూనే ఉందామె.

'స్టాప్, స్టాప్.... నాకు తెలుసమ్మా... నీ టెంపర్ ఏమిటో... అందుకే నేనే చెప్పేశాను వాళ్లకు ఆమె అధికారిక చట్రంలో ఇమడదని...! అందుకే ఓ కొత్త ప్రపోజల్ సాక్షాత్తూ ప్రధాని నోటి వెంటే వచ్చింది. వింటే ఆశ్చర్యపోతావు నువ్వు...'

'ఏంటి సార్ అది...?'

'ఔట్ సోర్సింగ్ ఆఫ్ స్పయింగ్...'

'ఇంపాజిబుల్... ఎవరేమిటో తెలియకుండా, ఎవరిని పడితే వారిని స్పై ఏజెంట్లుగా పెట్టుకుంటే ఎంత ప్రమాదం సార్..?'

'అందరినీ ఎందుకు పెట్టుకుంటారు? ఎవరికీ ఏమీ అధికారాలుండవు... జస్ట్, ఔట్ సోర్సింగ్... అంతే... కీలకమైన ఆయుధాల తయారీయే ప్రైవేటు ఏజెన్సీల చేతికి వెళ్లిన తరువాత ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడాలే లేకుండా పోయాయి ఈ ఫీల్డ్‌లో... దేశం పట్ల కమిట్మెంట్ కలిగిన హార్డ్ కోర్ ఏజెంట్లు కావాలిప్పుడు... ఏదో అసైన్‌మెంట్ ఇవ్వగానే నాలుగురోజులు అటూ ఇటూ తిరిగి, ఏదో పిచ్చి రిపోర్ట్ ఇచ్చి జీతాలు తీసుకునే ఏజెంట్లకన్నా నిజమైన దేశభక్తుల్లా పనిచేయగల నిప్పులు కావాలిప్పుడు... ఎలాగూ మా డిపార్ట్‌మెంట్‌లో 6 వేల పోస్టుల ఖాళీ... అవన్నీ ఇప్పటికిప్పుడు నింపలేం... అందుకే ఈ ఔట్‌సోర్సింగ్... ఎవరిని తీసుకోవాలో తేల్చేందుకు ఓ కమిటీ కూడా వేశారు. మిలిటరీ ఇంటలిజెన్స్ చీఫ్, రా చీఫ్, సీబీఐ చీఫ్ ఉన్న కమిటీ అది... '

'అయినా రేప్పొద్దున ఈ ఏజెంట్ల పేరుతో విదేశీ శక్తులు ఎంటరైతే ఎలా సార్...?'

'ఏమీ కాదు... ఓ పని, ఓ బాధ్యత... ఫలితాన్ని బట్టి చెల్లింపులు... అంతే... ఆల్ రెడీ నిర్ణయం జరిగిపోయింది. ఫస్ట్ పేరు నీదే... ఆ జాబితాలో అధికారికంగా చేరింది మొదట నీ పేరే... దీంతో నీకూ అడ్వాంటేజ్. ఏదేని కేసుల్లో దర్యాప్తుకు స్థానిక పోలీసుల నుంచి అడ్డంకులు రాకుండా నీకు ప్రివిలేజ్ ఉంటుంది...'

'కానీ ఎప్పుడైతే ప్రభుత్వ ఏజెంటని బయటికి తెలుస్తుందో... అప్పుడే మా క్రెడిబులిటీ పోతుంది...' నిర్మొహమాటంగా చెప్పింది దివిజ...

'బీ పాజిటివ్ దివిజమ్మా... రేప్పొద్దున నేను ఉండను, ఇంకెవరో వస్తారు... ఎవరెలాంటివారో తెలియదు... నాకంటే నీకు ఎక్కువగా సపోర్ట్ చేసేవాళ్లే రావచ్చు కూడా... సో, డోన్ట్ బీ నెగెటివ్... మన అవసరాలు అలాంటివి...'

'సరే సార్... మీ ఇష్టం... వాళ్లు అప్పగించిన పనైనా మాకు నచ్చితేనే కదా చేసేది... నో ప్రాబ్లం...'

'ఎస్, దట్ షుడ్ బీ ద స్పిరిట్... ఐతే కొంచెం జాగ్రత్తగా ఉండు... నాకెందుకో పాకిస్థాన్, చైనా ఏజెంట్లు నీ దగ్గర ఏవో రహస్యాలున్నాయని నీ వెంటపడే ప్రమాదం కనిపిస్తోంది...'

'నో ప్రాబ్లం సార్... నేను ఫేస్ చేయగలను... కానీ ఈలోపు చైనా మన దేశాన్ని ఏదో ఓ పేరుతో గెలికితే ఎలా అని మథనపడుతున్నాను...'

గట్టిగా నవ్వేశాడు నరసింహన్.

'నేనేమైనా తప్పుగా మాట్లాడానా సార్...?'

'లేదమ్మా... నీ అనుమానం రీజనబుల్. కానీ చైనా ఇప్పుడు తనే దిక్కుతోచని స్థితిలో పడింది. యుద్ధం కాదు కదా, కనీసం చిన్న చిన్న కొట్లాటలకూ సిద్ధంగా లేదు...'

'అదేంటి సార్..?'

'అవునమ్మా... నీకు తెలియని విషయాలు కొన్ని చెబుతాను విను... 'డీఅమెరికనైజ్డ్ వరల్డ్' పేరిట చైనా ఓ అద్భుతమైన వ్యూహాన్ని రచించుకుంది. బ్రహ్మాండమైన ఓ ఆర్థిక వ్యూహానికి పదును పెట్టింది. అమెరికాను ఆర్థికంగా దిగజారేలా చేసి ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగాలనుకుంది... దానికి రకరకాల పేర్లు కూడా పెట్టుకుందిలే... కానీ సహజంగా పెట్టుబడిదారీ దేశం కాదు కదా... ఆచరణలో దెబ్బతిని ఇప్పుడు దిక్కులు చూస్తోంది...'

'అర్థం కాలేదు సార్...'

'వివరంగా చెబుతా విను... చైనా చాలాకాలంగా అమెరికా ఆధిపత్యధోరణికి చెక్ పెట్టాలనుకుంటోంది. దీనికి ఓం ప్రథమంగా డాలర్‌లో భారీగా పెట్టుబడులు పెట్టసాగింది. అమెరికాకే రుణాలు ఇవ్వసాగింది. అమెరికా చైనాకు అప్పు పడిన మొత్తమెంతో తెలుసా... 1.5 ట్రిలియన్ల డాలర్లు... స్థూలంగా దాని ప్లానేమిటంటే... తయారీ పరిశ్రమను విపరీతం చేయడం, ప్రపంచవ్యాప్తంగా దాని సరుకులు డంప్ చేయడం, షాంఘై స్టాక్ మార్కెట్‌ను కొత్త రీతుల్లోకి తీసుకెళ్లి అపారంగా దాని వర్త్ పెంచడం... ఇలాగన్నమాట...'

'నిజానికి ఇవి మన దేశానికీ ప్రమాదకారకాలే కదా సార్... మన వాళ్లకు ఇవి తెలుసా...?'

'గతంలోనైతే ఎవరో రాజకీయ నాయకుడు ఆర్థిక మంత్రి అయ్యేవాడు. రాజకీయ– ఆర్థిక సంయుక్త నిర్ణయాలు తీసుకోలేని అసమర్థులు ఉండేవారు. ఎప్పుడైతే ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టాడో ఇండియా విధానమే మారిపోయింది. ఓ ఆర్థిక కమ్ ప్రణాళికవేత్త మన్మోహన్ సింగ్‌ను ఆర్థిక బాధ్యతల్లో పెట్టాడాయన. దేశం పట్ల సమగ్ర, స్థూల దృష్టి కలిగిన నిస్వార్థ నాయకుడాయన... అప్పట్నుంచే సుస్థిర అభివృద్ధివైపు మన ప్రణాళికలు స్టార్టయ్యాయి. ఫలితంగా మనం ఇప్పుడు ప్రపంచంలోకెల్లా అత్యధిక స్థూల ఉత్పత్తి ఆశిస్తున్న దేశంలో నంబర్ వన్ అయ్యాము. మనకన్నా చైనా ఎంతో దిగువన ఉండిపోయింది...'

సో, ఇవ్వాళ దేశానికి నాయకత్వం వహించాలంటే కేవలం నాయకులు సరిపోరన్నమాట. ఆర్థికం కొంత, డిఫెన్స్ వ్యూహాలు కొంత, టెక్నాలజీ కొంత, రాజకీయం కొంత తెలిసి ఉండాలన్నమాట...'

'ఎగ్జాక్ట్ లీ... చైనా ప్లాన్లు ఏమిటో తెలుసా... భారీగా బంగారం నిల్వలు పెట్టుకోవడం...'

'ఆగండాగండి... దాంతో ఏం ప్రయోజనం?'

'బంగారం నిల్వలను బట్టే ఆ దేశం కరెన్సీ విలువ ఆధారపడి ఉంటుందమ్మా... కాగితాలు, కంప్యూటర్ల మీద జరిగే లావాదేవీలకన్నా అంతిమంగా ఏ దేశం ఎన్ని బంగారం నిల్వలు కలిగి ఉన్నాయనేదే ఆ దేశ ఆర్థికారోగ్యాన్ని నిర్ధారించేది... అది ప్రైవేటుగా వ్యక్తుల వద్ద ఉండే బంగారం కాదు, ప్రభుత్వం వద్ద ఉండే బంగారమే లెక్క... ఇండియా, చైనా దేశాల్లో బంగారంపై మోజెక్కువ. నగలపై ఆసక్తి ఎక్కువ. అందుకని ప్రైవేటు బంగారమే ఎక్కువ. మనం బంగారం కొనేకొద్దీ మన విదేశీమారక నిల్వలు తరిగిపోతుంటాయి... అర్థమైంది కదా బంగారానికీ ప్రపంచ ఆర్థిక స్థితిగతులకూ నడుమ సంబంధమేమిటో...'

'ఇదేదో పెద్ద సబ్జెక్టులా కనిపిస్తోంది సార్...'

'అందుకేనమ్మా... ఇవ్వాళ స్పై ఏజెంట్లు కూడా ఆయుధరహస్యాలే కాకుండా ఆర్థిక, టెక్నాలజీ కోణాల్లోనూ పర్‌ఫెక్ట్ కావాలి.. అమెరికా 8000 టన్నుల బంగారం నిల్వల్ని కలిగి ఉంది. గతంలో రూజ్‌వెల్ట్ ఓ నిర్బంధ ఆంక్షలు అమలు చేశాడు. కొంత సీలింగ్ పెట్టి అంతకన్నా ఎక్కువ కలిగి ఉంటే జైలులో పెడతానని చట్టం చేశాడు. దాంతో అందరూ ఆ పరిమితికి మించిన బంగారాన్ని ప్రభుత్వానికి ఏదో ఓ రేటుకు అమ్మేశారు. తన ఫైనాన్షియల్ స్టేటంత్‌లో అమెరికాకు విదేశీమారక

నిల్వలకన్నా బంగారమే 73 శాతం. అందుకే ఆ డాలర్‌కు ఆ విలువ...'

'మనకూ బంగారం నిల్వలు ఎక్కువే కదా సార్...'

'కాదు... మన నిల్వలు కేవలం 550 టన్నులు. చివరకు చైనా నిల్వలు కూడా 1000 టన్నులు కూడా ఉండేవి కావు. అంటే వాళ్ల ఫైనాన్షియల్ స్ట్రెంత్‌లో కేవలం 1.3 శాతం మాత్రమే. అందుకే దాని కరెన్సీ యువాన్‌కు పెద్ద విలువ లేనిది... అమెరికా డాలర్‌ను దిగజార్చడానికి చైనా వేసిన ప్లాన్‌లో ఓ భాగంగా దాదాపు 4000 టన్నుల దాకా బంగారం నిల్వలు సేకరించారు. దాన్ని 10 వేల టన్నులకు తీసుకెళ్లాలని ప్లాన్. దీంతోపాటు ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుకు దీటుగా బ్రిక్స్ బ్యాంకు, ఎఐఐబీ ఆలోచనలూ చేశారు. బ్రిక్స్ (అంటే బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు) తరఫున కామన్ కరెన్సీ రూపొందించి, డాలర్‌ను పడగొట్టాలనేది ప్లాన్...'

'మనకూ మంచిదే కదా సార్... '

'చెబుతా... దీంతోపాటు ఇప్పటికే 4 ట్రిలియన్ల విదేశీమారక నిల్వలు పెట్టుకున్న చైనా దాన్ని డబుల్ చేయాలనుకుంది. తద్వారా ప్రపంచ ఆర్థిక శక్తిగా నిలబడాలనుకుంది. స్టాక్ మార్కెట్‌ను కృత్రిమంగా రెయిజ్ చేసేందుకు ప్రయత్నించింది. ఏదో కొంత మొత్తముంటే చాలు, ట్రేడింగ్ చేసేలా నిబంధనలు పెట్టడంతో... కోట్ల మంది సగటు వినియోగదారులు కూడా షేర్లలో పెట్టుబడులు పెట్టారు. ఏడాదికాలంలో 150 శాతం పెరిగింది ఆ సెన్సెక్స్...'

'అప్పట్లో హర్షద్ మెహతా పీరియడ్‌లో మన సెన్సెక్స్‌లాగా అన్నమాట...'

'కరెక్టు... కానీ చైనా అంచనాలు దారుణంగా దెబ్బతిన్నాయి. పునాదులు సరిగ్గా లేని భవనంలాగే ఇప్పుడు దాని ఆర్థిక స్థితి ఊగిసలాడుతోంది... గత నెల రోజుల్లో వేల కంపెనీల షేర్లు నష్టాలకు గురయ్యాయి. 40 శాతం నష్టాలతో షాంఘై ఎక్స్ఛేంజీ గడగడా వణుకుతోంది. దాదాపు 1200 కంపెనీల్లో ట్రేడింగే నిలిచిపోయింది. ఆ స్టాక్ మార్కెట్ గనుక కుప్పకూలిందంటే... ప్రపంచమే గతంలో ఎన్నడూ కనీవినీ ఎరగనంత మాంద్యంలోకి వెళ్లిపోవడం ఖాయం..'

'అవును. నేనూ చదివాను సార్... దీనికి కారణం ఏమిటంటారు? స్థూల జాతీయ ఉత్పత్తి ఆధారంగా వేసే ప్రణాళికలే నిలబడతాయి. చైనా జీడీపీ మనకన్నా చాలా తక్కువ. కానీ కృత్రిమంగా తన సత్తాను పెంచుకుంటూ పోయింది. తీరా అది బలుపు కాదు, వాపేనని తెలిసేలోగా కూరుకుపోయింది. 40 శాతం

దిగుమతులు తగ్గిపోయాయి. ఉత్పత్తి యూనిట్లలో కూడా 40 శాతం పడిపోయింది. కొన్ని లక్షల అపార్ట్‌మెంట్లు కూడా ఖాళీగా ఉండిపోయాయి. ఉపాధి కరువై జనంలో అసహనం పెరిగిపోతోంది... దీన్ని ఎలా చక్కదిద్దాలో తెలియక చైనా అతలాకుతలమవుతోంది... అమెరికాను కనిపించని ఆర్థిక ఆయుధంతో దెబ్బతీయాలనుకున్న దాని ప్లాన్ ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది...'

'దాందేముంది సార్... మళ్లీ మార్జిన్ ట్రేడింగ్‌కు ఓకే అంటారు. విదేశీ ఇన్‌వెస్టర్లకు పెద్దపీట వేస్తారు... నెల రోజుల్లో చక్కబడుతుంది...'

'మంచిదే... నేను చెప్పాలనుకున్నదేమిటంటే... ప్రస్తుతం ప్రపంచంలోని దేశాలు కేవలం ఆయుధ సంపత్తిమీదే గాకుండా ఇలాంటి యుద్ధాలకు ప్రణాళికలతో ముందుకు పోతున్నాయని...! సైబర్ యుద్ధాలు, ఆర్థిక యుద్ధాలు, మత యుద్ధాలు... ఇవే రాబోయే ఘర్షణలు... అందుకని ఇప్పుడప్పుడే చైనా మనతో గెలుక్కోదు... అంతెందుకు? మొన్నమొన్నటి దాకా షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేషన్‌లో సభ్యత్వమే ఇవ్వకూడదని అనుకున్న చైనా మనకు ఇప్పుడు శాశ్వత సభ్యత్వం ఇచ్చింది... దాంతో మధ్య ఆసియా దేశాల్లో మనకు మళ్లీ పెద్దన్న పాత్ర లభించడం ఖాయం...'

'సార్... దేశ విదేశాంగ విధానానికి ఇన్ని కోణాలుంటాయని ఎందరు పాలసీ మేకర్స్‌కు తెలుసు...?'

'అందుకేనమ్మా... నా బాధ కూడా! టవరింగ్ పర్సనాలిటీ ఒకరు దేశ రాజకీయాల్లోకి రావాలని... ఒక్కటంటే ఒక్క రూపాయీ తన కోసం సంపాదించుకోవాలని గాకుండా దేశం కోసం నేనేం చేయగలనని అనుకునే ఒక్క కేరక్టర్ కావాలిప్పుడు దేశానికి...'

'ఏమో సార్... ఆశావాదమైతే పర్లేదు... ప్రస్తుత రాజకీయాల ధోరణిని బట్టి చూస్తే మీది మరీ అత్యాశావాదమని అనిపిస్తోంది సార్... సారీ, ఇలా అన్నందుకు...?'

'ఉన్నమాటే అన్నావు... అటు గ్రీస్ సంక్షోభం, ఇటు చైనా సంక్షోభం... తాజాగా పోర్చుగల్ కూడా దివాలా స్టేజీలో ఉందంటున్నారు... సో, వెయిట్ అండ్ వాచ్... అంతకు మించి మనమూ ఏమీ చేయలేం... ఇదంతా చూస్తే మా రా వింగ్‌లోకి ఫైనాన్స్, మేనేజ్‌మెంట్, టెక్నికల్ పీపుల్‌ను కూడా తీసుకోవల్సిన అవసరం కనిపిస్తోంది...'

‘చైనా సరే సార్... పాకిస్థాన్ మాటేమిటి?’

‘అదో చిల్లర దేశం... మనసు నిండా కసి తప్ప మరేమీ ఉండని ఉత్త కసాయి మాలోకం... బండకొట్టుడు తప్ప చైనాలాగా పన్నెండు కోణాల్లో ప్రణాళికా బద్ధంగా అడుగులు వేయడం తెలియదు... అందుకే నిన్ను కూడా జాగ్రత్తగా ఉండమని చెప్పేది...’

‘తప్పకుండా సార్...’

‘సో... ప్రొసీజర్‌కు పది రోజులు పట్టొచ్చు... నువ్వు ఇండియాకు మొట్టమొదటి అధికారిక ప్రైవేటు గూఢచారివి. ఓకే...’

‘ఓకే సార్... థాంక్యూ...’

‘అన్నట్టు ద్వివేదీ ఇంకా ఢిల్లీ చేరుకోనేలేదు... ఏమైంది?’

‘నేను అటు వెళ్లి తెలుసుకుని రిపోర్ట్ చేస్తా సార్... బై’ అంటూ ఫోన్ పెట్టేసింది దివిజ...

❄ ❄ ❄

‘ఈ ద్వివేదీ ఏమయ్యాడో.. ఏంటో... యాదీ నువ్వు అసుపత్రికి వెళ్లి తెలుసుకో, నేను ఎయిర్ పోర్టు వైపు వెళ్లొస్తా...’ అంటూ యాదగిరికి పని పురమాయించింది దివిజ... తను కంప్యూటర్ ఆన్ చేసింది...

గత రెండు రోజుల్లో హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లిన ఫ్లైట్ల ప్రయాణికుల జాబితాలను మొత్తం తీసుకుని, కట్ చేస్తూ ఒక్క చోట పేస్ట్ చేసింది. దాంట్లో సెర్చ్ దగ్గర ద్వివేదీ పేరు కొట్టింది... ఇండిగో విమానంలో ప్రయాణానికి టికెట్టు తీసుకున్నట్టు దొరికింది. ఆ విమాన సర్వీసు సైట్‌లోకి వెళ్లి ఆ ఫ్లైట్ నంబరుతో ప్రయాణీకుల వివరాలు సెర్చ్ చేసింది. బోర్డింగ్ డిటెయిల్స్ లేవు. అంటే... ఎయిర్ పోర్టుకు వెళ్లనేలేదా? మరి ఎటు పోయి ఉంటాడు? ఇంకేదైనా అసైన్‌మెంటుతో అప్పటికప్పుడు కేన్సిల్ చేసుకోవటానికి వేరే పనేమీ లేదతనికి ఇప్పట్లో... పైగా ఢిల్లీలో రిపోర్ట్ చేయాలని స్పష్టంగా ఆదేశించారు. మరేమయ్యాడు? సంథింగ్ రాంగ్?

కొంచెంసేపటికి యాదగిరి ఫోన్ చేశాడు. ఇన్స్యూరెన్సు కార్డుతోనే ఆసుపత్రి బిల్లులన్నీ క్లియరైపోయి డిశ్చార్జి అయిపోయినట్టు సమాచారం ఇచ్చాడు తను... ‘సరే, నువ్వు ఆఫీసుకొచ్చెయి...’ అని చెప్పింది ఆమె...

మొబైల్ చేతిలో పెట్టుకుని, నరసింహన్ ఇచ్చిన సైలెంట్ వెపన్‌ను జేబులో పెట్టుకుని, తాపీగా ఆలోచిస్తూ వీధి చివరన ఉండే ఉడిపి హోటల్ వైపు అడుగులు వేయసాగింది. కాఫీ తాగి రావాలని ఆమె ఆలోచన. రోడ్డుపై పెద్దగా జనం లేరు. ఓ మారుతి వ్యాన్ ఆమెను దాటివెళ్లి ఎడమ పక్కకు సైడ్ తీసుకుని ఆగిపోయింది. ఇంజన్ రన్నింగ్‌లోనే ఉన్నట్టు సన్నగా సౌండ్ వస్తోంది. చిరాకుగా చూస్తూ దాన్ని దాటుకుని వెళ్తోంది ఆమె. సఱ్రున వ్యాన్ డోర్ తెరుచుకోవడం, తియ్యగా ఉన్న ఓ ద్రవం ఆమె మొహంపైకి పిచికారీ కావడం క్షణాల్లో జరిగిపోయింది.

ఆమె ఆశ్చర్యం నుంచి తేరుకునేలోపు రెండుచేతులు బలంగా ఆమెను వ్యాన్‌లోకి లాక్కున్నాయి. డోర్ పూర్తిగా మూసుకోకముందే వ్యాన్ ముందుకు కదిలి వేగంగా వేగం అందుకుంది. జరుగుతున్నది ఆమెకు అర్థమయ్యేలోపు ఆమెను మగత ఆవరించింది. కళ్లు మూతలు పడ్డాయి. ఆమె స్పృహ కోల్పోయింది. తరచూ ఆఫీస్‌కు కాఫీ తెచ్చే బాయ్ దాన్ని చూసి, పరుగెత్తుకొచ్చేలోపు వ్యాన్ వీధి మలుపు తిరిగింది.

❄ ❄ ❄

యాదగిరి ఆఫీసుకొచ్చాడు. తలుపులు లాక్ చేసి లేవు. ఆమె లోపల ఉన్నట్టు కూడా లేదు. బహుశా ఏదో తెచ్చుకోవటానికి ఇంట్లోకి వెళ్లి ఉంటుందనుకుంటూ తన కుర్చీలో కూర్చుని ఏసీ ఆన్ చేశాడు. ‘సార్, సార్... ఘోరం జరిగిపోయింది...’ అంటూ కాఫీ కుఱ్ఱాడు పరుగెత్తుకొచ్చాడు.

అప్పట్నుంచీ మీరొప్పుడొస్తారా అని చూస్తున్నా... అంటూ వగురుస్తున్నాడు ఆ కుఱ్ఱాడు.

‘ఏమైందిరా?’ అడిగాడు యాదగిరి.

‘మేడమ్‌ను ఎవరో వ్యాన్లో వచ్చినవాళ్లు ఎత్తుకొని పోయారు సార్... నా కళ్లారా చూశాను... ఎఱ్ఱరంగు వ్యాన్... నంబర్ చూడలేదు. డ్రైవర్ గాక మరో ఇద్దరున్నట్టు అనిపించింది సార్...’

నిశ్చేష్టుడయ్యాడు యాదగిరి. తాము చేపట్టిన కేసుల్లో ప్రాణాంతకమైనవి ఏవీ లేవు. అన్నీ రొటీన్ కేసులే. మొన్నటి చైనీస్ ఏజెంట్ల కేసు దాదాపు ముగిసినట్టేనని దివిజ మేడమే చెప్పింది. మరెవరు వీళ్లు..? ఒకవేళ ద్వివేదీ మాయం కావటానికీ, మేడమ్ కిడ్నాప్‌కీ సంబంధం ఉందా? ఆ చైనీస్ ఏజెంట్లు వదలకుండా వెంటాడుతున్నారా? అయితే ఆమె ఆచూకీ తెలిసేది ఎలా? అనే

ప్రశ్నలతో ఒక్కసారిగా తన మెదడు వేడెక్కి పోయింది...

బయటికి వచ్చి బైక్ తీసి నేరుగా వసుధ ఆఫీసు వైపు దూసుకుపోయాడు. అతను వెళ్లేసరికి ఆమె ఏదో ఇంపార్టెంట్ మీటింగ్‌లో ఉంది. కానిస్టేబుల్‌కి ఓ అర్జెంటు సమాచారం మేడమ్‌కు ఇవ్వడానికి వచ్చినట్టు చెప్పమన్నాడు. తన పేరు చెప్పాడు... 'మీరు కానివ్వండి, నేనిప్పుడే వస్తా' అంటూ తన సబార్డినేట్స్‌కు చెప్పి హాల్ నుంచి బయటికి వచ్చింది... ఏమిటన్నట్టుగా చూసింది అతనివైపు... జరిగింది వివరించాడు ఆమెకు... ఏం చేద్దామన్నట్టు చూశాడు ఆమెవైపు... ఎలా ప్రొసీడ్ కావాలో తెలియడం లేదతనికి...

'ఏ మాత్రం సందు దొరికినా మా మేడమ్‌ను ఆపడం వాళ్ల తరం కాదు... కానీ వాళ్లెవరో తెలియదు, ఎందుకు చేశారో తెలియదు... ఒకవేళ ఆ చైనీస్ ముఠాయే అయ్యుంటే కొంత డేంజర్‌లో పడ్డట్టే మేం...'

'నన్ను కాస్త ఆలోచించనివ్వు యాదీ... ఈలోపు నువ్వు టీ తాగి స్థిమితపడు...' అంటూ ఓ కానిస్టేబుల్‌కు టీ తెచ్చి పెట్టాల్సిందిగా చెప్పి మీటింగ్ హాల్‌లోకి ఎంటరైంది ఆమె.... జరిగిన విషయం చెప్పింది వారికి...

'కమిషనర్‌కు చెప్పి సిటీ శివార్లను వెంటనే మూసేయడం బెటర్ మేడమ్... అనుమానాస్పదంగా కనిపించిన ప్రతీ వెహికిల్‌నూ చెక్ చేయడం మరో మార్గం' అన్నాడు ఓ సీఐ. వాళ్లందరికీ దివిజ, ఆమెతో వసుధ స్నేహం తెలుసు. దివిజ డీల్ చేస్తున్న కేసు, దాని తీవ్రత తెలియకపోయినా... తమ సొంత మనిషిని ఎవరో కిడ్నాప్ చేశారన్నంత ఫీలింగ్ వారిని ఆవహించింది. ఏదో కేసులో ఆమెకు శత్రువులుగా మారినవాళ్లు కక్షతో ఆ పనిచేసి ఉంటారని వారి ప్రాథమిక అంచనా...

కమిషనర్‌కు ఫోన్ చేసి, క్లుప్తంగా వివరాలు చెప్పి... కంట్రోల్ రూంకి ఫోన్ చేసి, అన్ని స్టేషన్లనూ అలర్ట్ చేసింది ఆమె. వ్యాన్లను తప్పకుండా చెక్ చేయాలని చెప్పింది గానీ... దివిజను వ్యాన్ నుంచి మరో వెహికిల్‌లోకి మార్చి ఉంటారనేది ఆమె అనుమానం. ఈ ముఠాలు రకరకాల వాహనాలు వరుసగా వాడి పోలీసులను తప్పుదోవ పట్టించడం మామూలే.

సరిగ్గా పది నిమిషాల్లో పోలీసు బలగాలు రోడ్లపైకి వచ్చాయి. ప్రతీ వెహికిల్‌నూ ఆపి తనిఖీ చేస్తున్నారు. ప్రత్యేకించి వ్యాన్లను అసలు వదలడం లేదు. శివారుల్లోని రోడ్లను బ్లాక్ చేశారు. పది నిమిషాలకు ఓసారి తనకు రిపోర్ట్ చేయాలని వసుధ చాలా స్ట్రిక్ట్ ఆదేశాలనిచ్చింది...

❄ ❄ ❄

తలంతా ఒకటే పోటు... శూలాలతో పొడుస్తున్నట్టుగా... స్పృహలోకి వచ్చినా వెంటనే కళ్లు తెరవకుండా, గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటూ, వదులుతూ రిథమిక్‌గా శ్వాసనియంత్రణ చేయసాగింది. తనను ఎవరో ఎత్తుకొచ్చినట్టు అర్థమవుతూనే ఉంది. ఎందుకో, ఎవరో తెలియదు... చిన్నాచితకా కేసుల్లో ఇలాంటివి ఫేస్ చేసింది కానీ తన స్టామినా ముందు వాళ్లు చిన్నగ్రహాలు కావడంతో ఇట్టే వాటిని చేధించుకుని బయటపడింది తాను. కానీ ఈసారి ఎవరో, వారి మోటివ్ ఏమిటో తెలియడం లేదు.

మెల్లిగా కళ్లు తెరిచి చూసింది. ఓ గదిలో ఉందామె. కాళ్లూ చేతులు సవ్యంగానే ఉన్నాయి. కనీసం వాటిని కట్టిపడేయలేదు. మామూలు రూం. సో, తనను చంపుదామనే ప్లాన్ కాదు అది... ఏదో మాట్లాడటానికి తనను అలాగే వదిలేశారని అర్థమైంది. ఈ లెక్కన తను ఇంకొంచెంసేపట్లో గనుక స్పృహలోకి రాకపోతే వాళ్లే తెప్పిస్తారు. జేబులో వెపన్ అలాగే ఉంది. బహుశా అది వారికి వెపన్‌లా అనిపించలేదేమో... మొబైల్ మాత్రం కనిపించడం లేదు. బహుశా ఆ వ్యాన్‌లో పడి ఉంటుంది.

శ్వాసనియంత్రణ ద్వారా దాదాపుగా మగతను పోగొట్టుకుని మళ్లీ మామూలు మనిషిగా లేచి, కాళ్లూ చేతులూ అటూఇటూ కదిలిస్తూ, గాలిలో కిక్స్ కొడుతూ... సాధారణ స్థితికి చేరి గదిని పరిశీలించసాగింది.

ఏదో పాత ఇల్లు. గూనపెంకుల కప్పు... పాతబడిన గోడలు, సున్నం సంస్కారానికీ నోచుకోలేదు. చీకిపోతున్నట్టు కిటికీ రెక్కలు, పూర్వకాలంనాటి ఫ్యాన్... ఇది తనను బంధించి ఉంచగల పటిష్టమైన బందిఖానా ఏమీ కాదు. కానీ బయట ఎందరున్నారో, వారి వద్ద ఉన్న ఆయుధాలేమిటో తెలియదు... ఎవరో వస్తారని వేచిచూడటం కంటే తనే మెల్లిగా బయటపడే ప్రయత్నాలు చేయడం బెటరనుకుంది. కొద్దిసేపు ఆలోచించగానే ఒక్కసారిగా లైట్ వెలిగింది. చాలా ఈజీ మెథడ్ దొరికిపోయిందామెకు...

జేబులో నుంచి వెపన్ తీసింది. పొద్దున్నే ఫుల్ ఛార్జి పెట్టింది. దాన్ని ఆపరేట్ చేసే అవకాశం దొరికింది. వెపన్‌కు ఉన్న సన్నని ప్యాడ్‌పై పాస్ వర్డ్ అంకెలు నొక్కింది. అంతకుముందే లాక్, అన్ లాక్‌కు ఓ పాస్ వర్డ్ పెట్టుకుంది. అంకెలు నొక్కగానే ఓ మూల చిన్న ఎల్ఈడీ వెలుతురు కనిపించి మాయమైంది. సో, రెడీ అన్నమాట...

❄ ❄ ❄

కిటికీ మూలలపై తన వెపన్ గురిపెట్టి బటన్ ప్రెస్ చేసింది దివిజ. గుళ్లు అయిపోతాయనే బెడదలేదు. సౌండ్ లేదు. నిశ్శబ్ధంగా ప్రత్యేక కిరణాలు వెళ్లి ఆ మూలలను టార్గెట్ చేశాయి. అసలే వీక్‌గా ఉన్న కిటికీలు ఆ కిరణాల తాకిడికి మరింత బలహీనపడిపోయాయి. దాని దగ్గరకు వెళ్లి చేత్తో గట్టిగా లాగింది. కొంచెం బలం ప్రయోగించగానే మొత్తం కిటికీ ఊగసాగింది. మరికొంత గట్టిగా లాగేసరికి కిటికీ ఫ్రేమ్‌తో సహా ఊడివచ్చింది. దాన్ని అలాగే తీసి పక్కనపెట్టింది. తన వెపన్‌ను మళ్లీ జేబులో దోపుకుంది. బయటకి వెళ్లి ఆ కిటికీని యథాస్థానంలో ఉంచేసింది. దుమ్ము లేదు, ధూళి లేదు, సింపుల్‌గా మాయ చేసినట్టు ఆమె బయటికి వచ్చేసింది.

పెద్దగా ఎవరి సందడీ కనిపించడం లేదు. వెలుతురు కూడా తక్కువే ఉంది. అటూఇటూ పరిసరాలను గమనించింది. తనను బంధించిన గది పక్కనే మరో గది ఉంది. దానికీ ఇలాంటి కిటికీయే ఉంది. మెల్లిగా కిటికీకున్న సందులో నుంచి చూసింది. ఎవరో బందీ ఉన్నాడక్కడ తనలాగే... సరిగ్గా కనిపించలేదు. గట్టిగా కళ్లు చికిలించి మరీ చూసింది. అక్కడున్నది ద్వివేదీ.

ఓహ్.. తనను వీళ్లే కిడ్నాప్ చేశారన్నమాట. సో, పక్కాగా చైనీస్ ఏజెంట్ల పనే. తన వద్ద ఇంపార్టెంట్ ఇన్‌ఫర్మేషన్ ఉందనే నిర్ధారించుకున్నారన్నమాట... ఇక్కడే తాడోపేడో తేలిపోవాలిక, తప్పదు...

కిటికీ వద్దకు వెళ్లి టక్ టక్ మంటూ ఆగి ఆగి తట్టసాగింది. అది చాలా పురాతనమైన కోడ్. ప్రతీ డిటెక్టివ్ శిక్షణలో ఉండేదే. ద్వివేదీ ఆశ్చర్యంతో కిటికీ వద్దకు వచ్చాడు.

ఎవరు అన్నట్టు తిరిగి ఆ సంకేత భాషలో కిటికీ రెక్కలపై తట్టాడు.

'నేనే దివిజను. నన్నూ కిడ్నాప్ చేశారు' అని క్లుప్తంగా ముగించింది.

'నా వెపన్, మొబైల్ లాక్కున్నారు. తప్పించుకునే మార్గం దొరకడం లేదు' అని కన్వే చేశాడు ద్వివేదీ.

'నో ప్రాబ్లం.... ఎవరెవరు ఉన్నారో కాస్త చూసి వస్తా. ధైర్యంగా ఉండు' అని అక్కడి నుంచి కదిలింది.

కాస్త దూరం వెళ్లగానే మెట్లు కనిపించాయి. సెక్యూరిటీ ఏమీ లేదు. ఆశ్చర్యపోయిందామె. మెట్లు ఎక్కి అటూఇటూ చూసింది. ఓ పక్కన గదిలో మాటలు వినిపిస్తున్నాయి. దగ్గరగా వెళ్లి గోడపక్కన అతుక్కుపోయినట్టుగా

నిలబడింది. అక్కడికి మాటలు బాగానే వినిపిస్తున్నాయి.

'ఇవ్వాళ అటోఇటో తేల్చేద్దాం. అమెరికా బ్రోకర్ మంచి రేటు ఆఫర్ చేస్తున్నాడు. ఒకవేళ గుడ్ విల్ తీసుకుని సైలెంటుగా వీళ్లను అప్పగించి వెళ్లిపోతే, తనే ప్రైవేటు ఏజెంట్లతో ఈ కేసు డీల్ చేసుకుంటాననీ అంటున్నాడు. లేట్ చేయలేం. వాడు సొంతంగా రంగంలోకి దిగి, వీళ్లను గనుక పట్టుకుంటే మన ఎఫర్టంతా వేస్టయిపోతుంది' అంటూ చెబుతోంది ఓ గొంతు. కాస్త ఉర్దూ స్లాంగ్ ఉన్న ఇంగ్లిషులో సాగుతోంది సంభాషణ.

'చెప్పేద్దాం. మంచి రేటు ఇస్తే ఈ జాబ్‌కు ఇక సెలవు. ఎక్కడికైనా వెళ్లి సెటిలైపోతా...' మరో గొంతు వినిపించింది. ఇది మరోరకం స్లాంగ్‌తో ఉంది. బహుశా చైనీస్ టచ్ ఉన్న ఇంగ్లిష్.

'సెలవు తీసుకోవడం ఎందుకు? తాపీగా మరో ఆపరేషన్ చేసుకుందాం. ప్రైవేటు స్పయింగ్ ఏజెన్సీ పెడదాం సంయుక్తంగా... ఏమంటావు?'

'ముందైతే ఈ ఆపరేషన్ పూర్తి కానివ్వు... ముందు వాళ్లు తప్పించుకోకుండా కొంచెం సెక్యూరిటీ పెంచితే బెటర్ కదా...'

'అవసరం లేదు, బయట ఉన్న సెక్యూరిటీ చాలు. తప్పించుకుని పోలేరు. ఇంకా లోపల కూడా ఎందుకు?'

కొంచెం కొంచెం జరుగుతూ గోడకున్న కిటికీ సందులో నుంచి చూసిందామె. కుర్చీల మీద కూర్చొని ఉన్నారు ఇద్దరు వ్యక్తులు. వారి వెనుక లైట్ మెషీన్ గన్స్‌తో మరో ఇద్దరు నిల్చుని ఉన్నారు. టీపాయ్, దానిపై మందు సీసాలు, గ్లాసులు, ప్లేటులో స్నాక్స్ కనిపిస్తున్నాయి. ఆ మొహాలను ఎక్కడో చూసినట్టు అనిపిస్తోంది. ఆలోచిస్తోంది ఆమె...

'భయానికి వినేరకం కాదు ఆ అమ్మాయి. వాడూ నొటోరియస్ ప్రొఫెషనల్‌గానే కనిపిస్తున్నాడు. అడిగితే వోకే అంటే కలిపేసుకుందాం. ఆ సీక్రెట్ ఇన్‌ఫర్మేషన్ గనుక వాడికి దొరికి ఉంటే ఇప్పటికే హయ్యర్ అఫీషియల్స్‌కు పంపించే ఉంటాడు. తనతోనే ఉంటుందని ఎలా అనుకోవడం?"

"కామన్ సెన్స్... ఆమె కంప్యూటర్ అకస్మాత్తుగా డీహ్యాక్ అయిపోయింది. ఏదో ఎఫిషియెంట్ ఫైర్ వాల్ ప్రొటెక్ట్ చేస్తోంది. లేదంటే ఇప్పటికే ఆమె పంపించిన మెటీరియల్ అంతా మన చేతుల్లోకి వచ్చి ఉండేది. ఈ రిస్కు కూడా ఉండేది కాదు... ఆమె కోఆపరేట్ చేస్తే ఆ పంపించిన ఫైళ్లను అదే కంప్యూటర్‌లోని

సెంట్ ఫైళ్ల నుంచి తీసుకోవడం ఈజీ. ఒకవేళ ఆమె సెకండ్ కాపీని దాచి ఉంటే మరింత ఈజీ. వాడి దగ్గర ఆ ఫైళ్లు లేకపోవచ్చు గానీ దివిజ వద్ద ఏమున్నదనేది వాడికి తెలుసు...''

'ఒకవేళ కోఆపరేట్ చేయకపోతే...?'

'మనం వాటా ఇస్తామనే చెబుదాం. ఇస్తే రీజనబుల్ అమౌంట్ ఇద్దాం. ఈ స్పయింగ్‌లో ఇదంతా కామనే...''

'ఒకవేళ ఆమె మనతో చేతులు కలిపినా... రా అధికార్లకు ఇట్టే తెలిసిపోతుంది ఆమె డబుల్ క్రాస్ చేస్తోందని... అలా వారితో నెగెటివ్ ముద్ర వేయించుకోవటాన్ని ఆమె ఒప్పుకోకపోవచ్చు...'

'ఒప్పుకుంటే సరి, లేదంటే ఖతం చేసి, నేరుగా ఆమె ఆఫీసుకే వెళ్లి స్వాధీనం చేసుకోవడం... తాపీగా అక్కడే కూర్చుని మనకు కావల్సిన సమాచారం తెచ్చుకోవడం... ఏమీ అధారాలు లేకుండా ఉండాలంటే, అంతా సైలెంట్‌గా జరగాలంటే అప్పుడు ఆమె, ఆమె అసిస్టెంటు, ఈ ఏజెంటు (ద్వివేదీ) ఖతం కావాలన్నమాట...'

వింటున్న దివిజ ఉలిక్కిపడింది. మెల్లిగా కిందికి దిగివచ్చి మళ్లీ తనను బంధించిన గది వద్దకు వచ్చింది. కిటికీ మళ్లీ తొలగించి, లోపలకు వచ్చి యథాస్థానంలో పెట్టేసింది.

సో, పిక్చర్ క్లియర్... ఆ రహస్య సమాచారం బయటి ఏజెంట్లకు తాను అమ్ముకునే ప్రసక్తే లేదు. తాను ఒప్పుకోకపోతే ముగ్గురి ప్రాణాలూ తీయటానికీ వాళ్లు రెడీగా ఉన్నారు. కాబట్టి వాళ్ల ఆటకట్టించడమొక్కటే మార్గం. యాదగిరి, ద్వివేదీ ప్రాణాలూ ఇప్పుడు రిస్కులోనే ఉన్నట్టు. ఒకవేళ వాళ్లతో చేతులు కలిపి ఈ ఇద్దరికీ రిస్కు లేకుండా చూద్దామని అనుకున్నా... తీరా చివరకు ఫైళ్లు చేతికి రాగానే ప్లేటు తిప్పినా తనేం చేయలేని స్థితిలో ఇరుక్కుపోతుంది. ఎలా చూసినా... ఫైట్ తప్పదన్నమాట. వాళ్ల మాటల్ని బట్టి ప్రహారీ, గేటు పరిసరాల్లో మంచి సెక్యూరిటీతోనే ఉన్నారు.

సడెన్‌గా ఆమెకు వాళ్లెవరో తెలిసిపోయింది. ఇప్పటిదాకా మైండ్‌లో రకరకాల పేర్లు, చిత్రాలు తిరిగిపోతున్నాయి గానీ మ్యాచ్ కాలేదు. అకస్మాత్తుగా స్ట్రయికైంది. ఒకడు ఐఎస్ఐ డిప్యూటీ చీఫ్ రజాక్... మరొకడు చైనీస్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ సీనియర్ ఏజెంట్ ఛాంగ్... రా సర్వర్‌తో కనెక్టయ్యాక అప్పుడప్పుడూ ఈ

ఏజెంట్ల వివరాలను చూస్తూ వారి పనితీరుపై ఇండియన్ ఏజెంట్లు తెలుసుకున్న సమాచారమంతా చదువుతూ ఉండేది. అవన్నీ ఆమె మైండ్‌లో స్టోరయిపోయా యెప్పుడో...

వాళ్ల ఏజెన్సీలను డబుల్ క్రాస్ చేయటానికి నిర్ణయించుకున్నారు. సక్సెసైతే వోకే, లేకపోతే యథావిధిగా తమ పనులు తాము చేసుకుంటారు. ఆ రెండు దేశాల ఏజెంట్లు చాలా సందర్భాల్లో కలిసి పనిచేశారు. ఏదో ఓ ఆపరేషన్‌లో వాళ్లిద్దరూ కలిసి ఉంటారు. ఆ దోస్తీ పెరిగి, ఈ జాయింట్ ఆపరేషన్ కు సిద్ధపడి ఉంటారు. ఈలెక్కన ఇక్కడున్న సెక్యూరిటీని కూడా వీళ్లే ప్రైవేటుగా ఏర్పాటు చేసుకుని ఉంటారు.

రూంలోనే ఓపక్కన పడేసిన తన మొబైల్ కనిపించింది. తీసి పరిశీలించింది. సిమ్ కార్డు తీసేశారు. ఆఫ్ లోనే ఉంచేసి ఇక దాంతో చేసేదేమీ లేదనే నిర్లక్ష్యంతో దాన్ని అక్కడే పడేశారు.

'తనతో డీల్ కోసం ప్రయత్నిస్తున్నారు కాబట్టి పెద్దగా కట్టుబాట్లు లేవు... ఒక్కసారి తను నో అంటే మాత్రం చాలా నీచంగా దిగజారిపోతుంది పరిస్థితి...

మొబైల్ ఆన్ చేసింది. సిమ్ కార్డు లేకపోయినా ఆఫ్ లైన్ పనిచేస్తుందా ఫోన్. బ్యాటరీ బాగానే ఉంది. వైఫై సౌకర్యం పరిసరాల్లోనే అందుబాటులో ఉన్నట్టు లిస్టు కనిపిస్తోంది. కానీ అన్నీ రెస్ట్రిక్టెడ్ లైన్లు. ఒక్కటీ ఓపెన్ లైన్ లేదు. పాస్ వర్డ్ తప్పనిసరి. ఆన్ లోనే ఉంచేసింది...

❄ ❄ ❄

వసుధ అసహనంగా ఉంది. దివిజ జాడలు ఎక్కడా ట్రేసవడం లేదు. అలాగే గస్తీ, తనిఖీలు కంటిన్యూ చేయమని చెప్పింది. ఈలోపు యాదగిరి లోపలకు వచ్చాడు... ఏమిటన్నట్టు చూసిందామె...

"నా ఫోన్, మా మేడమ్ ఫోన్ లో ఓ సౌకర్యం ఉంది. జీపీఎస్ తో నడిచే ఓ చిన్న ఏర్పాటు. ఆమె మొబైల్ ఇప్పటిదాకా ఆఫ్ లో ఉన్నట్టుంది. ఇప్పుడది ఆన్ అయినట్టుంది. నా ఫోన్ యాప్ కి రియాక్టవుతోంది. ఆ ఫోన్ ఎక్కడుందో పిన్ పాయింట్ గా పట్టిస్తుంది. కానీ దుర్మార్గులు ఆమె ఫోన్ ను ఎక్కడో పారేసి ఉంటారు..."

"ఎక్సలెంట్... కనీసం ప్రయత్నం చేసి చూద్దాం... అదెక్కడో ట్రేస్ చేసి చెప్పు..."

“సిటీలోనే... బార్కాస్ ఏరియా సూచిస్తోంది... ”

“మనం ఇద్దరమే వెళ్లొద్దాం పద... అవసరమైతే రావటానికి వీలుగా ఓ స్పెషల్ పార్టీని రెడీగా ఉంచి వెళ్దాం...”

దానికి తగిన ఆదేశాలు ఇచ్చి, యాదగిరితోపాటు బయల్దేరింది ఆమె... ఇద్దరి వద్దా వెపన్లున్నాయి.

❄ ❄ ❄

“హాయ్, మేడమ్... హౌ ఆర్యూ...” అంటూ దివిజ గదిలోకి వచ్చారు రజాక్, ఛాంగ్.

‘హాయ్, రజాక్ భాయ్... నువ్వేనా నన్ను తీసుకొచ్చింది...’ అని సూటిగా అతని కళ్లల్లోకి చూసి అడిగింది దివిజ.

షాక్ తిన్నారు వారిద్దరూ... ఆమె అంత త్వరగా తమల్ని గుర్తిస్తుందని అనుకోలేదు వారిద్దరూ... రా ఏజెంట్లు, మిలిటరీ ఇంటలిజెన్సీకి తప్ప తమ పోలికలు ఇంకెవరికీ తెలియవనే భావించారు. కానీ ఆమె నోటి వెంట ఇద్దరి పేర్లూ రావడంతో నివ్వెరపోయారు ఒక్క క్షణం. ముందు తేరుకుని ఛాంగ్ మొదలెట్టాడు.

‘చూడు, నువ్వు కూడా రా తరఫున పనిచేస్తున్నావని మాకు తెలుసు గానీ... నీతో ఘర్షణ అవసరం లేదు. ఫెయిర్ డీల్. అందుకే నిన్ను తీసుకొచ్చినా కట్టిపడేయలేదు’ అంటూ ఆమెతో చేయాలనుకున్న డీల్ ఏమిటో వివరించాడు. 40 శాతం వరకూ ఖర్చులు, గ్యాంగ్ మెయింటెనెన్స్, బ్రోకరేజీలు పోతాయని, మిగతావి సమానంగా పంచుకుందామని చెప్పాడు. ‘మొత్తం 300 కోట్ల డీల్ ఇది. ఆలోచించుకో...’ అన్నాడు.

‘డీల్ మాట్లాడేవాడెవడూ ఇలా కిడ్నాప్ చేయడు. ఫెయిర్ డీల్ కాదు...’ అంది దివిజ.

‘నిర్మొహమాటంగా చెబుతున్నాం. ఘర్షణ లేకుండా నాలుగు డబ్బులు వస్తాయి. తరువాత మరో పని ఎలాగూ దొరుకుతుంది. నువ్వు అంగీకరిస్తే సరి... లేదంటే ఇక్కడే ఖతం చేసి, నీ ఆఫీసుకెళ్లి మరీ స్వాధీనం చేసుకుంటాం. కొంచెం అందరి కళ్లూ పడతాయని ఆలోచిస్తున్నాం. ఇప్పుడు ఇండియాతో రప్చర్ మా దేశాలకు ఇష్టం లేదు...’ ఛాంగ్ సూటిగా చెప్పేశాడు.

'మీరు అడుగుతున్నవేవీ నావద్ద లేవు. మీరు చెప్పింది నిజమే. ఆ కార్డులు తీసుకుని రా చీఫ్‌కు పంపించడం వరకే నా బాధ్యత. అదయిపోయింది. మీకూ నాకూ పంచాయితీ లేదు. నాతో మీకు వచ్చేది కూడా లేదు...'

'నువ్వు మా టెక్నాలజీని తక్కువ అంచనా వేసినట్టున్నావు. నువ్వు నరసింహన్‌తో ఏమేం మాట్లాడావో అన్నీ తెలుసు. అసలు హ్యాకింగ్ కింగులం మేం...' అని పకపకా నవ్వాడు ఛాంగ్

'అంత కింగులైతే మీకు అంత భయం ఎందుకు?'

'మాకా భయమా? ఎలా?' ఆశ్చర్యంగా అడిగాడు

'లేకపోతే గూగుల్ బదులు వేరే సెర్చింజన్ ఉంటుందా మీ దేశానికి ప్రత్యేకంగా. సొంతంగా సర్వర్లు, చివరకు ఫేస్ బుక్, ట్విట్టర్ కూడా ఉండవు. మీకంటూ సొంతంగా సోషల్ సైట్లు కావాలి. చివరకు యూ ట్యూబ్ కూడా రాదు మీ దేశంలో. దానికీ వేరే పెట్టుకున్నారు. అరె, సోషల్ మీడియా అంటేనే మీరు కూడా మిగతా ప్రపంచంతో కలవాలని... మీ అంతట మీరు గిరి గీసుకుని, అభద్రతలో, భయంలో బతుకుతూ మీరే గొప్ప అనుకుంటే ఎట్లా...?'

'అది భయం కాదు, ముందు జాగ్రత్త. అయినా మా టెక్నాలజీ గొప్పలు ఇక్కడెందుకు కానీ... త్వరగా తేల్చు..'

'అంత ధీరులు, శూరులు... మా ప్రమేయం లేకుండానే మా కంప్యూటర్లను హ్యాక్ చేసి తెలుసుకోవచ్చుగా... '

'అదీ ప్రయత్నించాం. నిన్న మీ ఇస్రో సైట్ కూడా హ్యాక్ చేశాం చూడలేదా? కానీ కొన్ని ఏవో బలమైన ఫైర్ వాల్స్ మీ ఇంపార్టెంట్ సంస్థల కంప్యూటర్ల నెట్ వర్క్‌ను కాపాడుతున్నాయి. చూస్తూ ఉండు, వాటినీ బ్రేక్ చేస్తాం...'

రజాక్ మధ్యలో కల్పించుకున్నాడు ...

'మీ పిచ్చి డిస్కషన్ నాకెందుకు గానీ, విషయమేంటో తేల్చుకో. నీకు గంట సేపు సమయం ఇస్తున్నాం. లేదంటే అంతిమయాత్రకు సిద్ధమైపో...' అని వెళ్లిపోయారు ఇద్దరూ...

వాళ్లిద్దరూ ద్వివేదీ వద్దకు వెళ్లి అదే ఆఫర్, అదే పాట మొదలుపెడతారని అర్థమైందామెకు...

తన ఉనికి ఎలాగూ యాదగిరికి తెలుస్తుంది. తన మొబైల్‌ను ఎక్కడో పారేయకుండా, తేలికభావంతో తనతోనే ఉంచేసి, కేవలం సిమ్ తీసేసుకోవడం

తనకు కలిసివస్తుంది. యాదగిరి ఒకవేళ వసుధతో వస్తే సరి, ఒంటరిగా వచ్చి తనూ ఇరుక్కుంటే మరింత కష్టమవుతుంది.... అనుకుని వీలైనంత త్వరగా ద్వివేదీతో సహా ఎలాగోలా బయటపడటమే మార్గమని నిర్ణయించుకుందామె....

కిటికీ తొలగించింది. ద్వివేదీ ఉన్న రూంవైపు నక్కినక్కి అడుగులేసింది.

వారి మాటలు వినిపిస్తున్నాయి. 'నీకో గంట సమయం ఇస్తున్నాం' అంటూ బయటికి వెళ్తున్న చప్పుడు విన్నది.

❄ ❄ ❄

'మేడమ్... ఆ ఇంటి నుంచే సిగ్నల్స్ ఉన్నాయి. తప్పకుండా అందులో ఆమె ఉందో లేదో తెలియదు గానీ ఆమె మొబైల్ మాత్రం అక్కడే ఉంటుంది... ఒక్కసారి ప్రహరీ దూకి చూసొస్తా...' అంటూ యాదగిరి వసుధకు చెప్పి అడుగులు వేశాడు. వెనుక పెద్దగా సెక్యూరిటీ లేని ప్రహరీ వైపు వెళ్లి దాన్ని సునాయాసంగానే దాటి లోపలికి దూకాడు. ఎందుకైనా మంచిదని కనిపించిన చెట్టు వెనక్కి వెంటనే దూకి దాక్కున్నాడు. మెయిన్ గేటు వద్ద నలుగురు, బిల్డింగు గుమ్మం వద్ద మరో నలుగురు మంచి ఆయుధాలు పట్టుకుని అలర్ట్‌గా ఉన్నారు... బిల్డింగ్ వెనుకవైపు నక్కినక్కి అడుగులు వేయసాగాడు యాదగిరి... వెళ్తూనే ఫోన్‌లో వసుధకు మెల్లిగా లోపల ఎందరు సాయుధులున్నారో వివరించాడు...

❄ ❄ ❄

వసుధ ఇక రిస్క్ తీసుకోదల్చుకోలేదు. యాదగిరి వెళ్లిపోగానే... ఫోన్‌లో స్పెషల్ పార్టీ పోలీసులను రమ్మంది. లొకేషన్ చెప్పింది. మూడు ఇన్నోవాలు పది నిమిషాల్లో వచ్చాయి. నిశ్శబ్దంగా కార్నర్ చేయడం మొదలెట్టారు... ఆమె ఆదేశాల కోసం చూస్తున్నారు...

❄ ❄ ❄

ద్వివేదీ ఉన్న గది కిటీకి ఇంతకుముందులాగే తొలగించింది దివిజ. అందులో నుంచి బయటపడ్డాడు ద్వివేదీ. తనకు మాత్రం ఏ వెపనూ లేదు. అకస్మాత్తుగా దాడి మొదలైతే రక్షణ కష్టం. అయినా మొండిగా ఇద్దరూ కలిసి మెట్లవైపు కదిలారు.

రజాక్, ఛాంగ్ ఇద్దరూ ఉన్న రూం బయట ఇద్దరు గన్ మెన్ లైట్ మెషీన్ గన్లతో కాపు కాస్తున్నారు. లోపల తప్పకుండా మరో ఇద్దరు ఉంటారు. అది తను చూసిందే ఇంతకుముందు...

వారికి కనిపించకుండా లోపలికి వెళ్లే వీలే లేదు. దీంతో స్ట్రెయిట్‌గానే దాడి ఆరంభించాలనుకుంది ఆమె. ఆల్ రెడీ తన వెపన్ ఎలా పనిచేస్తుందో తెలుసామెకు...

ధనామని తమ ఎదుట ప్రత్యక్షమైన ఆమెను చూసి ఒకే క్షణం కలవరపడిన గన్ మెన్ తమ ఎల్ఎంజీ గన్లను పైకి ఎత్తి, అన్ లాక్ చేసేలోపు పుణ్యకాలం హరించుకుపోయింది.

ఆమె చేతిలోని వెపన్ నిశ్శబ్దంగా పనిచేయడం మొదలెట్టింది. ఒకరి తరువాత మరొకరు... నేరుగా కళ్లల్లో నుంచి మెదడులోకి దూసుకుపోయిన రేడియో యాక్టివ్ హైబీమ్ కిరణాలు సున్నితమైన కణాలను కాల్చేశాయి. క్షణంలో ఆ ఇద్దరూ కుప్పకూలిపోయారు. కిందపడుతున్నప్పుడు గన్లు కింద పడి చప్పుడైంది.

'బయట ఏం జరుగుతున్నదో చూడండి...' అంటూ రజాక్ తన పక్కన నిల్చున్న ఇద్దరు గన్ మెన్లకు చెప్పాడు, వారి వెంట ఛాంగ్ కూడా బయల్దేరాడు... కాస్త వెనకగా ఉన్నాడతను.

వాళ్లు తలుపులు దాటి వచ్చేదాకా చూసి వెపన్ ఆన్ చేసింది... నిశ్శబ్దంగా కూలిపోయారు ఆ ఇద్దరూ... ఈలోపు మొదట కింద పడిన గన్ మెన్ల తాలూకు గన్ ఒకటి తీసుకుని స్టడీగా నిలబడ్డాడు ద్వివేదీ...

దూరం నుంచి దీన్ని గమనించిన ఛాంగ్ వెంటనే రజాక్‌ను అలర్ట్ చేశాడు... దివిజ ప్రయోగించేది సైలెన్సర్ ఉన్న గన్ అనుకున్నాడతను...

'అలర్ట్... రజాక్ డేంజర్, డేంజర్...' అంటూ ఆ గదికి వెనుకవైపు ఉన్న తలుపు వైపు పరుగు తీశాడు. రజాక్ కూడా వెంటనే అటు పరుగులు తీశాడు...

వెంటనే దివిజ లోనికి వచ్చినా, ద్వివేదీ అప్పటికే కాల్పులు కూడా ఆరంభించినా.... సోఫాలు, కుర్చీలకు అడ్డం పడి పరుగులు తీయడంతో రజాక్, ఛాంగ్ వాళ్ల రేంజీలోకి రాలేదు.

ఆ ఇద్దరూ వెనక తలుపు నుంచి దూసుకుపోతూ... 'సెక్యూరిటీ, సెక్యూరిటీ' అంటూ కేకలు వేయసాగారు. తన చేతిలో ఉన్న రిమోట్ అలారం బటన్ ప్రెస్ చేశాడు ఛాంగ్...

ఎక్కడెక్కడో మోగుతున్న అలారం వినిపిస్తూనే ఉంది... వాళ్ల వెంటే పరుగులు తీశారు ద్వివేదీ, దివిజ...

అలారం మోతలు వినగానే ఆ పక్కనే ఉన్న మరో రూం నుంచి

నలుగురైదుగురు ఆయుధాలతో బయటికి దూసుకొచ్చి దివిజ, ద్వివేదీవైపు కాల్పులు ఆరంభించారు.

ద్వివేదీ, దివిజ అటువైపు తిరిగి కాల్పులు మొదలెట్టడంతో ఇద్దరు వెంటనే కుప్పకూలిపోయారు. కానీ మరో రెండు వెపన్ల నుంచి దూసుకొచ్చిన బుల్లెట్లలో ఒకటి దివిజ చేతికి తాకి ఆమె వెపన్ ఎగిరిపోయింది. మరొకటి ద్వివేదీ ఛాతీలోకి దూసుకుపోయింది... భరించలేని నొప్పితో మోకాళ్ల మీదకు వంగిపోయాడు ద్వివేదీ... తనను పట్టుకుని ఓవైపు దొర్లుతూనే ఆ గన్ తీసుకుని కాల్చసాగింది ఆమె... ఆ బుల్లెట్లకు మరో ఇద్దరు నేలకూలిపోయారు. ఈలోపే వాళ్ల గన్ల నుంచి వెలువడిన బుల్లెట్లు గురి తప్పి ఎటో పోయాయి... ఒక బుల్లెట్ ఆమె తొడకు తగిలింది... నిప్పుల్లో కాల్చిన సూది తొడలోకి దూరినట్టు విపరీతంగా నొప్పి... లేవటానికి ప్రయత్నించింది కానీ... ఈలోపు అక్కడ చేరిన రజాక్ ఒక కాలితో ఆమె చేతిలోని గన్ అదిమిపట్టాడు. మరో కాలు ఆమె మెడపై వేసి తొక్కుతూ, తన తుపాకీని ఆమె వైపు గురిపెట్టాడు... ఆమె ఊపిరి ఆగిపోతోంది... కళ్లు మూతలు పడుతున్నాయి... ఛాంగ్ కూడా ఇంకోవైపు ఆమె వైపు చేరుకుని తనూ గురిపెట్టాడు తన వెపన్ని...

❄ ❄ ❄

లోపల తుపాకీ కాల్పుల శబ్దం వినిపించగానే... బయట వెయిట్ చేస్తున్న వసుధ అలర్టయింది. 'అటాక్' అంటూ ఆదేశాలిచ్చింది. వెంటనే నలుగురు ఒకవైపు నుంచి, మరో వైపు నుంచి నలుగురు స్పెషల్ పోలీసులు ప్రహరీ జంప్ చేశారు. కిందపడేలోపే కొందరు మెయిన్ గేట్ వైపు, మరికొందరు బిల్డింగ్ గుమ్మంవైపు కాల్పులు మొదలెట్టారు... వాళ్లు షీల్డ్ చేసుకోవటానికి స్కోప్ లేదు. అయినా బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు వేసుకోవడంతో కొంత సెక్యూర్డ్‌గా ఉన్నారు... నిర్దాక్షిణ్యంగా ఫైర్ చేస్తున్నారు. ఈలోపు వసుధ, మరో ఇద్దరు మెయిన్ గేటు బద్ధలు కొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంటి బయట పరిస్థితి పూర్తిగా ఆమె చేతిలోకి రావటానికి రెండంటే రెండే నిమిషాలు పట్టింది ఆమెకు...

బిల్డింగ్ గుమ్మం నుంచి లోనికి ప్రవేశించింది ఆమె. ఈలోపు రెండుసార్లు గన్ పేలిన చప్పుడు వినిపించింది.

లోపల ఎవరు ఎవర్ని కాలుస్తున్నారో తెలియదు, ఎవరి పరిస్థితి ఏమిటో తెలియదు...

❄ ❄ ❄

గన్ పేలిన శబ్దం వినగానే ఇక తన పనైపోయిందనే అనుకుంది దివిజ. రజాక్ నోటి నుంచి మూలుగు వినిపించేసరికి ఆశ్చర్యంతో కళ్లు తెరిచి చూసింది. రజాక్ తల పేలిపోయింది. వెనుక గన్ పట్టుకుని స్టడీగా ఉన్న యాదగిరి కనిపించాడు. ఆమె మెడపై ఉన్న రజాక్ కాలు తొలగిపోయింది, ఆమెకు గురిపెట్టి ఉన్న గన్‌తోపాటు ముందుకు విరుచుకుపడ్డాడు. తనపై పడకుండా మరోసారి పక్కకు దొర్లింది దివిజ. ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైన ఛాంగ్ తేరుకుని దివిజ వైపు తిరిగి గన్ పేల్చేసరికి ఆలస్యమైపోయింది. ఆమె చేతిలో గన్ నుంచి ఒకటి, యాదగిరి గన్ నుంచి మరొకటి బుల్లెట్లు ఛాంగ్ ఛాతీని ఛిద్రం చేశాయి. సరిగ్గా అదే సమయంలో వసుధ లోపలికి అడుగుపెట్టింది...ఓ మూలన పడి ఉన్న దివిజ వేవ్ గన్ తీసి జేబులో పెట్టుకున్నాడు యాదగిరి...

కొద్దినిమిషాల్లో ద్వివేదీని, దివిజను తీసుకుని సమీపంలోని ఓ కార్పొరేటు ఆసుపత్రివైపు దూసుకుపోయింది ఆమె వెహికిల్...

❄ ❄ ❄

ఐదు రోజుల తరువాత...

ఆఫీసులో కూర్చుని ఫైళ్లు చూసుకుంటోంది దివిజ. తూటాలు తీసి... ఆమె చేతికి, తొడకు బ్యాండేజీ వేసి తెల్లారే డిశ్చార్జి చేశారు డాక్టర్లు... ఇప్పుడిప్పుడే గాయాలు మానాయి. ఆ రోజే ఆఫీసులో అడుగుపెట్టిందామె. ద్వివేదీ ఢిల్లీ వెళ్లిపోయాడు. యాదగిరి ఎవరికో ఫోన్ చేసుకుంటున్నాడు... ఆమె మొబైల్ మోగింది...

నరసింహన్ నుంచి కాల్...

'ఎలా ఉందమ్మా ఇప్పుడు...? ప్రాణాలకు తెగించావు...'

'తప్పలేదు సార్... మా యాదగిరి, వసుధ రాకుండా ఉంటే తప్పకుండా నా ప్రాణాలు తీసేవారు...'

'నీ పాత ఇంపార్టెంట్ కేసులేమైనా ఉన్నాయా...'

'ప్రస్తుతానికి అన్నీ క్లియరైపోయాయి సార్... ఎందుకడుగుతున్నారు?'

'మీ యాదగిరిని తీసుకుని ఢిల్లీ రా ఒకసారి... ఓ ఇంపార్టెంట్ అసైన్‌మెంట్ ఉంది... వచ్చాక చెబుతా...'

'అలాగే సార్...' అని ఫోన్ పెట్టేసి... 'యాదీ, రేపు ఉదయం నీకూ నాకూ ఢిల్లీ ఫ్లయిట్ బుక్ చేయి, లెటజ్ గో...” అంది దివిజ.